www.peoplesnews.in

హైదరాబాద్

# పీపుల్స్ న్యూస్

ప్రజల గొంతుక...

దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 174 గురువారం, మార్చి 19, 2026, పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad


రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను

సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400




పాఠకులకు,ప్రకటన కర్తలకు, శ్రేయేభిలాషులకు,
మిత్రులకు మరియు విలేకరులకు
శ్రీ పరాభవనామ తెలుగు సంవత్సరాది

**ఉగాది శుభాకాంక్షలు**

పండుగ సందర్భంగా నేడు
మా కార్యాలయానికి సెలవు. కావున రేపు
( శుక్రవారం ) పత్రిక వేలువడదు.
తిరిగి పునర్ధర్శనం శనివారం

- ఎడిటర్ -

# గవర్నర్ ప్రసంగం దార్శనికతకు అద్దం



● తెలంగాణ విజన్‌ను ఆవిష్కరించాం ● చేసిందీ..చేయబోయేది స్పష్టం చేశాం ● సూచనలు ఇచ్చే ప్రయత్నం చేయని విపక్షం ● గవర్నర్‌ను ఆహ్వానించేందుకు కూడా రాని కెసిఆర్ ● ఇంకా అహంకార ధోరణి వీడని కొందరు నేతలు ● కెసిఆర్ సభకు వచ్చి సూచనలు సలహాలు ఇవ్వాలి ● జీతాలు తీసుకుంటూ సభకు రాకుంటే ఎలా..? ● గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానానికి సిఎం సమాధానం

**హైదరాబాద్,మార్చి 18 :** గవర్నర్ ప్రసంగం ద్వారా రాష్ట్ర భవిష్యత్తు ప్రణాళికలు వివరించామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఎలా ముందుకు పోవాలో..పోతున్నదో ఇందులో వివరించామని అన్నారు. తెలంగాణ విజన్‌ను ఆవిష్కరించిందన్నారు. గవర్నర్‌తో చర్చించిన తర్వాతే ప్రసంగాన్ని తయారు చేశామన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో సీఎం మాట్లాడారు. 'రాజులు పోయినా.. రాజ్యాలు పోయినా.. రాచరికపు పోకడలు పోలేదు. కొందరు ఇంకా తమను తాము రాజులుగా భావిస్తున్నారు. నియంత పోకడలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు అదే అహంకార ధోరణి.. లేనప్పుడూ అదే ధోరణి అని ప్రతిపక్షంపై సీఎం మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే నాయకులని పేర్కొన్నారు.కొత్త గవర్నర్‌ను కలిసేందుకు ప్రతిపక్ష నేత వస్తారనుకున్నాం. ప్రధాన ప్రతిపక్షం కూడా గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతుందనుకున్నాం. గవర్నర్ ప్రసంగంపై సూచనలు, సలహాలు వస్తాయనుకున్నాం. ప్రధాన ప్రతిపక్షం నుంచి కనీస స్పందన రాలేదు. కేసీఆర్ సభకు రావాలని కోరుకుంటున్నాం. ఆయన సభలో పాల్గొని సూచనలు, సలహాలు ఇవ్వాలని అన్నారు. ఇదే సందర్భంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి ఫైర్ అయ్యారు. రాష్ట్రానికి కొత్త గవర్నర్ వచ్చిన కనీసం శుభాకాంక్షలు తెలిపేందుకైన ప్రధాన మిగతా2లో...

# ప్రజా సేవలో పదవీ విరమణ లేదు

రాజ్యసభ ఓ ఓపెన్ యూనివర్సిటీ

సీనియర్ సభ్యుల సేవలు ఇతరులకు ఆదర్శం

రిటైర్ అవుతున్న రాజ్యసభ సభ్యుల వీడ్కోలులో ప్రధాని మోడీ

మాతో ప్రేమాయణం..మోడీతో అనుబంధం

దేవేగౌడపై ఖర్గే ఛతురోక్తులు



**న్యూఢిల్లీ,మార్చి 18 :** రాజ్యసభలో పదవీ విరమణ చేస్తున్న సభ్యులను ఉద్దేశించి ప్రధానమంత్రి మోదీ మాట్లాడుతూ, పదవీకాలం ముగిసినంత మాత్రాన ప్రజాసేవ ముగిసినట్టు కాదన్నారు. రాజ్యసభ మేధావుల వేదిక అని, ఇక్కడ లభించే జ్ఞానానికి విలువ కట్టలేమని అన్నారు. హెచ్‌డీ దేవెగౌడ, మల్లికార్జున్ ఖర్గే, శరద్ పవార్ వంటి దిగ్గజ నేతల సహకారాన్ని మరువలేమని, సగానికి పైగా తమ జీవితాన్ని పార్లమెంటుకే అంకితం చేశారని ప్రశంసించారు. కొత్తగా ఎన్నికైన ఎంపీలు వారి నుంచి నేర్చుకోవాల్సినది ఎంతైనా ఉంటుందని సూచించారు.రాజకీయాల్లో ఫుల్‌స్టాప్ ఉండదని ప్రధాని మోదీ అన్నారు. మిగతా2లో...


## 22న నర్మెట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం

మండలి చైర్మన్, స్పీకర్, కేటీఆర్, హరీశ్‌ను
ఆహ్వానించిన మంత్రి తుమ్మల



# మూసీ ప్రక్షాళన పేరుతో లక్షన్నరకోట్ల దోపిడీ

● డిపిఆర్ లేదు..ప్రణాళిక లేకుండా ఎలా..? ● మూసీ ప్రక్షాళనపై స్పష్టత లేని ప్రభుత్వం ● పేదల ఇళ్లు కూల్చివేత దారుణం ● బఫర్ జోన్ నిర్ణయంలోనూ అస్పష్టత ● అసెంబ్లీలో మూసీ ప్రక్షాళనపై నిలదీసిన కెటిఆర్ ● ప్రభుత్వ తీరుకు నిరసనగా బిఆర్ఎస్ వాకౌట్



**హైదరాబాద్,మార్చి 18 :** మూసీ నది ప్రక్షాళనకు తమకు ఎలాంటి వ్యతిరేకత లేదని, అయితే ప్రభుత్వం మూసీ ప్రాజెక్ట్ పేరుతో లక్షన్నర కోట్ల రూపాయల దోపిడీకి పాల్పడుతున్నందున దాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ అంశంపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా బుధవారం అసెంబ్లీ నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ మేరకు అసెంబ్లీ మిగతా2లో...



# ఢిల్లీ అగ్నిప్రమాదంలో 9మంది మృతి

నాలుగు అంతస్థుల భవనం అగ్నికి ఆహుతి

**న్యూఢిల్లీ,మార్చి 18 :** ఢిల్లీలోని పాలెంలో అగ్నిప్రమాదం జరిగిన ఘటనలో 9 మంది మృతిచెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు. రామ్ చౌక్ మార్కెట్‌లో ఉన్న 4 అంతస్తుల భవనంలో ఉదయం 7 గంటలకు మిగతా2లో...

## ప్రముఖుల ఉగాది శుభాకాంక్షలు

తెలంగాణ ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ఉగాది శుభాకాంక్షలు



2లో

# మొయినాబాద్ డ్రగ్స్ కేసులో సిట్ వేశాం

● నిబంధనల మేరకే స్టేషన్ బెయిల్ ● 2029లోనే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ● ఢిల్లీలో సిఎం రేవంత్ రెడ్డి




**న్యూఢిల్లీ,మార్చి 18 :** మొయినాబాద్ డ్రగ్స్ కేసుపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. దీనిలో తమ ప్రమేయం ఏమీ లేదని ఆయన చెప్పారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన మీడియాతో మాట్లాడారు. మొయినాబాద్ డ్రగ్స్ కేసులో నిబంధనల ప్రకారమే స్టేషన్ బెయిల్ ఇచ్చారు. దీనిలో మా ప్రమేయం ఏమీ లేదు. ఈ వ్యవహారంపై దర్యాప్తునకు సిట్ వేశాం అని చెప్పారు. 2029లోనే తెలంగాణలో ఎన్నికలు జరుగుతాయని సీఎం అన్నారు. 2028లో ఎన్నికలు రావని చెప్పారు. మహిళా రిజర్వేషన్లు ముందుగా మిగతా2లో...

# అనుకున్న సమయానికి పోలవరం పూర్తి

గత పాలకలు తీరుతో ప్రాజెక్టులో జాప్యం

నిర్వాసితులతో సిఎం చంద్రబాబు సమావేశం

నిర్వాసితులకు రూ.226 కోట్ల చెక్కు అందచేత



**అమరావతి,మార్చి 18 :** పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణాన్ని అనుకున సమయానికి పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. గత ప్రభుత్వం వల్ల ఆలస్యం జరిగిందని అన్నారు. సకాలంలో పూర్తి చేసి గోదావరి జలాలను అందుబాటులోకి తెస్తామని అన్నారు. ఈ సందర్భంగా ముంపు గ్రామాల నిర్వాసితులతో మిగతా2లో...

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక




## ప్రజాసేవలో పదవీ విరమణ లేదు


(మొదటి పేజీ తరువాయి)


ఆయన రాజ్యసభలో ప్రసంగించారు. 59 మంది సభ్యులు రిటైర్ అవుతున్న నేపథ్యంలో ఆయన మాట్లాడారు. తన సందేశంతో ఆ సభ్యులకు వీడ్కోలు పలికిన ప్రధాని మోదీ మాట్లాడుతూ పార్లమెంట్ ఓ ఓపెన్ యూనివర్సిటీ లాంటిదన్నారు. రిటైర్ అయి వెళ్లిపోతున్న ఎంపీలు.. దేశం కోసం తమ విధులను నిర్వర్తిస్తూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఫేర్‌వెల్ లాంటి సందర్భాల్లో పార్టీల మధ్య ఉన్న విబేధాలు సమసిపోతాయన్నారు. మనలో ఒకేరకమైన భావోద్వేగం వస్తుందని, మనతో ఇన్నాళ్లు పనిచేసిన తోటి సభ్యులు తమ జీవితంలో మరో మార్గాన్ని అన్వేషించబోతున్నారని గ్రహిస్తామని ప్రధాని పేర్కొన్నారు. అయితే మళ్లీ రాజ్యసభకు రాలేని వారిని ఉద్దేశిస్తూ.. రాజకీయాల్లో ఫుల్ స్టాప్ అంటూ ఉండదని, మీ కోసం భవిష్యత్తు ఎదురుచూస్తోందని, ఈ దేశ నిర్మాణం కోసం మీ అనుభవాలు చాలా అవసరం ఉంటుందని ప్రధాని తెలిపారు. డిప్యూటీ చైర్మెన్ హరివంశ్ గురించి కూడా ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆయన చాలా మృదుస్వభావి అని అన్నారు. కానీ నిత్యం కార్యాచరణలో నిమగ్నమై ఉంటాడన్నారు. కేంద్ర మంత్రి రాందాస్ అత్వాలే గురించి మాట్లాడుతూ ఆయన నిజంగా ఎవర్‌గ్రీన్ అన్నారు. సభ బయట కూడా ఆయన వ్యంగాన్ని , హాస్యాన్ని ప్రదర్శించాలని ఆశించారు. పార్లమెంట్ పక్రియలో ఉన్న ఉభయసభల విధానం గురించి ప్రధాని మోదీ ప్రస్తావిస్తూ.. ఓ చట్టానికి ఆమోదం దక్కాలంటే రెండో అభిప్రాయం అవసరంమని, అలాంటి విధానం వల్ల ప్రజాస్వామ్యం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. ఒక సభలో తీసుకున్న నిర్ణయం.. రెండో ఓపీనియన్ కోసం మరో సభకు వెళ్తుందని, అక్కడ జరిగిన చర్చతో నిర్ణయాత్మక విధానం కొత్త రూపు సంతరించుకుంటుదని ప్రధాని అన్నారు. రాజ్యసభలో పదవీకాలం ముగిసిన సభ్యుల వీడ్కోలు సభలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే బుధవారం నాడు కాసేపు నవ్వులు పూయించారు. మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడను ఉద్దేశించి మాట్లాడుతూ, గత 54 ఏళ్లుగా ఆయన తనకు తెలుసని, ఆయనతో కలిసి పనిచేశానని చెప్పారు. 'అయితే ఏమి జరిగిందో తెలియదు కానీ, ఆయన మాతో ప్రేమ సాగించి మోదీని పెళ్లి చేసుకున్నారు' అంటూ చమత్కరించారు. దీంతో సభలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సహా సభ్యులంతా నవ్వులు చిందించారు. దేశానికి సేవ చేయాలనే తపన కలిగిన వారు రాజకీయాల్లో, ప్రజా జీవితంలో ఎన్నడూ అలసిపోరని ఖర్గే అన్నారు. దేవెగౌడ 1996 లోక్‌సభ ఎన్నికల తర్వాత సుమారు ఒక ఏడాది పాటు ప్రధానమంత్రిగా ఉన్నారు. దేవెగౌడ సారథ్యంలోని యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వానికి కాంగ్రెస్ మద్దతిచ్చింది. 2018 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో హెచ్‌డీ దేవెగౌడ 'జేడీఎస్'తో కాంగ్రెస్ పొత్తు సాగించింది. ఆ కూటమి విజయం సాధించింది. దేవెగౌడ కుమారుడు హెచ్‌డీ కుమారస్వామి ముఖ్యమంత్రి అయ్యారు. అయితే 2019లో పలువురు కాంగ్రెస్, జేడీఎస్ ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేయడంతో కుమారస్వామి ప్రభుత్వం కూలిపోయింది. ఆ తర్వాత బీజేపీతో జేడీఎస్ పొత్తు పెట్టుకుంది. కాగా, రాజ్యసభ సభ్యుల వీడ్కోలు సెషన్‌లో శరద్ పవార్, డీఎంకే నేత తిరుచ్చి శివతో తన అనుబంధాన్ని కూడా ఖర్గే గుర్తుచేసు కున్నారు. అయితే పవార్, తిరుచ్చి శివ తిరిగి రాజ్యసభకు రాబోతున్నారు. ఖర్గే తన ప్రసంగంలో కేంద్ర మంత్రి, ఆర్‌పీఐ(ఏ) చీఫ్ రామ్‌దాస్ అథవాలేపై కూడా ఛలోక్తులు విసిరారు. 'ఆయన ఎప్పుడూ తన కవితల్లో మోదీని పొగుడుతుంటారు. ఆయనకు మరే ఇతర కవితలు తెలియవేమో' అంటూ చమత్కరించారు.

## గవర్నర్ ప్రసంగం దార్శనికతకు అద్దం


(మొదటి పేజీ తరువాయి)


ప్రతిపక్ష నేత హోదాలో ఉన్న కేసీఆర్ సభ రాడా.. సభకు రావాల్సిన బాధ్యత లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియంత పోకడలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని.. బీఆర్‌ఎస్‌ను ఓడించి ప్రజలే తప్పు చేసినట్లుగా కేసీఆర్ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అధికారం పోయినా ఇంకా అదే అహంకారంతో ఉన్నారని దుయ్యబట్టారు. కేసీఆర్ ఇప్పటికైనా సభకు రావాలని విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. ఆయనకు ఉన్న అనుభవంతో ప్రభుత్వానికి సలహాలు, సూచనలు చేస్తే స్వీకరిస్తామని తెలిపారు. 4 కోట్ల ప్రజలను నిరాశ పర్చేలా ప్రతిపక్షాల తీరు ఉందని తమ ప్రభుత్వం భవిష్యత్ ప్రణాళికలతో ముందుకెళు_ందని స్పష్టం చేశారు. గవర్నర్ ప్రసంగం చారిత్రాత్మకం. గవర్నర్ ప్రసంగం తెలంగాణ అభివృద్ధికి విశిష్ట ప్రణాళిక. ప్రతిపక్షం కూడా గవర్నర్ ప్రసంగానికి హుందాగా ధన్యవాదాలు తెలుపుతుందని ఆశించాం. అభివృద్ధిలో కలిసి వస్తారని ఆశించాం.. కానీ అహంకారం ప్రదర్శించారు. 4 కోట్ల మంది ప్రజలను నిరాశ పర్చేలా ప్రతీపక్షాల తీరు ఉందన్నారు. ఆరోపణలు, ప్రత్యారోపణలతో సభను పక్క దారి పట్టించారు. ప్రతిపక్షంలో కూర్చొబెట్టిన వాళ్ల తీరు మారలేదు. సభ సంప్రదాయాలను విపక్ష నేత గౌరవించకపోవడం రాష్ట్రానికి మాయని మచ్చ. ప్రతిపక్ష నాయకుడు ఇప్పటిదాకా కోటీ 6 లక్షలకు పైగా జీతభత్యాలు పొందారు. కేసీఆర్ ఇప్పటికైనా సభకు రావాలని అన్నారు. ప్రపంచ దిగ్గజ ఐటీ కంపెనీలు హైదరాబాద్‌లో ఏర్పాటయ్యేందుకు మాజీ ప్రధాని పీవీ విధానాలే కారణం. పీవీ నరసింహారావు, నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి తొలిసారి హైటెక్ సిటీకి పునాది రాయి వేశారు. అనంతరం చంద్రబాబు, వాజ్‌పేయి హైటెక్ సిటీని పూర్తి చేశారు. గవర్నర్ ప్రసంగం కేవలం ప్రభుత్వ కార్యక్రమాల జాబితా కాకుండా, భవిష్యత్తు తెలంగాణకు ఒక విజన్ డాక్యుమెంట్‌గా నిలిచిందని పేర్కొన్నారు. గవర్నర్ ప్రసంగం తెలంగాణ ప్రజల ఆశయాలను ప్రతిబింబించిందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి పట్ల ప్రభుత్వ సంకల్పాన్ని చూపించిందని చెప్పుకొచ్చారు. భవిష్యత్ ఆర్థిక ప్రణాళికలకు బలమైన పునాది వేసిందని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ, రాష్ట్ర అభివృద్ధి పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న సంకల్పాన్ని, గొప్ప విజన్‌ను గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆవిష్కరించారని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

## అనుకున్న సమయానికి పోలవరం పూర్తి


(మొదటి పేజీ తరువాయి)


ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం సమావేశం నిర్వహించారు. పునరావాస పరిహార ప్యాకేజీ మూడో విడతలో భాగంగా నిర్వాసితులకు రూ.226 కోట్ల చెక్కును సీఎం అందించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్ట్ రాష్ట్రానికి జీవనాడి అని, నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రయోజనాలు చేకూరుతాయని తెలిపారు. గత పాలకులు నిర్వాసితులను పట్టించుకోకుండా, వరదల్లో ప్రజలు మునిగిపోతున్నా నిర్లక్ష్యంగా వదిలేశారని సీఎం విమర్శించారు. ప్రాజెక్టు కోసం తమ ఇళ్లు, భూములను త్యాగం చేశారని సీఎం తెలిపారు. ఉగాది పండుగ సందర్భంగా రూ.226.6 కోట్లను నిర్వాసితుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు ప్రకటించారు. గతంలో సంక్రాంతి సందర్భంగా మొదటి విడతగా రూ.800 కోట్లు, దీపావళి సమయంలో రెండో విడతగా రూ.916 కోట్లు చెల్లించినట్లు గుర్తుచేశారు. 21 నెలల్లో 26,149 మంది నిర్వాసితులకు మొత్తం రూ.1,943.53 కోట్లు చెల్లించామని వివరించారు. మూడోసారి గోదావరి పుష్కరాల నిర్వహణకు ముందే ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రాజెక్ట్ పూర్తికి మరో రూ.5 వేల కోట్లు అవసరమని, ఒక వంతెన కూడా నిర్మిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. నిర్వాసితుల త్యాగానికి ప్రతిఫలం పోలవరం ప్రాజెక్ట్ అని సీఎం పేర్కొన్నారు. నిర్వాసితులకు పారదర్శకంగా చెల్లింపులు జరుపుతున్నామని చెప్పారు. దళారులను నమ్మవద్దని సూచించారు. ప్రాజెక్ట్ ప్రారంభానికంటే ముందే నిర్వాసితులందరికీ న్యాయం చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. పోలవరం నిర్వాసితుల పట్ల కూటమి ప్రభుత్వానికి కమిట్‌మెంట్ ఉందని.. నిర్వాసిత యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ కూడా చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ప్రాజెక్ట్ రెండు దశలుగా నిర్మాణం జరుగుతోందన్నారు సీఎం. తొలి దశలో 38,068 మంది నిర్వాసితులు ఉన్నారని తెలిపారు. ప్రతి నిర్వాసితుడికి ఇంటి నిర్మాణానికి రూ.3.5 లక్షలు ఇస్తున్నామని, ఇంటి జాగా కోసం రూ.2 లక్షలకు పెంచినట్లు వివరించారు. కేంద్ర ప్రాజెక్ట్ అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో పనులు చేపడుతోందని తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా డయాఫ్రం వాల్ దెబ్బతిన్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యంతో రూ.440 కోట్ల వ్యయంతో కట్టిన డయాఫ్రం వాల్ కొట్టుకుపోయిందని.. ఇప్పుడు మళ్లీ రూ.వెయ్యి కోట్లతో నిర్మాణం చేపట్టామన్నారు. 6 -7 ఏళ్ల పాటు ప్రాజెక్ట్ ఆలస్యమై పోయిందని.. ప్రాజెక్టు ఏమైనా పర్వాలేదనే అహంకార ధోరణితో గత పాలకులు వ్యవహరించారని మండిపడ్డారు. వారం రోజుల్లో డయాఫ్రం వాల్ పూర్తవుతుందని, ప్రాజెక్ట్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు.

## మొయినాబాద్ డ్రగ్స్ కేసులో సిట్ వేశాం


(మొదటి పేజీ తరువాయి)


అమల్లోకి వస్తే మంచిదేనని అభిప్రాయపడ్డారు. అంతకుముందు పార్లమెంట్‌లో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీలను రేవంత్‌రెడ్డి కలిశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తో కలిసి వెళ్లి వారితో సమావేశమయ్యారు. ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన వేం నరేందర్‌రెడ్డిని రాహుల్, ప్రియాంకలకు రేవంత్ పరిచయం చేశారు. పార్లమెంట్‌లో వైసీపీ నేత, మాజీ మంత్రి రోజా సీఎం రేవంత్ రెడ్డి, ఎదురుపడ్డారు. వారిరువురు ఒకరినొకరు పలకరించుకున్నారు.


## అప్పులబాధతో కొడుకు.. గుండెపోటుతో తల్లి మృతి

- జగిత్యాల జిల్లాలో విషాద ఘటన

**జగిత్యాల,మార్చి 18 :** జగిత్యాల అర్బన్ మండలం మోతెలో విషాదం నెలకొంది. తల్లి, కొడుకు ఒకే రోజు మృతి చెందారు. గ్రామానికి చెందిన దొడ్ల సంపత్ (25) అనే యువకుడు అప్పుల బాధతో మంగళవారం సాయంత్రం ఆత్మహత్యకు యత్నించాడు. కరీంనగర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా.. బుధవారం మృతి చెందాడు. పోస్టుమార్టమ్ నిమిత్తం మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కొడుకు మృతితో ఏడుస్తూ అతడి తల్లి మల్లవ్వ (60) గుండెపోటు వచ్చి కుప్పకూలింది. అదే ఆస్పత్రిలో చికిత్స అందించినప్పటికీ ఆమె మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు.

## ఇరాన్‌కు వరుస ఎదురు దెబ్బలు

- ఇంటెలిజెన్స్ మంత్రి ఇస్మయిల్ ఖతీబ్ హతం
- ప్రకటించిన ఇజ్రాయిల్ రక్షణమంత్రి



**టెహ్రాన్,మార్చి 18 :** సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనే మరణం తర్వాత ఇరాన్‌కు దెబ్బమీద దెబ్బ తగులుతోంది. టెహ్రాన్‌పై రాత్రికి రాత్రి జరిపిన దాడుల్లో ఇరాన్ ఇంటెలిజెన్స్ మంత్రి ఇస్మయిల్ ఖతీబ్ మృతి చెందినట్టు ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయిల్ కట్జ్ బుధవారం నాడు ప్రకటించారు. ఇరాన్ సీనియర్ అధికారులు ఎవరినైనా సరే ఎలాంటి అదనపు అనుమతులు అవసరం లేకుండా మట్టుబెట్టాలని మిలిటరీకి ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహు స్వేచ్ఛనిచ్చినట్టు ఆయన తెలిపారు. అయితే ఇస్మయిల్ ఖతీబ్ మృతి వార్తలను ఇరాన్ ఇంకా ధ్రువీకరించలేదు. కాగా, ఇస్మయిల్ ఖతీబ్ మృతికి ఒక రోజు ముందే ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ చీఫ్ అలీ లారిజానీ సైతం ఇజ్రాయెల్ దాడుల్లో మరణించారు. ఆయనతో పాటు ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్స్ కోర్(ఐఆర్‌జీసీ) పారామిలిటరీ దళం 'బసిజ్ ఫోర్స్' కమాండర్ గోలం రెజా సోలేమానీ, పెద్ద సంఖ్యలో మిలిటరీ ఉన్నతాధికారులు తమ దాడుల్లో మృతిచెందినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇజ్రాయెల్ దాడులకు ప్రతిగా ఆదేశంలోని 100 టార్గెట్లను లక్ష్యంగా చేసుకున్నట్టు ఇరాన్ తెలిపింది. ఉద్రిక్తతలను తగ్గించే ప్రతిపాదనను ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ తోసిపుచ్చారు. శాంతికి ఇది సమయం కాదని, ఓటమిని అంగీకరించి నష్టపరిహారం ఇచ్చేంతవరకూ అమెరికా, ఇజ్రాయెల్‌తో శాంతి కుదరదని చెప్పారు.

## ఢిల్లీ అగ్నిప్రమాదంలో 9మంది మృతి


(మొదటి పేజీ తరువాయి)


అగ్నిప్రమాదం చోటుచేసుకున్నది. ఆ సమయంలో చాలా మంది నిద్రలో ఉన్నట్లు తెలుస్తోంది. ఆ భవనం బేస్మెంట్, గ్రౌండ్‌ఎ÷-లోర్‌లో బట్టల దుకాణంతో పాటు కాస్మెటిక్స్ షోరూం కూడా ఉన్నది. అయితే బిల్డింగ్‌లోని టాప్ రెండు ఫ్లోర్లలో ఆ ఇంటి యజమానులు ఉంటున్నారు. అగ్నిప్రమాదంలో మృతిచెందిన వారిని ప్రవేశ్, కమాల్, ఆశు, లాడో, హిమాన్షి, దీపికతో పాటు ముగ్గురు మైనర్ బాలికలు ఉన్నారు. అనిల్, సచిన్‌తో పాటు మరో రెండు ఏళ్ల అమ్మాయి గాయపడ్డారు. ప్రస్తుతం వారికి చికిత్స కొనసాగుతోంది. పాలంకు చెందిన పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు. ఢిల్లీ అగ్నిమాపక సిబ్బందితో పాటు పోలీసులు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. బిల్డింగ్ ఓనర్‌ను రాజేంద్ర కశ్యప్‌గా గుర్తించారు. కుటుంబసభ్యులు బిల్డింగ్‌లోని రెండో, మూడో ఫ్లోర్లలో నివసిస్తున్నారు. 20 ÷ర్ టెండర్లు, 11 సీఏటీఎస్ అంబులెన్సులు, బీఎస్ఈఎస్ , ఎయిర్ ఫోర్స్ పోలీసు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. ప్రమాదం జరిగిన ప్రాంతానికి ఫోరెన్సిక్ బృందం చేరుకున్నది. స్థానిక పోలీసులు ఘటనపై విచారణ చేస్తున్నారు.

## ప్రముఖుల ఉగాది శుభాకాంక్షలు

**హైదరాబాద్,మార్చి 18 :** తెలుగు ప్రజలను ప్రముఖులు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఉభయ రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రులు, విపక్ష నేతలు ఉగాది శుభాకాంక్షలు తెలియచేశారు. కొత్త సంవత్సరంలో అంతా శుభం జరగాలని ఆకాంక్షించారు. గవర్నర్లు అబ్దుల్ నజీర్, శుక్లా, సిఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి, విపక్ష నేతలు కెసిఆర్, జగన్‌లు శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాని మోడీ కూడా తెలుగు ప్రజలకు ఉగాధి శుభాకాంక్షలు తెలియచేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. నేటినుంచిశ్రీ పరాభవ నామ తెలుగు సంవత్సరం ప్రారంభం కానుంది. కొత్త సంవత్సరంలో రాష్ట్ర ప్రజలకు శుభం కలగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. కొత్త ఏడాదిలో కాలం కలిసి రావాలని, సమృద్ధిగా వానలు కురిసి, పాడి పంటలతో రైతుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని ముఖ్యమంత్రి అభిలషించారు. గత సంవత్సరం ఉగాది పండుగ రోజున రాష్ట్రంలో రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఉచితంగా సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించామని సీఎం గుర్తు చేశారు. ఈ ఏడాదిలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మెరుగైన అభివృద్ధి సాధించి దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలు చాటిచెప్పేలా అందరూ ఉగాది పండుగను సంతోషంగా జరుపుకోవాలని సీఎం అన్నారు.

## మూసీ ప్రక్షాళన పేరుతో లక్షన్నరకోట్ల దోపిడీ


(మొదటి పేజీ తరువాయి)


నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. అసెంబ్లీలో మూసీ ప్రక్షాళనపై బీఆర్ఎస్ సభ్యులు అడిగిన ప్రశ్నకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన దాటవేసే ధోరణిలో సమాధానం ఇవ్వడంపై కేటీఆర్ మండిపడ్డారు. ప్రభుత్వం దగ్గర పైసలు లేవు.. ప్రణాళికలు లేవని విమర్శించారు. మూసీ ప్రక్షాళనకు మేం వ్యతిరేకం కాదు.. లక్షన్నర కోట్ల దోపిడీకి మాత్రమే వ్యతిరేకమని స్పష్టం చేశారు. మూసీ ప్రక్షాళనపై అసెంబ్లీలో బుధవారం జరిగిన చర్చ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కేటీఆర్ పలు ప్రశ్నలు సంధించారు. మూసీ ప్రాజెక్టు కోసం రుణం మంజూరైందని గతంలో మంత్రి చెప్పారని తెలిపారు. డీపీఆర్ కూడా సబ్‌మిట్ చేయలేదని అప్పుడు ఏడీబీ చెప్పిందని పేర్కొన్నారు. రుణం మంజూరు కాలేదని ఈ నెల 11వ తేదీన ఏడీబీ లేఖ ఇచ్చిందన్నారు. డీపీఆర్ తయారీకి 18 నెలలు పడుతుందని గతంలో ప్రభుత్వం చెప్పిందని గుర్తుచేశారు. 18 నెలలు పడుతుందన్న డీపీఆర్ రెండు నెలల్లో ఎలా వచ్చిందని ప్రశ్నించారు.మూసీ ప్రాజెక్టు మొదటి ఫేజ్ తర్వాత ఎన్ని ఫేజులు ఉంటాయని కేటీఆర్ అడిగారు. మూసీ ప్రాజెక్టుకు ఎన్ని ఫేజులు ఉన్నాయని ప్రశ్నించారు. రూ.16వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టు లక్షన్నర కోట్లు ఎందుకు అని నిలదీశారు. మూసీ ప్రాజెక్టులో బఫర్ జోన్ ఎంత అని ప్రశ్నించారు. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టుతో వేలాది మంది నష్టపోతున్నారని తెలిపారు. మూసీ ప్రాజెక్టుతో రేవంత్ సర్కార్ గృహ మేధ యాగం చేస్తోందని మండిపడ్డారు. బ్లాక్ లిస్ట్ చేసిన కంపెనీలకు కాంట్రాక్టు ఎందుకిస్తున్నారని ప్రశ్నించారు. డీపీఆర్ లేకుండా హడావిడిగా ఇళ్లు ఎందుకు కూలుస్తున్నారని అడిగారు. కేటీఆర్ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక నీళ్లు నమిలిన ప్రభుత్వం.. దాటవేసే ధోరణిలో వ్యవహరించింది. దీంతో బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. మూసీపై రేవంత్ సర్కార్ తీరుకు నిరసన తెలిపారు. ముఖ్యంగా డీపీఆర్ తయారీ, ఇళ్ల కూల్చివేతలు, భూసేకరణ, ప్రాజెక్ట్ వ్యయం పెంపు, అలాగే ప్రభుత్వం చేస్తున్న విభిన్న ప్రకటనలలో ఉన్న విరుద్ధతలను ఎత్తిచూపుతూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

## తెలంగాణ సిఎస్ పదవీకాలం పొడిగింపు

**హైదరాబాద్,మార్చి 18 :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు పదవీ కాలం పొడిగింపుపై గత కొద్దిరోజులుగా సాగుతున్న ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. ఆయన సర్వీసును మరో మూడు నెలల పాటు పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వ పర్సనల్ అండ్ ట్రైనింగ్ విభాగం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి అధికారిక ఉత్తర్వులు అందాయి. తాజా పొడిగింపుతో రామకృష్ణారావు జూన్ నెలాఖరు వరకు తెలంగాణ సీఎస్‌గా బాధ్యతలు నిర్వహించనున్నారు. వాస్తవానికి రామకృష్ణారావు గతేడాది ఆగస్టు 31నే పదవీ విరమణ చేయాల్సి ఉంది. అయితే.. రాష్ట్రంలో పాలనాపరమైన అవసరాలు, కీలక ప్రాజెక్టుల అమలు దృష్ట్యా ఆయన సేవలు మరికొంత కాలం అవసరమని భావించిన ప్రభుత్వం, గతంలోనే ఏడు నెలల పొడిగింపు కోరింది. ఆ గడువు ఈ ఏడాది మార్చి 31తో ముగియనుంది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం మరోసారి కేంద్రానికి విన్నవించగా, సానుకూల స్పందన లభించింది.

## 22న నర్మెట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం

**హైదరాబాద్, మార్చి 18 :** సిద్దిపేట జిల్లా నర్మెటలో నిర్మించిన ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని ఈ నెల 22న ప్రారంభించనున్నట్టు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ ఫ్యాక్టరీని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని చెప్పారు. బుధవారం సచివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరుకావాలంటూ మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్, ప్రతిపక్ష సభ్యులు కేటీఆర్, హరీశ్‌రావుకు ఆహ్వానాలు అందించినట్టు వెల్లడించారు.మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజా ప్రతినిదులందరికీ ఆహ్వానాలు అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు రైతు ఉత్సవాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నా రు. ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ దగ్గర రూ.80 కోట్లతో నిర్మించే రిఫైనరీ యూనిట్‌కి శంకుస్థాపన చేయనున్నట్టు మంత్రి తెలిపారు.



# వీరబ్రహ్మేంద్రస్వామి బోధించిన జ్ఞానమార్గం, కాలజ్ఞానం నేటికీ మార్గదర్శకంగా నిలుస్తాయి

**-ఎస్ఐ లడే లింగారావు**

**-వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయానికి రూ. 20,116 వేలు విరాళం అందజేత**



**మొగుళ్ళ పల్లి ప్రతినిధి మార్చి 18 (పీపుల్స్ న్యూస్):** 17వ శతాబ్దానికి చెందిన శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి అత్యంత ప్రసిద్ధి చెందిన కాలజ్ఞాని మరియు సంఘ సంస్కర్త అని, స్వామి వారు బోధించిన జ్ఞానమార్గం మరియు కాలజ్ఞానం నేటికి భక్తులకు మార్గదర్శకంగా నిలుస్తాయని వరంగల్ నగరంలో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ లడే లింగారావు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలో జన్మించిన లడే లింగారావు ఆధ్యాత్మిక భావాలను పునికి పుచ్చుకున్నాడు. ఈ క్రమంలో మొగుళ్ళపల్లి గ్రామస్తులు నిర్మిస్తున్న శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారి దేవాలయానికి ఆయన రూ. 20,116 వేల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వైయస్సార్ కడప జిల్లాలోని కందిమల్లయ్య పల్లెలో నివసించి 1963లో సజీవ సమాధి నిష్టనొందారన్నారు. వేలాది భవిష్యత్ విషయాలను ఆయన పద్య, వచన రూపంలో అందించారని, కాలజ్ఞానంలో ఏ ఒక్క మాట పొల్లు పోకుండా జరిగి తీరునమ్మా అని భక్తులు నమ్ముతారన్నారు. ఈ సందర్భంగా గుడి నిర్మాణానికి విరాళాన్ని అందజేసిన ఎస్ఐ లడే లింగారావుకు విశ్వకర్మ కులస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# మదీనా మజీద్ లక్ష్మీదేవి పేటలో ఈద్ ముబారక్ రంజాన్ తోఫా పంపిణీ





**ములుగు జిల్లా ప్రతినిధి మార్చి 18( పీపుల్స్ న్యూస్) :**ఈ కార్యక్రమం తెలంగాణ స్టేట్ మైనార్టీ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ సర్వర్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ వంశవతి రమేష్, ఉపసర్పంచ్ కొండ తిరుపతి అంబేద్కర్ వాది కొత్తపెల్లి ఆనందం, కలాం ఫౌండేషన్ ఆర్గనైజేషన్ సెక్రెటరీ పెండ్యాల సలేంద్రం, మైనార్టీ నాయకులు మమ్మద్ సాదిక్ ,సయ్యద్ ఖాసిం, పఠాన్ హుసేన్ తదితరులు పాల్గొన్నారు. లక్ష్మీదేవి పేట, బూరుగుపేట, నల్ల గుంట గ్రామాలకు చెందిన సుమారు 50 మంది ముస్లిం మైనార్టీ సోదరులకు రంజాన్ తోఫా, రంజాన్ ముబారక్ బట్టల పంపిణీ జరిగింది.

# ఎస్సీ యాక్షన్ ప్లాన్ 2025-26 ను పకడ్బందీగా అమలు చేయాలి.

**స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ**



**ఖమ్మం/మార్చి18/(పీపుల్స్ న్యూస్ ):**ఎస్సీ యాక్షన్ ప్లాన్ 2025-26 ను పకడ్బందీగా అమలు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ తెలిపారు.కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా ఎస్సీ యాక్షన్ ప్లాన్ 2025-26 అమలుపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, సంబంధిత అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2025-26 ఎస్సీ యాక్షన్ ప్లాన్ క్రింద ఖమ్మం జిల్లాకు 5 కోట్ల 16 లక్షలతో 540 యూనిట్ లను మంజూరు చేసిందని తెలిపారు. 90 శాతం సబ్సిడీతో లక్ష రూపాయల విలువ గల 256 ఎలక్ట్రిక్ టూ వీలర్ వాహనాలు, 70 శాతం సబ్సిడీతో 3 లక్షల రూపాయల విలువ గల 128 ఎలక్ట్రిక్ త్రీ వీలర్ వాహనాలు, 60 శాతం సబ్సిడీ (5 లక్షల వరకు)తో 3 నుండి 7 లక్షల రూపాయలు విలువ గల 27 సోలార్ పంప్ కంట్రోల్ యూనిట్ లు, 40 వేల రూపాయల గల వేజ్ ఉపాధి శిక్షణ 103 మంది అభ్యర్థులకు, 15 వేల రూపాయల స్వయం ఉపాధి శిక్షణ 26 అభ్యర్థులకు అందించడం జరుగుతుందని అన్నారు.ఎస్సీ యాక్షన్ ప్లాన్ 2025-26 క్రింద ఆసక్తి, అర్హత గల ఎస్సీ నిరుద్యోగ యువతీ, యువకులు మార్చి 24 లోపు తమ దరఖాస్తులను ఆన్ లైన్ పోర్టల్ లో నమోదు చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. మార్చి 25న ఆన్లైన్ లో వచ్చిన దరఖాస్తులను ఈడీ ఎస్సి కార్యాలయం నోటీస్ బోర్డుపై అంటించి ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అభ్యంతరాలు స్వీకరించాలని అదనపు కలెక్టర్ సూచించారు. మార్చి 26న జిల్లా కలెక్టర్ అధ్యక్షతన గల జిల్లా స్థాయి ఎంపిక కమిటీ ద్వారా అభ్యర్థుల ఎంపిక ఉంటుందని, అట్టి అభ్యర్థుల వివరాలను బ్యాంకులకు మార్చి 27 లోపు సమర్పించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ సబ్సిడీ పోను మిగిలిన సొమ్ము బ్యాంకు రుణం ద్వారా ఏర్పాటు చేసి సంబంధిత యూనిట్లను గ్రౌండ్ చేసి ఏప్రిల్ 16 లోపు యుటిలైజేషన్ సర్టిఫికెట్ సమర్పించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.ఈ.వీ. వాహనాలు, వ్యవసాయ సోలార్ పంప్ సెట్ల యూనిట్లకు సంబంధించి బ్యాంకు లింకేజీతో అమలు చేయడం జరుగుతుందని అన్నారు.ఏప్రిల్ 4 లోపు బ్యాంకు నుంచి రుణం మంజూరీకి అవసరమైన ప్రక్రియ పూర్తి చేయాలని, ఏప్రిల్ 7న ఎంపిక చేసిన అభ్యర్థులకు జిల్లా సొసైటీలు మంజూరి పత్రాలు జారీ చేయాల్సి ఉంటుందని, ఏప్రిల్ 9న ఎంపిక చేసిన అభ్యర్థులకు సంబంధించి ప్రభుత్వం సబ్సిడీ విడుదల చేస్తుందని అన్నారు.అభ్యర్థులకు అవసరమైన శిక్షణ కూడా క్షేత్ర స్థాయిలో అందించేందుకు చర్యలు చేపడతామని అదనపు కలెక్టర్ అన్నారు.ఈ సమావేశంలో ఈడీ ఎస్సీ కార్పొరేషన్ నవీన్ బాబు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, జిల్లా రవాణ అధికారి శ్రీనివాసరావు, ఎన్పిడిసిఎల్ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసా చారి, ఎల్డిఎం రవిప్రసాద్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బీసీల ద్రోహి కోమటిరెడ్డిని మంత్రివర్గం నుండి తొలగించాలి

**లేదంటే కాంగ్రెస్ పార్టీని రెడ్ల పార్టీగా ప్రకటిస్తాం**

**బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్**



**మొగుళ్ళ పల్లి ప్రతినిధి మార్చి 18(పీపుల్స్ న్యూస్):**జనాభాలో 60 శాతం పైగా ఉన్న బీసీలను అడుగడుగునా అవమానిస్తూ, బీసీల ఆత్మగౌరవాన్ని, దెబ్బతీస్తూ..బీసీల ద్రోహిగా మారి, కులగజ్జితో వ్యవహరిస్తున్న రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని మంత్రి పదవి నుండి తక్షణమే తొలగించాలని బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీపీసీసీ అధ్యక్షుడిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను తొలగించి, రెడ్డి సామాజిక వర్గానికి చెందిన జగ్గారెడ్డికి టీపీసీసీ అధ్యక్ష పదవిని కట్టబెట్టాలని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడడం చూస్తే బీసీల పట్ల ఆయనకు పచ్చి వ్యతిరేకత ఉన్నట్లు స్పష్టం అవుతుందని మహేందర్ గౌడ్ అన్నారు. టీపీసీసీ అధ్యక్షులుగా మహేష్ కుమార్ గౌడ్ నియామకం జరిగిన తర్వాత తెలంగాణ రాష్ట్రంలో బీసీ కులగణన జరగడం, కాంగ్రెస్ పార్టీ పదవుల నియామకాలలో 70 శాతం బహుజనులకు కేటాయించడం, డీసీసీ అధ్యక్షుల నియామకాలలో బీసీలకు ప్రాధాన్యత కల్పించడం, ఎమ్మెల్సీ పదవులలో బీసీ, ఎస్సీ, ఎస్టీ మరియు మహిళకు కేటాయించడం, ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికలలో బీసీలు పెద్ద ఎత్తున గెలవడంతో, ఇది జీర్ణించుకోలేని కోమటిరెడ్డి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ను తొలగిస్తే రెడ్డి రాజ్యంకు అడ్డు ఉండదనే ఉద్దేశంతో కోమటిరెడ్డి బలుపెక్కిన మాటలు మాట్లాడుతున్నాడని మహేందర్ గౌడ్ మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీసీల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న బీసీలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న మంత్రి కోమటిరెడ్డిని మంత్రి వర్గం నుండి తక్షణమే తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీని రెడ్ల పార్టీగా ప్రకటించి, భవిష్యత్తులో 100 సీట్లు కాదు కదా 100 ఏళ్ళు అయిన కాంగ్రెస్ పార్టీని అధికారంలో రాకుండా బొంద పెడతామని జాజుల మహేందర్ గౌడ్ తీవ్రంగా హెచ్చరించారు.

# నవోదయకు ఎస్వీ పాఠశాల విద్యార్థి దూమాల వంశీకృష్ణ ఎంపిక

**-నవోదయకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న కరస్పాండెంట్ మోరె రవీందర్ రెడ్డి, పాఠశాల డైరెక్టర్ గుండారపు రాజు**





**మొగుళ్ళ పల్లి ప్రతినిధి మార్చి18 (పీపుల్స్ న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని పర్లపల్లి గ్రామంలో అనుభవజ్ఞులచే నెలకొల్పబడ్డ ఎస్వీ విద్యాలయం ఎంతోమంది నిరుపేద విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలతో పాటు నవోదయ గురుకులాలల్లో అడ్మిషన్లు పొంది వారు ఉన్నతమైన చదువులు చదివి..ప్రయోజకులుగా తీర్చిదిద్దే క్రమంలో విద్యార్థినీ, విద్యార్థులను ప్రాథమిక విద్యాభ్యాసంలోనే చదువుతో పాటు, గురుకులాల కోచింగ్ ఇస్తూ..ఎంతో మంది నిరుపేద విద్యార్థులను గురుకుల విద్య దరిచేర్చిన ఎస్వీ పాఠశాలలో చదివిన మరో విద్యార్థి నవోదయ సీటుకు ఎంపికయ్యాడు. మొగుళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన దూమాల వంశీకృష్ణ ఎస్వీ పాఠశాల పర్లపల్లి నందు 5వ తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో 6వ తరగతిలో నవోదయలో అడ్మిషన్ పొందేందుకు అదే పాఠశాలలో కోచింగ్ తీసుకుని..ఫ్రీపేరై నవోదయ సీటు కోసం ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకొని, నవోదయ పరీక్ష రాశాడు. కష్టపడి చదివిన దూమాల వంశీకృష్ణ 42వ ర్యాంక్ సాధించి..మామునూర్ లో నవోదయ సీటుకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా నవోదయ సీటుకు ఎంపికైన దూమాల వంశీకృష్ణను పాఠశాల కరస్పాండెంట్ మోరె రవీందర్ రెడ్డి, డైరెక్టర్ గుండారపు రాజులు అభినందించారు.

# గ్రామాల్లో రాణిస్తున్న మహిళా సర్పంచ్ లు

**- ప్రజలకు సేవ చేసేందుకు ఎంతటి సాహసానికైనా వెనుకాడని వీరనారులు**

**-వాటర్ ట్యాంక్ ఎక్కి..బ్లీచింగ్ పౌడర్ తో ట్యాంక్ ను శుభ్రం చేస్తున్న సర్పంచ్ కవిత**

**-శభాష్ వీరవనిత అంటున్న ప్రజానీకం**



**మొగుళ్ళ పల్లి ప్రతినిధి మార్చి 18 (పీపుల్స్ న్యూస్):** ప్రస్తుతం మగవారితో సమానంగా అన్ని రంగాల్లో వాటా కోరుకుంటున్న మహిళా మణులు..అందుకు తగ్గట్టుగా..మగవారికి దీటుగా రాణిస్తున్న తీరు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలో చర్చనీయాంశమైంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని అంకుశాపురం గ్రామం బీసీ మహిళకు రిజర్వుడు కావడంతో..అక్కడ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచిన క్యాతరాజు కవిత ప్రత్యర్థి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిపై భారీ మెజార్టీతో గెలుపొందారు. దీంతో ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా..ప్రజాసేవకై పునరంకితమయ్యారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి ఏ సమస్య వచ్చినా..తానున్నానంటూ.. సమస్యలను పరిష్కరిస్తూ..గ్రామాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు దూసుకెళుతున్నారు. వేసవికాలం దృష్ట్యా గ్రామంలో మంచినీటి కొరత ఏర్పడకుండా..స్వయంగా ఆమె రంగంలోకి దిగి పైప్ లైన్ మరమ్మత్తులను చేపట్టడం, కలుషితమైన నీటితో ప్రజలు అనారోగ్యాల పాలయ్యే ప్రమాదం ఉందని గ్రహించిన ఆమె వాటర్ ట్యాంక్ ఎక్కి సిబ్బందితో బ్లీచింగ్ పౌడర్ చల్లించి..వాటర్ ట్యాంక్ ను క్లీన్ చేయించిన ఈ వీరనారి క్యాతరాజు కవిత చేసిన సాహసం పలువురిని ఆశ్చర్యానికి గురిచేసింది. రాజకీయాలు అంటే ఎన్నికలలో డబ్బులు పెట్టడం..వాటిని మళ్లీ ఎలా సంపాదించాలనే ధ్యాసపైనే దృష్టి పెట్టడం కాదని, రాజకీయాలు అంటే ప్రజలకు సేవ చేయడమని క్యాతరాజు కవిత చేస్తున్న సేవలను చూసి ప్రజలు, అధికారులు అభినందిస్తున్నారు.

# రామచంద్రపురం భూముల రీ సర్వేకు రైతులు సహకరించాలి

**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**










**ములుగు జిల్లా ప్రతినిధి మార్చి 18( పీపుల్స్ న్యూస్):**మల్లంపల్లి మండల పరిధిలోని రామచంద్రపురం భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం రీ సర్వేకు రైతులు సహకరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తెలిపారు.గురువారం మల్లంపల్లి మండలం రామచంద్రాపూర్ గ్రామంలోని రైతు వేదికలో రామచంద్రపురం గ్రామంలోని 10500 ఎకరాల వ్యవసాయ భూమి రీ సర్వే,హద్దులు గుర్తించుటకు జిల్లా కలెక్టర్ దివాకర టీ.ఎస్. గ్రామ ప్రజలతో గ్రామ సభ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రామచంద్రపూర్ భూములను రీ సర్వే నిర్వహించి భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని తెలిపారు.గతంలో అనేక కారణాలవల్ల చాలామంది రైతులకు పట్టా పాస్ బుక్ లు రాకపోవడంతో అనేక ఇబ్బందులు పడ్డారని వాటన్నిటికీ శాశ్వత పరిష్కారం చూపించే విధంగా 10వేల 500 ఎకరాల వ్యవసాయ భూమిని 9 బ్లాక్ లుగా ఏర్పాటు చేసి 9 సర్వే బృందాలను ఏర్పాటు చేసి ఒక రోజు 50 నుంచి 75 మంది పట్టాదారుల భూములను రి సర్వే చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని సూచించారు.రీ సర్వే నిర్వహించడానికి గ్రామస్తులు రైతులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి.హెచ్. మహేందర్ జి, ఆర్డీవో వెంకటేష్, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, రామచంద్రపూర్, దేవ నగర్, భూపాల్ నగర్, గుర్తూర్ తండా, శివతండా సర్పంచులు దొంతి స్వరూప, సంతోష్, రమణారెడ్డి, రాజు నాయక్, భాస్కర్, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఇటీవల నూతనంగా బాధ్యతలను స్వీకరించిన ఎస్ఐ ముప్పు సురేష్ కు ఘన సన్మానం

**-శాలువాతో ఘనంగా సత్కరిస్తున్న మొగుళ్ళపల్లి సర్పంచ్ చాట్ల విజయ-రవీందర్ దంపతులు, పాలకవర్గం**



**మొగుళ్ళ పల్లి ప్రతినిధి మార్చి 18(పీపుల్స్ న్యూస్):**జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్ళపల్లి సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ గా ఇటీవల బాధ్యతలను స్వీకరించిన ముప్పు సురేష్ కు ఘన సన్మానం జరిగింది. బుధవారం మొగుళ్లపల్లి గ్రామ సర్పంచ్ చాట్ల విజయ-రవీందర్ దంపతులు మరియు గ్రామ పంచాయతీ పాలకవర్గం స్థానిక పోలీస్ స్టేషన్ లోని ఎస్ఐ చాంబర్ లో తనను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ చాట్ల విజయ-రవీందర్ దంపతులు మాట్లాడారు. గ్రామాలలో ఎలాంటి గొడవలు,అల్లర్లు, జరగకుండా..మండలంలో క్రైమ్ రేట్ పెరగకుండా పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరించినప్పటికీ, గ్రామాలు అభివృద్ధి చెందేందుకు వారు 24 గంటల పాటు కష్టపడి ప్రజల కోసం పనిచేస్తారని కొనియాడారు. పోలీసులు చేసే సేవలతోనే గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రజలు ప్రశాంతమైన జీవితాన్ని గడుపుతారన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. మండలంలోని సర్పంచ్ లు, ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు, యువకులు, విద్యార్థుల అండదండలతో నిషేధిత డ్రగ్స్, మత్తు పదార్థాలు, గుడుంబాపై ఉక్కుపాదం మోపుతానన్నారు.

## రోడ్లపై చెత్త వేయొద్దు -- డబ్బాలు తప్పనిసరి: శానిటేషన్ విభాగం హెచ్చరిక




**బాలానగర్ 18 మార్చి ( పీపుల్స్ న్యూస్) :**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలానగర్ డివిజన్ పరిధిలో పరిశుభ్రతపై శానిటేషన్ అధికారులు కఠిన చర్యలకు సిద్ధమవుతున్నారు. రోడ్లపై చెత్త వేయకుండా ప్రతి ఒక్కరూ తమ దుకాణాలు, ఇళ్ల వద్ద చెత్త డబ్బాలను ఏర్పాటు చేసుకోవాలని మూసాపేట సర్కిల్ శానిటేషన్ విభాగం జవాన్ నర్సింగ్ రావు వ్యాపారులు, స్థానిక ప్రజలకు విజ్ఞప్తి చేశారు.రోడ్లపై చెత్త వేస్తే జరిమానాలు విధించడమే కాకుండా అవసరమైతే పోలీసు కేసులు కూడా నమోదు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. బుధవారం రాజు కాలనీ ప్రధాన రోడ్డులో వినూత్నంగా బ్యాండు మేళంతో షాపులు తిరుగుతూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి షాపును సందర్శించి చెత్తను డబ్బాల్లోనే వేయాలని సూచించారు. స్వచ్ఛ ఆటో డ్రైవర్ల సహకారంతో ఏ దుకాణం చెత్తను బయట వేస్తుందో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఏలు భోళా శంకర్, రాజు, పాండు తదితర శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఓల్డ్ బోయినపల్లి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాదం

### -- ప్రారంభించిన మాజీ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్



**బాలానగర్ 18 మార్చి ( పీపుల్స్ న్యూస్)** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఓల్డ్ బోయినపల్లి లో అమావాస్య అన్నదానం ఘనంగా ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఓల్డ్ బోయినపల్లి 262 & 264 హస్మత్‌పేట్ డివిజన్ల పరిధిలోని అంబేద్కర్ చౌరస్తా సమీపంలో బుధవారం అమావాస్య సందర్భంగా నిర్వహించిన అన్నప్రసాదం కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఆర్యవైశ్య సంఘం బోయినపల్లి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఓల్డ్ బోయినపల్లి మాజీ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమావాస్య వంటి పుణ్యదినాల్లో అన్నదానం చేయడం అత్యంత పుణ్యకార్యమని, సమాజంలో సేవాభావాన్ని పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు బాలేశం, రాము, వీరేశం, వెంకటేశం, చంద్రశేఖర్, అశోక్, శ్యాంసుందర్, హరిబాబు, నాగశెట్టి, మల్లేష్ యాదవ్, బుర్రి యాదగిరి శ్యాంసుందర్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.అన్నదానం కార్యక్రమం సందర్భంగా భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేసి, సేవాభావంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రాంతీయ ప్రజల్లో మంచి స్పందన లభించింది.


## సికింద్రాబాద్‌లో భారీగా కల్తీ పనీర్, పాల ఉత్పత్తుల సీజ్

### ఆరుగురు నిందితుల అరెస్ట్



**హైదరాబాద్ కమిషనరేట్ , క్రైమ్ బ్యూరో, మార్చి 18, (పీపుల్స్ న్యూస్) :** ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటూ అపరిశుభ్ర వాతావరణంలో కల్తీ పనీర్ , పాల ఉత్పత్తులను విక్రయిస్తున్న ముఠా గుట్టును హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ టాస్క్ ఫోర్స్ (ఖైరతాబాద్ జోన్) బృందం రట్టు చేసింది. నమ్మదగిన సమాచారం మేరకు, ఖైరతాబాద్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు, జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ బి. సాహితితో కలిసి సికింద్రాబాద్ మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలోని గంజ్ బజార్ ప్రాంతంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ దాడుల్లో ఆరు హోల్‌సేల్ , రిటైల్ దుకాణాలపై దాడులు చేసి, నిబంధనలకు విరుద్ధంగా కల్తీ ఉత్పత్తులను విక్రయిస్తున్న జైపాల్ సింగ్ రాజ్‌పురోహిత్, కొలారియా వైభవ్, నరేష్ కొలారియా, ప్రేమ్ అనిల్ వ్యాస్, రామ్ కిషోర్ కొలారియా , లక్ష్మీనారాయణ కొలారియా ఆరుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.నిందితులు గుర్తు తెలియని ప్రాంతాల నుండి కల్తీ , అపరిశుభ్రమైన పనీర్, ఇతర పాల ఉత్పత్తులను భారీ మొత్తంలో సేకరించి, వాటిని నాణ్యమైన ఉత్పత్తులుగా నమ్మిస్తూ కిలో రూ. 280 చొప్పున హోటళ్లు, క్యాటరింగ్ సర్వీసులు , సామాన్య ప్రజలకు విక్రయిస్తున్నారు. తనిఖీ సమయంలో ఈ ఉత్పత్తులను ప్లాస్టిక్ కవర్లలో ఉంచి, దుమ్ము , ఈగలు వాలే అపరిశుభ్ర వాతావరణంలో నిల్వ చేసినట్లు అధికారులు గుర్తించారు. ఈ ఉత్పత్తులపై ఎటువంటి బ్రాండ్ పేరు, తయారీ తేదీ లేదా గడువు తేదీ లేకపోవడమే కాకుండా, కనీస పేస్ట్ కంట్రోల్ రికార్డులు కూడా లేవని తేలింది. ఇవి మానవ వినియోగానికి అత్యంత ప్రమాదకరమని అధికారులు వెల్లడించారు. ఈ దాడుల్లో పోలీసులు మొత్తం 3,892 కేజీల కల్తీ పాల ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు, వీటి విలువ సుమారు రూ. 11,11,600/- ఉంటుంది. స్వాధీనం చేసుకున్న సొత్తులో 2,572 కేజీల పనీర్, 927 కేజీల కోవా, 249 కేజీల వైట్ క్రీమ్, 132 కేజీల అజ్మీరా కలకండ్ , 12 కేజీల నెయ్యి ఉన్నాయి. ఈ అక్రమ వ్యాపారంలో ప్రధానంగా శంకర్లాల్ మిల్క్ ప్రొడక్ట్స్, విజయ మిల్క్ షాప్, వైభవ్ మిల్క్ డెయిరీ, శ్రీ బాలాజీ డెయిరీ ప్రొడక్ట్స్, జగదాంబ మిల్క్ మర్చెంట్ , తులసి గిరిరాజ్ డెయిరీ ప్రొడక్ట్స్ అనే సంస్థలు పాల్గొన్నట్లు గుర్తించారు.పట్టుబడిన నిందితులను స్వాధీనం చేసుకున్న భారీ నిల్వలను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం మహంకాళి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ కు అప్పగించారు. ఈ ఆపరేషన్‌ను ఖైరతాబాద్ జోన్ టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ పి. రాఘవేందర్, ఎస్.ఐ జి. శ్రీకాంత్ మరియు సిబ్బంది విజయవంతంగా నిర్వహించారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే ఇటువంటి కల్తీ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, హెచ్చరించారు.

# సన్న బియ్యం స్టాక్ పంపిణీ సకాలంలో జరిగేలా చూడాలి.. అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి



**ఖమ్మం/ మార్చి18/(పీపుల్స్ న్యూస్ ):**సన్న బియ్యం స్టాక్ పంపిణీ సకాలంలో జరిగేలా చూడాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్, బఫర్ గోదాంలకు అలాట్మెంట్ చేసిన జిపిఓలు, సంబంధిత అధికారులతో 3 నెలల బియ్యం స్టాక్ పంపిణీపై సమీక్షించారు అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఏప్రిల్ నుంచి జూన్ 2026 వరకు గల 3 నెలల రేషన్ ను ఒకేసారి అందించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని అన్నారు. మూడు నెలల రేషన్ సరఫరాకు సంబంధించి 12 బఫర్ గోదాములకు 12 మంది జిపిఓ లను ఇంచార్జి లుగా నియమించడం జరిగిందని, 3 నెలల రేషన్ లబ్దిదారులకు పంపిణీ చేసేందుకు వీలుగా రేషన్ షాపుల వారీగా స్టాక్ పంపిణీ జరిగేలా చూడాలని అన్నారు.బఫర్ గోడౌన్ నుంచి స్టేజి 1 ద్వారా ఎం.ఎల్.ఎస్. పాయింట్ లకు రేషన్ సరఫరా సకాలంలో పంపిణి చేయాలని, మన జిల్లా అవసరాలకు 25 వేల మెట్రిక్ టన్నులు, ఇతర జిల్లాల కోసం పంపిణి చేసే బియ్యం క్వాంటిటి కూడా సరిగ్గా ఉండేలా చూడాలని అన్నారు.బియ్యం పంపిణీ ప్రతి రోజూ ఉదయం 9 గంటలకు ప్రారంభం కావాలని అన్నారు. ఎం.ఎల్.ఎస్. పాయింట్ నుంచి రేషన్ షాపులకు బియ్యం తరలింపు కూడా ఉదయం 9 గంటలకు ప్రారంభిం చాలని అదనపు కలెక్టర్ తెలిపారు. హమాలీలు సకాలంలో అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలత, ఎం.ఎల్.ఎస్. పాయింట్ ఇంచార్జి, స్టేజి 1 కాంట్రాక్టర్, గోడౌన్ ఇంచార్జి లు, జిపిఓలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బాలానగర్ హెచ్‌ఏఎల్‌లో ఘనంగా తెలుగు ఉగాది సంబరాలు

### -- ముఖ్య అతిథిగా హెచ్ఏఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామ్మోహనరావు



**బాలానగర్ 18 మార్చి ( పీపుల్స్ న్యూస్) :**తెలుగు ఉగాది పర్వదినం సందర్భంగా హెచ్ఏఎల్‌లో బుధవారం ఆనందోత్సాహాలతో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో పరాభవ నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని వెల్ఫేర్ ఫండ్ మేనేజింగ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.ఈ వేడుకలకు హెచ్ఏఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామ్మోహనరావు ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉగాది పర్వదిన ప్రాధాన్యతను వివరిస్తూ కేంద్ర ప్రభుత్వ సంస్థలోని ప్రతి కార్మికుడికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ నూతన సంవత్సరంలో కూడా హెచ్ఏఎల్ సంస్థ నిర్ణయించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేస్తూ మరింత అభివృద్ధి దిశగా పయనిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ వేడుకల్లో సంస్థకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. డిజైన్ జనరల్ మేనేజర్ సతీష్, చీఫ్ ఆఫ్ ప్రాజెక్ట్స్ మురళీకృష్ణ, వెల్ఫేర్ ఫండ్ ఛైర్మన్ శ్రీహరి రావు, హెచ్.ఆర్ చీఫ్ మేనేజర్ ప్రహ్లాద్, సీనియర్ మేనేజర్ జయశ్రీ తదితరులు హాజరయ్యారు.

అదే విధంగా వింగుర్తింపు యూనియన్ నాయకులు వెంకటాద్రి, విజయప్రసాద్, శ్రీనివాస్ బాబు, కర్నాగరాజు, గణేష్, చందర్ రావు నాయక్ సహా పలువురు యూనియన్ ప్రతినిధులు, మహిళా నాయకులు భాగ్య, నీలవేణి, మంజుల, సునీత, భారతి, జాహ్నవి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.సాంప్రదాయం ఐక్యత - అభివృద్ధి అనే మూడు మూలస్తంభాలతో సాగిన ఈ ఉగాది వేడుకలు హెచ్ఏఎల్ కుటుంబంలో ఆనందాన్ని నింపాయి.కొత్త ఆశలు,కొత్త లక్ష్యాలతో సంస్థమరింత పురోగతిని సాధించాలని అందరూ ఆకాంక్షించారు

# బాలానగర్‌లో విద్యార్థులకు అవగాహన సైబర్ క్రైమ్, డ్రగ్స్‌పై పోలీసుల చైతన్య కార్యక్రమం

### -- బాలానగర్ ఏసీపీ పింగళి నరేష్ రెడ్డి





**బాలానగర్ 18 మార్చి ( పీపుల్స్ న్యూస్) :**సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో "99 రోజుల ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక"లో భాగంగా బాలానగర్ పోలీసులు బుధవారం వినూత్న అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా బాలానగర్ పరిధిలోని విజన్ మోడల్ హై స్కూల్‌లో జరిగిన వినూత్నంగా జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు సైబర్ క్రైమ్, మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై విస్తృతంగా చైతన్యం కల్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బాలానగర్ ఏసీపీ పింగిలి నరేష్ రెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్ యువత భవిష్యత్తును చీకటిలో నెట్టేస్తాయని హెచ్చరించారు. మత్తుకు బానిసలైతే నేరాల దారిలోకి వెళ్లే ప్రమాదం ఉందని పేర్కొంటూ, విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. తల్లిదండ్రులు, గురువులకు గౌరవం తీసుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం బాలానగర్ సీఐ నర్సింహా రాజు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం శారీరక, మానసిక, సామాజిక సమస్యలకు కారణమవుతుందని చెప్పారు. డ్రగ్స్ నిర్మూలనలో ప్రతి ఒక్కరి విద్యార్థుల బాధ్యత ఉందని, సైబరాబాద్ పోలీసులు చేపడుతున్న చర్యలను వివరించారు. బాలల సంరక్షణ చట్టాలు, చైల్డ్ రైట్స్, పోక్సో చట్టాలపై అవగాహన అవసరమని తెలిపారు. సోషల్ మీడియా ప్రభావంపై జాగ్రత్తగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. తదుపరి బాలా నగర్ ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని తెలిపారు. ప్రమాద సమయంలో ప్రాణాలను రక్షించడంలో హెల్మెట్ కీలక పాత్ర పోషిస్తుందని, హెల్మెట్ వాడకం మరణాల రేటును గణనీయంగా తగ్గిస్తుందని వివరించారు. ఇది చట్టపరమైన బాధ్యత మాత్రమే కాకుండా కుటుంబ భద్రతకు సంబంధించిన అంశమని చెప్పారు.ఈ కార్యక్రమంలో విజన్ మోడల్ స్కూల్ కరెస్పాండెంట్ రాజేష్ బాబు, ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్, డిఐ సక్రమ్, ఎస్ఐలు సరితా రెడ్డి, హాజీ మియా, స్థానిక నాయకులు పులి శివ కుమార్ గౌడ్, సదా గౌడ్, శ్రీకాంత్ గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముగింపులో మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో యువత పాత్ర కీలకమని, చైతన్యంతో ముందుకు సాగాలని పోలీసులు పిలుపునిచ్చారు.

# కల్తీ పచ్చళ్ల తయారీ కేంద్రంపై పోలీసుల దాడి

### ఆరుగురు నిందితుల అరెస్ట్







**హైదరాబాద్ కమిషనరేట్ , క్రైమ్ బ్యూరో, మార్చి 18, (పీపుల్స్ న్యూస్) :** ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటూ అపరిశుభ్ర వాతావరణంలో కల్తీ పనీర్ , పాల ఉత్పత్తులను విక్రయిస్తున్న ముఠా గుట్టును హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ టాస్క్ ఫోర్స్ (ఖైరతాబాద్ జోన్) బృందం రట్టు చేసింది. నమ్మదగిన సమాచారం మేరకు, ఖైరతాబాద్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు, జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ బి. సాహితితో కలిసి సికింద్రాబాద్ మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలోని గంజ్ బజార్ ప్రాంతంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ దాడుల్లో ఆరు హోల్‌సేల్ , రిటైల్ దుకాణాలపై దాడులు చేసి, నిబంధనలకు విరుద్ధంగా కల్తీ ఉత్పత్తులను విక్రయిస్తున్న జైపాల్ సింగ్ రాజ్‌పురోహిత్, కొలారియా వైభవ్, నరేష్ కొలారియా, ప్రేమ్ అనిల్ వ్యాస్, రామ్ కిషోర్ కొలారియా , లక్ష్మీనారాయణ కొలారియా ఆరుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.నిందితులు గుర్తు తెలియని ప్రాంతాల నుండి కల్తీ , అపరిశుభ్రమైన పనీర్, ఇతర పాల ఉత్పత్తులను భారీ మొత్తంలో సేకరించి, వాటిని నాణ్యమైన ఉత్పత్తులుగా నమ్మిస్తూ కిలో రూ. 280 చొప్పున హోటళ్లు, క్యాటరింగ్ సర్వీసులు,సామాన్య ప్రజలకు విక్రయిస్తున్నారు. తనిఖీ సమయంలో ఈ ఉత్పత్తులను ప్లాస్టిక్ కవర్లలో ఉంచి, దుమ్ము , ఈగలు వాలే అపరిశుభ్ర వాతావరణంలో నిల్వ చేసినట్లు అధికారులు గుర్తించారు. ఈ ఉత్పత్తులపై ఎటువంటి బ్రాండ్ పేరు, తయారీ తేదీ లేదా గడువు తేదీ లేకపోవడమే కాకుండా, కనీస పేస్ట్ కంట్రోల్ రికార్డులు కూడా లేవని తేలింది. ఇవి మానవ వినియోగానికి అత్యంత ప్రమాదకరమని అధికారులు వెల్లడించారు. ఈ దాడుల్లో పోలీసులు మొత్తం 3,892 కేజీల కల్తీ పాల ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు, వీటి విలువ సుమారు రూ. 11,11,600/- ఉంటుంది. స్వాధీనం చేసుకున్న సొత్తులో 2,572 కేజీల పనీర్, 927 కేజీల కోవా, 249 కేజీల వైట్ క్రీమ్, 132 కేజీల అజ్మీరా కలకండ్ , 12 కేజీల నెయ్యి ఉన్నాయి. ఈ అక్రమ వ్యాపారంలో ప్రధానంగా శంకర్లాల్ మిల్క్ ప్రొడక్ట్స్, విజయ మిల్క్ షాప్, వైభవ్ మిల్క్ డెయిరీ, శ్రీ బాలాజీ డెయిరీ ప్రొడక్ట్స్, జగదాంబ మిల్క్ మర్చెంట్ , తులసి గిరిరాజ్ డెయిరీ ప్రొడక్ట్స్ అనే సంస్థలు పాల్గొన్నట్లు గుర్తించారు.పట్టుబడిన నిందితులను స్వాధీనం చేసుకున్న భారీ నిల్వలను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం మహంకాళి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ కు అప్పగించారు. ఈ ఆపరేషన్‌ను ఖైరతాబాద్ జోన్ టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ పి. రాఘవేందర్, ఎస్.ఐ జి. శ్రీకాంత్ మరియు సిబ్బంది విజయవంతంగా నిర్వహించారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే ఇటువంటి కల్తీ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, హెచ్చరించారు.

## ప్రతి బీజేపీ కార్యాలయంలో ఉగాది వేడుకలు.. పీవీఎన్ మాధవ్ ఆదేశం



**అమరావతి, మార్చి 18:** ఉగాది పర్వదినం సందర్భంగా పార్టీ శ్రేణులకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్( దిశానిర్దేశం చేశారు. టెలికాన్ఫరెన్స్ ద్వారా నేతలు, కార్య కర్తలతో మాట్లాడిన ఆయన.. రాష్ట్రవ్యాప్తంగా అన్ని బీజేపీ కార్యాలయాల్లో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యాలయంలో పురోహితులను పిలిపించి పూజా కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. పంచాంగ శ్రవణం తప్పనిసరిగా జరగాలని ఆయన ఆదేశించారు. ప్రతి జిల్లాలోని ముఖ్యమైన గ్రామ దేవతలను పార్టీ నాయకులు సందర్శించాలని మాధవ్ సూచించారు. గ్రామ దేవతలకు పార్టీ తరఫున సంప్రదాయబద్ధంగా సారె సమర్పించే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. డప్పు వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించి స్థానిక ప్రజలతో కలిసి ఈ వేడుకలు జరపాలని ఆదేశించారు. కొత్త అమావాస్య, ఉగాది సందర్భంగా నిర్వహించే ఈ కార్యక్రమాలను పార్టీ శ్రేణులు.. ప్రజలతో మమేకమై చేయాలని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు.

## ఏపీలో క్రూడాయిల్ నిక్షేపాలు మిషన్ అన్వేషణ్ పేరుతో నాలుగు జిల్లాల్లో సర్వే

**కాకినాడ జిల్లా :** ఇరాన్-ఇజ్రాయెల్, అమెరికా యుద్ధం ప్రభావంతో గ్యాస్, పెట్రోల్ విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మనం కూడా వీటి కోసం విదేశాలపై అధారపడాల్సిన పరిస్థితులు ఉన్నాయి. అక్కడెక్కడో యుద్ధం జరిగితే.. మన దేశంలో, మన రాష్ట్రంలో సమస్యలు తప్పడం లేదు. అందుకే కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది.. దేశవ్యాప్తంగా సహజవాయు నిక్షేపాలను సద్వినియోగం చేసుకోవడంపై ఫోకస్ పెట్టింది. మిషన్ అన్వేషణ్ పేరుతో క్రూడాయిల్ నిక్షేపాల వేట మొదలుపెట్టింది. ఆంధ్రప్రదేశ్‌లో కడా మిషన్ అన్వేషన్ పేరుతో సహజవాయు నిక్షేపాల కోసం సర్వే చేస్తున్నారు. ఏపీలోని విజయనగరం జిల్లా భోగాపురం నుంచి కాకినాడ జిల్లా పెద్దపురం వరకు.. మళ్లీ అక్కడి నుంచి కృష్ణా జిల్లా మచిలీపట్నం వరకు మిషన్ అన్వేషన్‌లో భాగంగా తొలి విడతలో సర్వే



చేపట్టారు. ఈ సర్వేను ఓఎన్‌జీసీ, ఆల్ఫా జియో సంస్థ కలిసి ఉమ్మడిగా చేస్తున్నాయి. శాటిలైట్ ద్వారా సర్వే చేయాల్సిన ప్రాంతాలను గుర్తించారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో సర్వే కొనసాగుతోంది. అనకాపల్లి జిల్లాలో మండ లాల్లో సర్వే చేస్తున్నారు.. సహజవాయు నిక్షేపాలను గుర్తించేందుకు నక్కపల్లి, పాయకరావుపేట, ఎస్.రాయవరం, రాంబిల్లి, మునగపాక మండలాల్లోని పంట భూముల్లో 60 అడుగుల లోతులో డ్రిల్లింగ్ చేస్తున్నారు. ఈ భూముల్లో డ్రిల్లింగ్ చేసి.. మొదటి పది అడుగుల్లో వారికి అవసరమైన మట్టి నమూనాన సేకరిస్తున్నారు. అలాగే నీటి లభ్యత, సహజ వాయు నిక్షేపాలకు సంబంధించి అవసరమైన మరికొన్ని పరీక్షలు కూడా నిర్వహిస్తారు. ముందుగా 2డీ సెస్మిక్ సర్వేలో భాగంగా కేబుళ్లు ఏర్పాటు చేశారు.. ఇలా డ్రిల్లింగ్ చేసి భూమి నుంచి సేకరించిన మట్టికి సంబంధించిన శాంపిల్స్‌ను డెహ్రాడూన్‌కు పంపించారు. మరికొన్ని శాంపిల్స్‌ను ఓఎన్‌జీసీ ల్యాబ్స్‌కు పంపించారు. ప్రస్తుతం ప్రాథమికంగా సర్వే చేస్తుండగా.. ఆ తర్వాత మరో రెండు విడతలుగా డ్రిల్లింగ్ చేపట్టనున్నారు. ఒకవేళ ఈ సర్వేలో ఎక్కడైనా సహజవాయు నిక్షేపాలను గుర్తిస్తే ఆ సమీపంలో రెండు ఎకరాల భూమిని లీజు కింద తీసుకుంటారు. మిషన్ అన్వేషణ్ పేరుతో చేపట్టిన ఈ సర్వేను వచ్చే నాలుగేళ్లలో పూర్తి చేయాలని ప్లాన్ చేశారు.

## మదనపల్లె ఫైల్స్ కేసులో కీలక పరిణామం పెద్దిరెడ్డి పీఏ, అనుచరుడు అరెస్ట్

మదనపల్లె ఫైల్స్ దహనం కేసులో బుధవారం కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితులుగా ఉన్న ముని తుకారాం, మాధవరెడ్డిలను పోలీసులు అరెస్ట్ చేశారు. ముని తుకారాం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పీఏగా వ్యవహరించారు. అలాగే మాధవరెడ్డి.. పెద్దిరెడ్డి ప్రధాన అనుచరుడు. మాధవరెడ్డి, ముని తుకారాం.. మదనపల్లె ఫైల్స్ కేసులో ఏ3, ఏ4గా ఉన్నారు. వీరిద్దరూ బెయిల్ కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. సర్వోన్నత న్యాయస్థానం బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ నేపథ్యంలో చంద్రగిరి మండలంలోని పనపాకం టోల్‌ప్లాజా వద్ద సీఐడీ అధికారులు వారిద్దరినీ బుధవారం అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తిరుపతి సీఐడీ ఆఫీసుకు తరలించారు. 2024 జులై 21వ తేదీన మదనపల్లె ఆర్డీవో కార్యాలయంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటన అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. ఈ ఘటనలో ముఖ్యమైన పలు రెవెన్యూ ఫైఆఫీసులో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ ల్స్ కాలిపోయాయి. అయితే ఇది ప్రమాదం కాదని.. ఉద్దేశపూర్వకంగా జరిగిన ఘటనగా అనుమానిస్తూ పలు అభియోగాలు నమోదయ్యాయి. ఈ క్రమంలోనే మాజీ మంత్రి పెద్దిరెడ్డి



రామచంద్రారెడ్డి అనుచరులే ఈ ఘటనకు కారణమనే ఆరోపణలు కూడా వచ్చాయి. ఈ నేపథ్యంలో ఘటన జరిగిన సమయంలో మదనపల్లె ఆర్డీవో ఆఫీసులో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజ్, హరిప్రసాద్‌లను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. మదనపల్లె ఆర్డీవోగా గతంలో పనిచేసిన మురళి అనే అధికారిపైనా చర్యలు తీసుకుంది. అనంతరం 2024 ఆగస్టు నెలలో మదనపల్లె ఫైల్స్ కేసును ఏపీ ప్రభుత్వం సీబీసీఐడీకి అప్పగించింది. దర్యాప్తులో భాగంగా సీఐడీ అధికారులు గౌతమ్ తేజ్, పెద్దిరెడ్డి అనుచరుడు మాధవరెడ్డి, మురళిలను అరెస్ట్ చేశారు. అయితే కొన్ని కారణాలతో మాధవరెడ్డికి కోర్టు.. రిమాండ్ విధించలేదు. దీంతో ఆయన బయటే ఉన్నారు. అలాగే ఈ కేసులో ఏ4గా ఉన్న ముని తుకా ఓరాం.. గతేడాది జులైలో అమెరికాకు వెళ్లిపోయారు. బుధవారం రోజున వీరిద్దరూ ఎం టోల్‌ప్లాజా వద్ద కాఫీ తాగేందుకు రాగా సీఐడీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.

## ఏపీలో దివ్యాంగ శక్తి పథకం ప్రారంభం.. ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం,

ఆంధ్రప్రదేశ్‌లో ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించే దివ్యాంగ శక్తి పథకం ప్రారంభమైంది. గుంటూరు జిల్లా మంగళగిరి బస్టాండ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ కలిసి ప్రారంభించారు. అనంతరం ముగ్గురు నేతలు దివ్యాంగులతో కలిసి పల్లె వెలుగు బస్సులో ప్రయాణించారు. మంగళగిరి డాన్‌బాస్కో స్కూల్ మీదుగా డోలాస్ నగర్, ప్రకాశ్‌నగర్, నులకపేట, ఉండవల్లి సెంటర్ మీదుగా పెనుమాక వరకు ప్రయాణం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కూటమి ప్రభుత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాల గురించి దివ్యాంగుల్ని అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగ శక్తి పథకం పేరుతో ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణం అందిస్తోంది ప్రభుత్వం. అందరికీ సమాన అవకాశాలు అందించేలా దివ్యాంగుల ప్రయాణాన్ని సులభతరం చేస్తూ వారిలో ఆత్మవిశ్వాసం నింపేలా పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ దివ్యాంగ శక్తి పథకం ద్వారా బస్సుల్లో ప్రయాణించొచ్చు. వీటిలో సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్ ప్రెస్, పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్ ప్రెస్ బస్సులు ఉన్నాయి. మొత్తం 21 కేటగిరీల్లో 40 శాతం కంటే



ఎక్కువ వైకల్యం ఉన్న దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేయొచ్చు. దివ్యాంగులతో పాటుగా వారి వెంట వచ్చే సహాయకులతో కలిపి 12.76 లక్షల మందికి లబ్ధి చేకూరనుంది. ఈ దివ్యాంగ శక్తి పథకం కోసం ఏపీ ప్రభుత్వం ఏటా రూ.207 కోట్లు ఖర్చు చేయనుంది. వ్యాంగులు గతంలో సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్ ప్రెస్, పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్ ప్రెస్ బస్సుల్లో 50 శాతం ఛార్జీతో ప్రయాణించేవారు. కొత్తగా దివ్యాంగ శక్తి పథకం అమల్లోకి రావడంతో ఉచితంగా ప్రయాణిస్తారు.. వీరికి జీరో ఫేర్ టికెట్ జారీ చేస్తారు. అయితే ఆర్టీసీలో మిగిలిన బస్సులైన నాన్ స్టాప్, ఇంటర్ స్టేట్, అల్ట్రా డీలక్స్, సప్తగిరి ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో దివ్యాంగులకు 50 శాతం రాయితీ కొనసాగుతుంది. అంతేకాదు దివ్యాంగ శక్తి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారు పాస్‌ల సాయంతో ప్రయాణం చేయొచ్చు. ఆర్టీసీ బస్‌పాస్ కౌంటర్లలో వీటిని జారీ చేస్తున్నారు. గతంలో 50శాతం రాయితీ వర్తించే పాస్ ఉన్నవాళ్లను గడువు ఉన్నంత వరకు బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అనుమతి ఇస్తారు. కొత్తగా పాస్ తీసుకోవాలంటే సదరం పత్రం, ఆధార్ కార్డు కావాలి. మొబైల్ యాప్, మనమిత్ర ద్వారా డిజిటల్ పాస్ తీసుకోవచ్చు. అయితే దివ్యాంగుల వెంట సహాయం కోసం వెళ్లేవారికి ఐదు రకాల బస్సుల టికెట్ ఛార్జీలో 50 శాతం రాయితీ అందిస్తోంది ప్రభుత్వం.

## పాపయ్య కుంటలోకి మురికినీరు రాకుండా చర్యలు తీసుకోవాలి

### సామాజిక కార్యకర్త ఆకుల సతీష్.

**కుత్బుల్లాపూర్,మార్చి 18 (పీపుల్స్ న్యూస్) :** పాపయ్య కుంటలోకి మురికినీరు రాకుండా చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త ఆకుల సతీష్ అన్నారు. నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ కాలనీలో ఉన్న పాపయ్యకుంటలోకి తురక చెరువు నుండి మురికి నీళ్లు కలుస్తున్న సమస్యపై కాలనీ వాసులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సామాజిక కార్యకర్త ఆకుల సతీష్ నాయకత్వంలో బుధవారం నిజాంపేట్ సర్కిల్ డిప్యూటీ ఇంజనీర్ వసంత ను కలిసి మెమొరండం సమర్పించారు. ఈ సందర్భంగా ఆకుల సతీష్ మాట్లాడుతూ శ్రీనివాస్ నగర్ కాలనీలో సుమారు ఎనిమిది ఎకరాల్లో విస్తరించి ఉన్న మంచినీటి చెరువు అయిన పాపయ్యకుంటలోకి 2022 సంవత్సరంలో తురక చెరువు నుండి మురికి నీళ్ల కాలువను కలపడం వల్ల కాలనీ పరిసరాల్లో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని తెలిపారు. అంతేకాకుండా చెరువులో నిల్వ ఉండే మురికి నీళ్ల కారణంగా దోమల సమస్య పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పాపయ్యకుంట నుండి సిరి బాలాజీ అపార్ట్‌మెంట్స్



వరకు ఏర్పాటు చేసిన పైప్‌లైన్ కాల్వ సరిగా లేకపోవడం వల్ల మురికి నీళ్లు, వర్షపు నీళ్లు రోడ్లపైకి వచ్చి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని అన్నారు. తురక చెరువు నుండి వచ్చే మురికి నీళ్లను రాజధాని స్కూల్ నుండి రెడ్డి అవెన్యూ గేటు వద్ద ఉన్న ఎస్ఎన్‌డీపీ లోకి డైవర్షన్ చేసేలా తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. పాపయ్యకుంట నుండి సిరి బాలాజీ వరకు



ఉన్న పైప్‌లైన్‌ను సరిచేయాలని అధికారులను కోరారు. లేదంటే కాలనీ వాసులతో కలిసి పాపయ్యకుంట వద్ద తురక చెరువు నీళు కలిసే కాల్వను మూసివేస్తామన్నారు. చెరువును మురికి నీళ్లతో కలుషితం చేసిన మున్సిపల్ అధికారులపై హైకోర్టు, హ్యూమన్ రైట్స్ కమిషన్‌లో ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ విషయంపై డిప్యూటీ ఇంజనీర్ వసంత స్పందిస్తూ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన ప్రపోజల్స్ సిద్ధం చేసి అవసరమైన పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అమలేశ్వరి, మహేష్ గుప్తా, మాధవరావు, అరుణ్

## హెచ్.ఎ.ఎల్ లో ఘనంగా ఉగాది వేడుకలు.



**బాలానగర్, మార్చి 18 (పీపుల్స్ న్యూస్) :** ఉగాది పరాభవ నామ సంవత్సరాన్ని పురస్కరించుకొని బుధవారం హెచ్.ఎ.ఎల్ లో వెల్ఫేర్ ఫండ్ మేనేజింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హెచ్.ఎ.ఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామ్మోహనరావు విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉగాది పండుగను పురస్కరించుకొని కార్మికులందరికీ పరాభవ నామ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి సంవత్సరం లాగే ఈ కొత్త సంవత్సరం లో కూడా హెచ్.ఎ.ఎల్ అనుకున్న టార్గెట్స్ సకాలంలో పూర్తి చేస్తూ అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిజైన్ జనరల్ మేనేజర్ సతీష్, చీఫ్ ఆఫ్ ప్రాజెక్ట్స్ మురళీకృష్ణ, వెల్ఫేర్ ఫండ్ ఛైర్మెన్ శ్రీహరి రావు,హెచ్.ఆర్ చీఫ్ మేనేజర్ ప్రహ్లాద్, రాము,సీనియర్ మేనేజర్ జయశ్రీ, గుర్తింపు యూనియన్ అధ్యక్షులు మరియు కన్వీనర్ వెంకటాద్రి, గౌరవ అధ్యక్షులు విజయప్రసాద్,ప్రధానకార్యదర్శి శ్రీనివాస్ బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్స్, కర్క నాగరాజు, గణేష్, చంద్రరావు నాయక్, డిప్యూటీ ప్రధానకార్యదర్శి జోగారావు, కోశాధికారి ప్రవీణ్,మహిళా నాయకులు భాగ్య, నీలవేణి, మంజుల, సునీత,భారతి, జాహ్నవి, జాయింట్ సెక్రటరీ నాగార్జున, ప్రవీణ్, ప్రేమ్, వెంకటరమణ, ఆదిరెడ్డి, రాకేష్,సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ క్రీడల్లో తెలంగాణ పోలీసుల ప్రతిభ

### విజేతలను అభినందించిన డిజిపి

**హైదరాబాద్,క్రైమ్ బ్యూరో, మార్చి 18, (పీపుల్స్ న్యూస్) :** జమ్మూ కాశ్మీర్ వేదికగా ఇటీవల ముగిసిన 2వ ఆల్ ఇండియా పోలీస్ కబడ్డీ క్లస్టర్ (2025-2026) క్రీడా పోటీల్లో తెలంగాణ పోలీస్ క్రీడాకారులు ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో రాష్ట్ర పోలీసు ల కీర్తిని చాటారు. పతకాలతో తిరిగి వచ్చిన క్రీడాకారులను డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. ఈ పోటీల్లో పురుషుల ఖో-ఖో విభాగంలో తెలంగాణ జట్టు పట్టుదల ప్రదర్శించి కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. వివిధ విభాగాలకు చెందిన 15 మంది క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని చాటి ఈ విజయంలో కీలక పాత్ర పోషించారు. ముఖ్యంగా ఇన్ స్పెక్టర్లు బి. శ్రీనివాస్, ఎస్. మట్టం రాజు (సైబర్ క్రైమ్), ఆర్ఎస్ఐ ఎ. రమేష్, వనస్థలి పురం పీఎస్‌కు చెందిన పి. రంజిత్ కుమార్ కోచ్, కెప్టెన్లుగా



వ్యవహరించగా, వివిధ టీజీఎస్పీ బెటాలియన్లకు చెందిన కానిస్టేబుళ్లు జట్టు గెలుపులో తమ వంతు సహకారాన్ని అందించారు. మహిళల ఫెన్సింగ్ విభాగంలో భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న మహిళా కానిస్టేబుల్ షేక్ ఫౌజియా అసాధారణ ప్రదర్శన చేశారు. ఫైనల్ వరకు దూసుకెళ్లిన ఆమె,



హోరాహోరీ పోరులో రజత పతకాన్ని సాధించి రాష్ట్ర పోలీస్ శాఖకు పేరు తెచ్చారు .ఆమెకు శిక్షణ ఇచ్చిన ఎన్.ఐ.ఎస్ ఫెన్సింగ్ కోచ్ ఎస్.ఆర్. అర్జున్ ఆనంద్ కృషిని కూడా డిజిపి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ ఐ జి పి డా. గజరావు భూపాల్, స్పోర్ట్స్ ఆఫీసర్ డా. ఆర్.వి. రామారావు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి కతారి ఈశ్వర్ ఇంట్లో చోరీ పోలీసుల దర్యాప్తు

**కృష్ణా జిల్లా, మార్చి 18:** మాజీ మంత్రి కతారి ఈశ్వర్ కుమార్ఇంట్లో చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి తాళం పగులగొట్టి దుండగుడు చోరీకి తెగబడ్డాడు. కతారి భార్య మధురిమ రెండు రోజుల క్రితం హైదరాబాద్ వెళ్లి బుధవారం తిరిగి ఇంటికి వచ్చారు. ఇంట్లో వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉండటాన్ని గమనించారు. దీంతో ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించారు. చోరీలో వంశపారంపర్యంగా వస్తున్న సుమారు 10 కిలోల వెండి వస్తువులు, పూజా సామాగ్రి అపహరణకు గురయ్యాయని తెలుస్తోంది. వెంటనే గుడివాడ వన్‌టౌన్ పోలీసులకు మధురిమ ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడకు చేరుకుని క్లూస్ టీంకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన క్లూస్ టీం ఆధారాలు సేకరించే పనిలో ఉన్నారు. కతారి ఈశ్వర్ కుమార్ వ్యాపారం రీత్యా హైదరాబాద్, బెంగళూరులో ఉంటున్నారు. చోరీపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# అర్ధరాత్రి ఇంట్లో అగ్నిప్రమాదం 8మంది సజీవదహనం




**మధ్యప్రదేశ్ :** గ్యాస్ సిలిండర్లే తీవ్రతకు కారణంమధ్యప్రదేశ్ ఇండోర్‌లోని ఓ ఇంట్లో ఘోర అగ్నిప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో ఇంట్లోని 8 మంది కుటుంబ సభ్యులు సజీవ దహనమయ్యారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఎలక్ట్రిక్ కారు చార్జింగ్ సమయంలో షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రవ ాదం జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ తర్వాత గ్యాస్ సిలిండర్ పేలడంతో విపరీత నష్టం కలిగిందని తెలుస్తోంది. మరోవైపు ఈ ఘటనపై దర్యాప్తు చేసేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. బ్రజేశ్వరి అనెక్స్ కాలనీలో ఉన్న ఓ భవనంలో బుధవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో మంటలు వ్యాపించినట్లు తెలుస్తోంది. చుట్టుపక్కల వారు వెంటనే సహాయక చర్యల ను ప్రారంభించారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో పాటు బకెట్లతో నీటిని తీసుకొచ్చి మంటలను ఆర్పేందుకు యత్నించారు. అయితే అప్పటికే తీవ్ర నష్టం వాటిల్లింది. ఇంట్లోని గ్యాస్ సిలిండర్లు సైతం పేలడంతో ప్రమాద తీవ్రత మరింత పెరిగింది. ఈ ఘటనలో భవనంతో పాటు అందులోని ఫర్నిచర్, ఇంటి ఆవరణలో నిలిపి ఉంచిన కార్లు, బైక్‌లు కూడా దగ్ధమయ్యాయి. భవనం ముందు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సైతం పేలిపోవడంతో అక్కడ విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. 'సిలిండర్లు పేలడం మేం చూశాం' ప్రాథమిక విచారణ ప్రకారం, ఇంటి వద్ద ఒక ఎలక్ట్రిక్ కార్ చార్జింగ్ సమయంలో షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు ప్రారంభమైనట్లుగా పోలీస్ కమిషనర్ సంతోష్ సింగ్ తెలిపారు. అవి క్రమంగా భవనానికి వ్యాపించాయని చెప్పారు. ఇంట్లో 10కి పైగా ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్లు ఉన్నాయని, వాటిలో కొన్ని పేలిపోయాయని పేర్కొన్నారు. దీంతో పరిస్థితి మరింత భయానకంగా మారిందని పేర్కొన్నారు. ఈ పేలుడు కారణంగా మంటలు వేగంగా వ్యాపించి, లోపల ఉన్నవారు బయటకు వచ్చే అవకాశమే లేకుండా పోయిందని అన్నారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి 4:30 గంటల మధ్య సిలిండర్లు పేలడాన్ని కూడా తాము చూసినట్లు చెప్పారు. పొరుగు భవనం నుంచి పోలీసులు ఇంటిపై అంతస్తుకు చేరుకుని ముగ్గురిని రక్షించినట్లు తెలిపారు. ఈ ఇల్లు పాలిమర్ వ్యాపారం చేసే మనోజ్ పుగాలియాకు చెందినదిగా చెప్పారు. ఇంట్లో మండే స్వభావం గల కొన్ని రసాయనాలు కూడా ఉన్నట్లు తెలిపారు. ఘటన సమయంలో ఇంట్లో వేడుక అయితే ఘటన జరిగిన సమయంలో ఆ ఇంట్లో ఓ కార్యక్రమం జరుగుతున్నట్లుగా సమాచారం. ఈ సమయంలో ఇంట్లో సుమారు 10 మంది ఉన్నారని అధికారులు తెలిపారు. పోలీసులతో కలిసి కలెక్టర్ శివమ్ వర్మ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం పరిస్థితి అదుపులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. రెండు అంతస్తులు పూర్తిగా ఖాళీ చేయించామని, మరో అంతస్తును ఇంకా తనిఖీ చేస్తున్నామని చెప్పారు. ప్రమాదం సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు కొన పోలీసులు ఘటనాస్థలిసాగుతోందని అధికారులు తెలిపారు. దర్యాప్తునకు కమిటీ ఏర్పాటుఇదిలా ఉండగా, ఘటనా స్థలాన్ని రాష్ట్ర మంత్రి కైలాశ్ విజయవర్గియా సందర్శించారు. అక్కడి అధికారులతో పరిస్థితిని సమీక్షించారు. సహాయక చర్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఇది చాలా బాధకరమైన, ఆందోళనకరమై ఘటన అని అన్నారు. ఇది ఎలక్ట్రిక్ వాహనాల యుగం కాగా, ఈవీ ఛార్జింగ్ పాయింట్ వద్ద మంటలు చెలరేగడం ఆందోళన కలిగించే విషయమని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నివారించడానికి ఒక ప్రామాణిక కార్యాచరణ విధానాన్ని (ఎస్ఓపీ) రూపొందించేందుకు వీలుగా, ఈ ఘటనపై విచారణ జరిపేందుకు ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని మేము జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ (సీపీ)ని కోరామమని తెలిపారు.

# గుజరాత్ అసెంబ్లీకి బాంబు బెదిరింపు



**అహ్మదాబాద్, మార్చి 18**: గుజరాత్ అసెంబ్లీకి బాంబు బెదిరింపులు వచ్చాయి. అసెంబ్లీ అధికారులకు ఈమెయిల్ పంపిన ఆగంతకులు అసెంబ్లీలో బాంబులు పెట్టామని.. అసెంబ్లీని లేపేస్తామంటూ బెదిరిం పులకు పాల్పడ్డారు. వెంటనే అలర్ట్ అయిన అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. డాగ్ స్క్వాడ్, అగ్నిమాపక సిబ్బందితోపాటు పోలీసులు అసెంబ్లీ వద్దకు చేరుకుని.. ఆ ప్రాంగణంలో ముమ్మర తనిఖీలు చేపట్టారు. గుజరాత్ అసెంబ్లీకి బాంబు బెదిరింపు వచ్చింది. అసెంబ్లీ అధికారులకు ఈమెయిల్ పంపిన దుండగులు. అసెంబ్లీలో బాంబులు పెట్టినట్లు బెదిరింపులకు పాల్పడ్డారు. ప్రస్తుతం గుజరాత్ అసెంబ్లీ బడ్జెట్ సమావే శాలు జరుగు తున్నాయి. (బుధవారం) ఉదయం 9 గంటలకు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కావాల్సి ఉంది. ఉదయం 8.45 గంటల ప్రాంతంలో తమకు ఈ మెయిల్ అందిందని అసెంబ్లీ అధికారులు తెలిపారు. అసెంబ్లీ ప్రాంగణంలో పోలీసులు అణువణువు తనిఖీలు చేపట్టారు. అయితే ఇప్పటి వరకు ఎటువంటి పేలుడు పదార్థాలు లభ్యం కాలేదని పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించారు. ఈ బాంబు బెదిరింపుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మరోవైపు ఈ బడ్జెట్ సమావేశాల్లో పాల్గొనేందుకు అసెంబ్లీకి వచ్చిన ఎమ్మెల్యేలను భద్రతా సిబ్బంది బయటకు పంపించేశారు.

# ఇంజినీరింగ్ స్టూడెంట్స్ అద్భుత ఆవిష్కరణ కార్బన్ డయాక్సైడ్‌తో గ్రీన్ హైడ్రోజన్ తయారీ ఇంధన సమస్యకు చెక్!




**కర్ణాటక :** వాయు కాలుష్యం, ఇంధన సంక్షోభాన్ని తగ్గించేందుకు కీలక ఆవిష్కరణ చేశారు కర్ణాటకలోని ఓ ఇంజినీరింగ్ కాలేజీకి చెందిన విద్యార్థులు. వాతావరణం నుంచి కార్బన్ డయాక్సైడ్‌ను సంగ్రహించి దానిని జీవ ఇంధనంగా (గ్రీన్ హైడ్రోజన్) మార్చే 'బయోలూప్' అనే ఒక నూతన వ్యవస్థను అభివృద్ధి చేశారు. ఈ క్రమంలో వారిపై ప్రసంసలు కురుస్తున్నాయి. ఇంజినీరింగ్ విద్యార్థుల ఆవిష్కరణబెళగావి జిల్లాలోని ఎస్‌జీ బాలేకుంద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు ప్రకుల్ హిరేమత్, హర్షిత్ హిరేమత్, అంకిత్ దాసనకొప్ప, సూరజ్ పశ్చాపూర్, శ్రేయ యరగట్టిమత్‌లు కాలేజీ ప్రొఫెసర్ శివానంద్ హిరేమత్ మార్గదర్శకత్వంలో ఈ ప్రాజెక్ట్‌ను రూపొందించారు. ఇది జాతీయ స్థాయిలో అందరి దృష్టిని ఆకర్షించింది. దిల్లీలోని భారత్ మండపంలో ఇటీవల జరిగిన ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026లో బయోలూప్ ఆల్గే సిస్టమ్‌ను రూపొందించిన విద్యార్థులపై ప్రశంసలు కురిపించారు. వీరి కృషిని పలువురు అభినందించారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ మంత్రిత్వ శాఖ, అంతర్జాతీయ ఇంధన సంస్థ ప్రచురించిన 'కేస్ బుక్ ఆన్ రియల్ వరల్డ్ ఇంపాక్ట్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్ ఎనర్జీ' సంచికలో బయోలూప్‌పై వ్యాసం ప్రచురితమైంది. ఈ ప్రాజెక్టును 15 ప్రధాన ఏఐ ఎనర్జీ కేస్ స్టడీస్‌లో చేర్చారు. బయోలూప్ అంటే ఏమిటి? బయోలూప్ అనేది వాతావరణం నుంచి కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహించడం ద్వారా జీవ ఇంధనాలను ఉత్పత్తి చేయడానికి రూపొందించిన ఒక వినూత్న ప్రయోగాత్మక నమూనా. బయోలూప్ వ్యవస్థ అనేది శైవలాలతో నడిచే ఒక ఫోటోబయోరియాక్టర్ ఆధారంగా పనిచేస్తుంది. బయోరియాక్టర్ లోపల కాంతి, ఉష్ణోగ్రత, పోషక స్థాయిలు, వాయు మార్పిడి, శైవలాల పెరుగుదల వంటి అంశాలను నిరంతరం పర్యవేక్షించడానికి, విశ్లేషించడానికి ఒక వ్యవస్థను రూపొందించారు. శైవలాలకు వాతావరణం నుంచి కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహించి ఉష్ణోగ్రత, పోషక స్థాయిలుసంద్రీయ సమ్మేళనాలను ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉంది. ఈ ప్రక్రియను ఏఐ టెక్నాలజీ, మెషిన్ లెర్నింగ్ ద్వారా పర్యవేక్షిస్తారు. ఆ తర్వాత కార్బన్ డయాక్సైడ్‌ను జీవ ఇంధనం లేదా గ్రీన్ హైడ్రో జన్‌ను ఉత్పత్తి చేయడానికి ఉపయోగిస్తారు. ఈ ఆవిష్కరణ సంప్రదాయ ఇంధనాలకు ఒక మంచి ప్రత్యామ్నాయాన్ని అందిస్తుంది. అలాగే వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ పరిమాణాన్ని తగ్గిస్తుంది. స్టూడెంట్స్ ఏమంటున్నారంటే? రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కారణంగా తలెత్తిన ప్రపంచ ఇంధన సంక్షోభ సమయంలో ఈ ఆలోచన పుట్టిందని విద్యార్థి ప్రకుల్ హిరేమత్ ఈటీవీ భారత్‌కు తెలిపారు. భారతదేశం ఇంధన రంగంలో ఇంకా పూర్తి స్వయం సమృద్ధి సాధించలేదన్నారు. ఇంకా చమురు దిగుమతుల కోసం ఇతర దేశాలపై ఎక్కువగా ఆధారపడుతోందన్నారు. అదే సమయంలో దేశంలో వాయు కాలుష్య స్థాయిలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. "రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం తర్వాత ప్రపంచంలో ఇంధన సమస్య తలెత్తింది. ఆ సమయంలోనే మాకు ఈ ఆలోచన వచ్చింది. మా కళాశాల యాజమాన్యం కూడా మాకు సహకరించింది. స్టార్టప్ కర్ణాటక నుంచి రూ. లక్ష గ్రాంట్ కూడా అందుకున్నాం. బయోలూప్‌ను మరింత అభివృద్ధి చేసి భారత్‌ను ఇంధన స్వయం సమృద్ధి గల దేశంగా మార్చడమే మా లక్ష్యం." అని ప్రకుల్ హిరేమత్ స్పష్టం చేశారు.

# ఇరాన్ కోలుకోవడానికి పదేళ్లు పడుతుంది: ట్రంప్



**అమెరికా :** ఇరాన్‌పై ఇజ్రాయెల్-అమెరికా చేస్తున్న సం యుక్త దాడులు ఉధృతమయ్యాయి. ఈ దాడుల కారణంగా టెహ్రాన్ భారీగా నష్టపోయింది. ఓవైపు కీలక నేతలు వరుసగా ప్రాణాలు కోల్పోతుండగా... మరోవైపు అణు స్థావరాలు, జనావాసాలు పూర్తిగా దెబ్బతింటున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రం ప్‌కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌పై కొనసా గుతున్న తమ సైనిక చర్యలు చాలా బాగా సాగుతున్నాయని, వాటివల్ల కలిగిన నష్టాన్ని పునర్నిర్మించడానికి ఇరాన్‌కు కనీసం ఒక పదేళ్లు పట్టవచ్చని ట్రంప్ అభిప్రాయపడ్డారు. 'ఇరాన్‌పై యుద్ధం చాలా బాగా సాగుతోంది. వారి(ఇరాన్) వద్ద అణ్వాయుధాలు ఉండనివ్వకూడదు. భవిష్యత్‌లో వారి నుంచి ఎవరికీ అణుముప్పు రాకూడదనేదే మా లక్ష్యం. మరో రెండు వారాల పాటు ఈ యుద్ధం కొనసాగే అవకాశం ఉంది. మేము ముందస్తు దాడులు ప్రారంభించకపోయి అణ్వాయుధాలను అభివృద్ధి చేసేది' అని ట్రంప్ తెలిపారు. 'ఇరాన్‌పై దాడులు ఇంకా ముగియలేదు. ఆ దేశానికి శాశ్వత నష్టం కలిగించడానికి మేము మరిన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పుడే యుద్ధాన్ని ఆపేసినా ఆ దేశాన్ని పునర్నిర్మించుకోవడానికి అక్కడి పాలకులకు 10 ఏళ్ల సమయం పడుతుంది. కానీ మరే ఇరాన్ అధ్యక్షుడు ఇలాంటి సాహసం చేసేందుకు ధైర్యం చేయకుండా, అలానే మళ్లీ కోలుకోలేనివిధంగా ఆ దేశానికి నష్టం కలిగించాలన్నదే మా ఉద్దేశం' అని ట్రంప్ వెల్లడించారు. ఇదే సమయంలో హోర్ముజ్ జలసంధికి యుద్ధ నౌకలను పంపడానికి నాటోతో పాటు మిత్రదేశాలు నిరాకరించడంపై ట్రంప్ అసహనం వ్యక్తంచేశారు. ఈ విషయంలో నాటో తెలివితక్కువగా ప్రవర్తిస్తోందన్నారు. హోర్ముజ్ జలసంధిని తెరిపించాల్సిన అవసరం ఉన్నప్పటికీ తమ మిత్రదేశాలు ముందుకురావట్లేదన్నారు. అయినప్పటికీ తాము వెనక్కి తగ్గే ప్రసక్తి లేదన్నారు. అంతర్జాతీయ నౌకాయానానికి ముప్పుగా మారిన ఇరాన్ యాంటీ-షిప్ క్రూయిజ్ క్షిపణులను అడ్డుకునేందుకు ఈ దాడులు చేసినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ అధికారికంగా ప్రకటించింది. ఈ దాడిలో దాదాపు 2,200 కిలోల బరువున్న అత్యంత శక్తిమంతమైన బంకర్ బస్టర్ బాంబులను అమెరికా ప్రయోగించింది. ట్రంప్ ప్రకటన వెలువడిన కొన్ని గంటల్లోనే..హోర్ముజ్ జలసంధికి యుద్ధ నౌకలను పంపే విషయంలో నాటో (చీఫ్), ఇతర మిత్రదేశాలు వెనకడుగు వేశాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటిం చిన కొద్ది గంటల వ్యవధిలోనే ఈ దాడులు జరగడం గమనార్హం. మిత్రదేశాల సహకారం లేకపోయినా, ఒంటరిగానే ఇరాన్‌ను ఎదుర్కొంటామనే సంకేతాన్ని అమెరికా ఈ చర్యతో పంపింది. సాధారణ బాంబులు భూ ఉపరితలంపై మాత్రమే ప్రభావం చూపుతాయి. కానీ, బంకర్ బస్టర్లు భూమిలోకి లోతుగా చొచ్చుకుపోయి, అక్కడున్న కాంక్రీట్ కట్టడలను, భూగర్భ స్థావరాలను ధ్వంసం చేస్తాయి. 2022 గణాంకాల ప్రకారం, ఒక్కో బాంబు తయారీకి దాదాపు 2.88 లక్షల డాలర్లు (సుమారు రూ. 2.6 కోట్లు) ఖర్చవుతుంది. గతేడాది ఇరాన్ అణు కేంద్రాలను లక్ష్యంగా చేసుకున్నప్పుడు అమెరికా ఏకంగా 13,600 కిలోల భారీ బాంబులను ఉపయోగించింది. ఈ దాడుల నేపథ్యంలో హర్మూజ్ జలసంధి గుండా జరిగే చమురు సరఫరాకు ఆటంకం కలిగే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే ఉద్రిక్తతలతో అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు పెరుగుతున్నాయి. ఇరాన్ దీనిపై ఎలా స్పందిస్తుందనేది ఇప్పుడు ప్రపంచ దేశాల్లో ఉత్కంఠ రేపుతోంది.

# దిల్లీలో భారీ అగ్నిప్రమాదం- 8మంది మృతి



**దిల్లీ :** దేశ రాజధాని దిల్లీలోని పాలం ప్రాంతంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఓ భవనంలో మంటలు చెలరేగి ఒకే కుటుంబానికి చెందిన ఎనిమిది మంది మృత్యువాత పడ్డారు. మృతుల్లో ముగ్గురు చిన్నారులు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనపై మేజిస్ట్రేట్ విచారణకు దిల్లీ సీఎం ఆదేశించారు. బుధవారం ఉదయం దిల్లీలోని పాలంలో ఉన్న నాలుగు అంతస్తుల భవనంలో ఈ అగ్నిప్రమాదం సంభవించింది. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే దిల్లీ ఫైర్ సర్వీస్ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకు న్నారు. సుమారు 30 ఫైర్ టెండర్లతో మంటల ను అదుపులోకి తీసుకువచ్చి, సహాయక చర్యలు చేపట్టారు. మంటల వల్ల భవనం అంతా దట్టమైన పొగతో నిండిపోవడంతో పలువురు లోపల చిక్కుకున్నారు. రక్షణ సిబ్బంది సమ యానికి స్పందించి అనేక మందిని బయటకు తీసుకువచ్చారు. పొగ కారణంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఎదురైన నలుగురిని ఆసుపత్రికి తరలించారు. భవనంలో మరికొందరు చిక్కుకుని ఉంటారన్న అనుమానంతో డ్రోన్ల సాయంతో అగ్నిమాపక దళాలు గాలింపు చర్యలు చేపట్టాయి. షార్ట్ సర్క్యూట్? కారణమా? భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న కాస్మొటిక్స్ షాపులో ముందుగా మంటలు చెలరేగినట్లు పోలీసులు తెలిపారు. నిమిషాల వ్యవధిలోనే అవి పైఅంతస్తులకు వ్యాపించాయి. భవనంలో రసాయనాలు, బట్టలు నిల్వ ఉండటంతో ప్రమాద తీవ్రత పెరిగింది. ప్రాణభయంతో ఇద్దరు వ్యక్తులు భవనం పైనుంచి కిందకు దూకి తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ప్రాంతాన్ని ఖాళీ చేయించారు. ట్రాఫిక్‌ను నియంత్రించారు. అగ్నిప్రమాదానికి కచ్చితమైన కారణం ఇంకా తెలియకపోయినా, ప్రాథమికంగా షార్ట్ సర్క్యూట్ కారణమై ఉండొచ్చని అనుమానం వ్యక్తమవుతోంది. పోలీసులు కేసు నమోదు చేసి ప్రత్యేక బృందంతో దర్యాప్తు ప్రారంభించారు. అలాగే భవన భద్రతా ప్రమాణాలపై కూడా విచారణ జరపనున్నారు. బేస్‌మెంట్, గ్రౌండ్, మొదటి అంతస్తులో దుస్తులు, కాస్మొటిక్స్ నిల్వకు రెండో, మూడో అంతస్తులు నివాసం కోసం ఉపయోగిస్తున్నట్లు తెలుస్తుంది. పైకప్పుపై తాత్కాలిక టిన్ షెడ్ కూడా ఉంది. స్పందించిన గవర్నర్, సీఎంఇదిలా ఉండగా, ఈ ఘటనపై దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ తరణజిత్ సింగ్ సంధు స్పందించారు. ఈ ఘటనపై తీవ్ర కలత చెందినట్లు చెప్పారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతినిని తెలియజేశారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అగ్నిమాపక, సహాయక చర్యలను నిశితంగా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. అవసరమైన అన్ని సహాయాన్ని అందిస్తామని చెప్పారు. మరోవైపు ఈ ఘటనపై దిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా కూడా స్పందించారు. ఈ ఘటనపై మేజిస్ట్రేట్ విచారమకు ఆదేశించినట్లు తెలిపారు. పాలంలోని బహుళ అగ్నిప్రమాదం దురదృష్టకరం అని ఈ ఘటనతో తాను తీవ్రంగా కలత చెందానని ఎక్స్?లో పోస్ట్ చేశారు. ఉదయం 6 గంటల ప్రాంతంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయని స్థానికులు రఘునందన్ శర్మ పేర్కొన్నాడు. మంటలు త్వరగా వ్యాపించాయని, వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించామని చెప్పాడు. అయితే వారు 40 నిమిషాల తర్వాత ఘటనాస్థలికి వచ్చారని, వారినిచ్చెన, హైడ్రాలిక్ యంత్రం సరిగా పనిచేయలేదని తెలిపాడు. వారు సమయానికి వచ్చి ఉంటే ఇంత ఘోరంగా జరిగి ఉండేది కాదని అన్నాడు. ఇప్పటికే పలు మృతదేహాలను వెలికితీశారని, ఇంకా లోపల ఉండొచ్చని చెప్పాడు. ఇండోర్ అగ్నిప్రమాదంలో 8 మంది మృతిమధ్యప్రదేశ్ ఇండోర్?లో కూడా నివాస భవంలో అగ్నిప్రమాదం జరిగింది. ఓ నివాస భవనం బయట ఉన్న ఎలక్ట్రిక్ వాహనం ఛార్జింగ్ పాయింట్ పేలిపోయి మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన 8 మంది మృతి చెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు.

# సీఎం పదవి ఆఫర్ చేసిన జాతీయ పార్టీ



**చెన్నై :** వీకే అధినేత, నటుడు విజయ్‌కు తమిళనాడులో ఒక జాతీయ పార్టీ సీఎం పదవి ఆఫర్ చేసిందని టీవీకే నేత అధవ్ అర్జున అన్నారు. అయితే, అది ఏ పార్టీయో వెల్లడించలేదు. ఆయన వ్యాఖ్యల్ని బట్టి, అది జాతీయ పార్టీ అని స్పష్టమవుతోంది. అయితే, ఈ ఆఫర్‌ను విజయ్ తిరస్కరించినట్లు అర్జున తెలిపారు. తమిళనాడు ఎన్నికల్లో టీవీకే పార్టీ ప్రభావాన్ని కాదనలేం. ఆ పార్టీ అధినేత, నటుడు విజయ్‌కు ఉన్న ఫాలోయింగ్ తప్పకుండా ఎన్నికల్లో ప్రభావం చూపిస్తుంది. ఆయన పార్టీ అధికారంలోకి వస్తుందా.. రాదా అంటే ఇప్పుడే చెప్పలేం. కానీ, ఓటర్లను ప్రభావితం చేయగలదు. అందుకే విజయ్‌ను తమ వైపు తిప్పుకొనేందుకు జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ ప్రయత్నిస్తున్నాయన్నది ఒక ప్రచారం. ఇటీవల పలు సందర్భ?ల్లో కాంగ్రెస్ నేతలు విజయ్ పట్ల సానుకూలంగా మాట్లాడారు. ఇదే సమయంలో బీజేపీ నేతలు కూడా విజయ్‌ను తమవైపు తిప్పుకొనేందుకు ప్రయత్నించారని ప్రచారం మొదలైంది. మొదట ఆయనకు డిప్యూటీ సీఎం పదవిని బీజేపీ ఆఫర్ చేసిందని ప్రచారం జరిగింది. ఇదే అంశంపై టీవీకే నేత ఆదవ్ అర్జున మాట్లాడారు. ఒక జాతీయ పార్టీ విజయ్‌కు సీఎం పదవి ఆఫర్ చేసిందని వెల్లడించారు. అంతేకాదు.. మొదట 50 సీట్ల నుంచి మొదలై 90 సీట్లు, ఆపై సగం సీట్ల వరకు ఇచ్చేందుక సిద్ధమైనట్లు తెలిపారు. అయితే, సీఎం పదవి కోసం విజయ్ ఢిల్లీ ముందు తలవంచబోరని చెప్పారు. ఈ ఆఫర్‌ను విజయ్ తిరస్కరించారని అర్జున అన్నారు.

# రూ.1000 ఈపీఎఫ్ పెన్షన్ ఒక జోక్ మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ ఫైర్!



ఉద్యోగ భవిష్య నిధి (ఈపీఎఫ్) కనీస పెన్షన్ ఇప్పటికీ రూ.1000 మాత్రమే ఉండటం ఒక జోక్ లాంటిదని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. కార్మికులు, ఉద్యోగుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం తప్పకుండా తగిన చర్యలను తీసుకోవాలని డిమాండ్ చేసింది. పెరిగిన ధరల దృష్ట్యా ఈపీఎఫ్ కనీస పెన్షన్ సరిపోదని, దీన్ని గౌరవప్రదమైన స్థాయికి పెంచాలని ఓ పార్లమెంటరీ కమిటీ కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఈ వ్యాఖ్యలు చేశారు. దాదాపు 12 ఏళ్ల మోదీ పాలనలో చాలా సామాజిక భద్రతా పథకాలను క్రమంగా బలహీనపర్చడం లేదా ఉద్దేశపూర్వకంగా విస్మరించడం జరిగిందని ఆయన ఆరోపించారు. ద్రవ్యోల్బణం పెరుగుతూ పోతున్నా, ఈపీఎఫ్ కనీస పెన్షన్‌ను ఇప్పట దాకా అస్సలు పెంచలేదన్నారు. ఈమేరకు ఆయన ఎక్స్ వేదికగా హిందీలో ట్వీట్ చేశారు. భారీ ద్రవ్యోల్బణంలో, అతి తక్కువ పెన్షన్"ఎంప్లాయీస్ పెన్షన్ స్కీం - 1995 ప్రకారం ఇప్పుడున్న కనీస నెలవారీ పెన్షన్ రూ.1000పై వెంటనే సమీక్ష నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వానికి పార్లమెంటరీ కమిటీ సిఫారసు చేసింది. కేవలం వెయ్యి రూపాయల కనీస పెన్షన్ నేటి అవసరాలను తీర్చలేదని కమిటీ నివేదించింది. నేటి జీవన వ్యయాలకు తగిన విధంగా, పెన్షనర్ల గౌరవప్రదమైన జీవితానికి ఉపయోగపడే స్థాయికి కనీస పెన్షన్‌ను పెంచాలని ఆ కమిటీ ప్రభుత్వానికి సూచించింది. కనీస పెన్షన్ ఇంత తక్కువగా ఉండటం వృద్ధులు, ఆర్థికంగా బలహీనులైన పెన్షనర్లను నేరుగా ప్రభావితం చేసింది. కేంద్ర ప్రభుత్వం తప్పుడు విధానాల వల్ల ఇప్పుడు ద్రవ్యోల్బణం తీవ్రస్థాయులకు పెరిగిపోయింది.

# ఎన్డీఏ అభ్యర్థులుగా తండ్రీ కొడుకులు బరిలోకి




**కేరళ :** కేంద్ర ఎన్నికల సంఘం నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో ఆయా రాష్ట్రాల్లో ఎన్నికల కోలాహలం నెలకొన్నది. గెలుపు గుర్రాల ఎంపికలో పార్టీలు బిజీబిజీగా ఉన్నాయి. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో అభ్యర్థుల తొలి జాబితాలను ప్రకటించాయి. కేరళ రాష్ట్రం కొట్టాయం జిల్లాలో క్రైస్తవ జనాభా అధికంగా ఉన్న రెండు నియోజకవర్గాల్లో ఎన్డీఏ కూటమి తన అభ్యర్థులుగా సీనియర్ రాజకీయ నేత పీసీ జార్జ్, ఆయన తనయుడు శోన్ జార్జ్‌లను బరిలోకి దించింది. బీజేపీ సోమవారం విడుదల చేసిన అభ్యర్థుల జాబితా ప్రకారం.. క్రైస్తవులు గణనీయంగా ఉన్న పూంజర్, పాలా నియోజకవర్గాల్లో జార్జ్, శోన్‌లు పోటీ చేస్తున్నారు. ప్రస్తుతం బీజేపీ జాతీయ మండలి సభ్యుడిగా పీసీ జార్జ్, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శోన్ పని చేస్తున్నారు. ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన జార్జ్ మూడు దశాబ్దాలకుపైగా శాసనసభ సభ్యుడిగా ఉన్నారు.

# పరాభవనామ ఉగాది !





కాలం ఒక ప్రవాహం! కాలం దైవ స్వరూపం. నిరంతరంగా సాగుతూనే ఉంది. ఈ ప్రకృతి ఎప్పుడు మొదలయ్యిందో తెలియదు కానీ..మానవుడు తనకు ఊహ తెలిసి, జ్ఞానం సముపార్జించాక సూర్యచంద్రుల గతులను బట్టి..కాల నిర్ణయం చేశాడిన చెబుతారు. పురాణాల ప్రకారం కాలం అనంతం. కాలానికి తగ్గట్టుగా కర్మలు నెరవేర్చడంతోనే మనిషి 'జ్ఞాన ప్రయాణం' మొదలైంది. అదే ఈ యుగానికి.. 'ఆది' అయింది. కాల మహిమను గుర్తు చేసుకుంటూ తెలుగు వారు చేసుకునే మొదటి పండుగే ఉగాది! చైత్రమాసం...వసంత రుతువు కూడా కాలానికి మార్పుగా గుర్తించాలి. ఉగాది నుంచే బ్రహ్మదేవుడు సృష్టి ఆరంభించాడని, యుగాది కాస్తా ఉగాది అయ్యిందన్న ప్రచారం కూడా ఉంది. కాలాన్ని ఆపడం, దానికి ఎదురెళ్లడం ఎవరి తరమూ కాదు. అయితే, మనిషి తన అవసరాలకు అనుకూలంగా కాలాన్ని విభజించుకున్నాడు. అలా కాలాన్ని పరిశీలించుకుంటూ దానికి తగ్గట్లు నడుచుకుంటూ తన బుద్ధికి పదును పెట్టుకున్నాడు. అలా ఉగాది పండుగను తొలి అడుగుగా గుర్తించాడు. చైత్రశుద్ధ పాడ్యమి సూర్యోదయ సమయంలో బ్రహ్మ ఈ జగత్తును సంపూర్ణంగా సృష్టించాడు. అని సమాధానం చెప్పాడు. ఇది ఇలా ఉంచితే మన దేశంలో పుష్య-మాఘ మాసాలు పంటలు పండి ప్రకృతి రసభరితంగా ఉండేకాలం. ప్రజలు తమ శ్రమ ఫలితాన్ని కట్టెదుట చూస్తూ పొంగి పోతారు.ఇదే మొదట్లో మన సంవత్సరాది. దీనిని సూచించే దినం మకర సంక్రమణం.ఇది మార్గశిర- పుష్య-మాఘమాసాల మధ్యన వచ్చేది విషువత్కాలం. విషువత్కాలమంటే పగలూ రాత్రీ సరిసమానంగా ఉండే కాలం. సమరాంత్రిందివే కాలే విషువత్ అన్నాడు అమరసింహుడు. ఈ విషువత్తులు రెండు.మకర సంక్రాంత్రి అలాంటి విషువత్తు లలో ఒకటి. ఈనాటి నుంచి ప్రకృతిలో క్రొత్త క్రొత్త మార్పులు కలగడం ఆరంభం అవుతుంది.మనకొక సంవత్సరమైతే దేవతలకొక దినం. వారి దినం మేషంతో ప్రారంభమౌతోంది; మానవుడు ఋతువులు తన లెక్కలకు ముందు వెనుకలుగా రావడం చూచి, సూర్యచారాన్ని తక్కిన గ్రహాల చారాన్ని లెక్కలు కట్టసాగాడు.సూర్యుడు విషువత్తులో ప్రవేశించిన నాటినుంచి లెక్కకట్టి రాసులు విభజించాడు. ఈవిధంగా నభో మండలం- 12 భాగాలు అయినది. ఆరాసులతోనే మాస సంకేతం చేసుకున్నాడు. సూర్యుడు ఒక రాశినుంచి మరొకరాశికి ప్రవేశించడానికి దాదాపు 30, 31 దినాలవుతుంది. కాని చంద్రుని వృద్ధిక్షయాలతో ఏర్పడిన నెలకు, తర్వాత సూర్యమానపు నెలకూ క్రమంగా నెలవారా రావడం మొదలైంది. చంద్రమానానికి 19 సం.లకు ఏడు అదనపు నెలలు చేర్చి రెండు మానాలను సర్దుకోవలసి వచ్చింది.కనుకనే ప్రతి మూడోఏటా చంద్రమాన సం.లో ఒక అధిక మాసం వస్తూవుంటుంది. నిజానికి చంద్రమానమే వేదకాలం నుంచి ఆచరణలో ఉన్నదేమో!! సౌరమానం వ్యవహారంలో ఉన్న ప్రాంతాలలోనూ వైదిక కర్మలకు చంద్రమానాన్ని అనుసరించడమే దీని ప్రాచీనతకు ప్రమాణం. ఉత్తరాయణం వసంత రుతువు శుక్ష పక్షం ప్యాడ్యమి తిథి.. ఉగాది పండుగ ఈ ఏడాది మార్చి 19న వచ్చింది. అనాదిగా వస్తున్న ఈ ఉగాది.. 'యుగాది'. అన్న సంస్కృత పదం నుంచి పుట్టింది. మన వేదాలకు మంత్ర సృష్టి జరిగిన రోజు. సూర్యుడు మేషరాశిలో ప్రవేశించే రోజు. కాలం వసంతంలోకి అడుగు పెట్టిన రోజునే ఉగాది. పండుగగా, కొత్తసంవత్సరాదిగా తెలుగువాళ్లు జరుపుకుంటున్నారు. వివిధ రాష్ట్రాల్లో వివిధ పేర్లతో ఈ ఉగాది జరుపుకోవడం ఆచారంగా వస్తోంది. మన సంప్రదాయంలో ఏ పండుగను చూసినా అది ప్రకృతితో ముడిపడి ఉంటుంది. అందులోనూ ఉగాది అయితే దాన్ని ఏకోణంలో చూసినా ప్రకృతి ఆధారంగానే కనిపిస్తుంది. వసంత రుతువు వచ్చిందని తెలియజేసే పండుగఉగాది. ఉగాది నాటికి చుట్టు పక్కన ఏ చెట్టును చూసినా లేత ఆకులతో పచ్చగా కనువిందు చేస్తుంటుంది. ఆ సంతోషం కోయిల పాటల్లో, నెమలి నాట్యాల్లో కనిపిస్తుంది. ఉగాది పండుగ వెనక ఉన్న కథనాన్ని ఒక్కొక్కరూ ఒక్కో విధంగా చెప్తారు. ఉగాది.. 'ఉగ' అంటే నక్షత్ర గమనం. జన్మ ఆయుష్షు అని అర్థాలు ఉన్నాయి. వీటికి అది ఉగాది అంటే ఈ ప్రపంచంలో పుట్టిన ప్రతి జీవి ఆయుష్షుడు మొదటిరోజునే ఉగాదిగా మారిందంటారు. చైత్ర శుద్ధ పాడ్యమి నాడే కలియుగం మొదలైందని.. త్రేతాయుగంలో ఉగాది రోజే శ్రీరాముడికి పట్టాభిషేకం జరిగిందని మరో కథనం.. ఈ రోజే శ్రీమహావిష్ణువు మత్స్యావతారంలో సోమకాసురుని సంహరించి వేదాలను బ్రహ్మకు అప్పగించాడని, బ్రహ్మదేవుడు సృష్టిని మొదలు పెట్టిన రోజే ఉగాదని అంటారు. మొదటి తెలుగు చక్రవర్తి శాలివాహనుడు. ఉగాది రోజునే సింహాసనాన్ని అధిష్టించాడనేది కూడా ప్రచారంలో ఉంది. ఉగాది రోజు నుంచే తెలుగు సంవత్సరం మొదలవుతుంది. కాబట్టి ఇది తెలుగువారి మొదటి పండుగగా పేరుగాంచింది. అయితే, తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్టాల్లోృ కూడా ఉగాదిని గొప్పగా జరుపు కుంటారు.. కర్నాటకలో ఉగాదిమహారాష్ట్రలో గుడిపాడ్వా, తమిళనాడులో 'పుత్తాండు అనే పేరుతో, కేరళలో 'విషు', పంజాబ్‌లో 'వైశాఖీ', బెంగాల్లో పొయ్లా బైశాఖ్ ' అనే పేర్లతో ఉగాది జరుపుకుంటారు. రెండు మూడు రోజుల ముందు నుంచే పండగ పనులు మొదలవుతాయి. ఉగాది రోజు పొద్దున్నే ఇంటిని శుభ్రం చేసుకుంటారు. తైల అభ్యంగన స్నానం చేసి గుమ్మానికి మామిడి తోరణాలు, వేపాకు తోరణాలు కడతారు. కొత్త బట్టలు వేసుకొని కొత్త కుండ కొనడంతో సందడి మొదలవుతుంది. ఒకవైపు పచ్చడి తయారు చేస్తుంటే..మరోవైపు వేడివేడిగా భక్ష్యాలు తయారవు తుంటాయి. ఉగాది పచ్చడి...వంటలు ఇష్టమైన దేవునికి నైవేద్యంగా పెట్టి కొత్త సంవత్సరం అంతా శుభం కలగాలని కోరకుంటారు. తర్వాత ఇంటిల్ల పాది పరగడపున ఉగాది పచ్చడి తిని, తర్వాత.. భక్ష్యాలు తింటారు. కొత్త పనులు, కొత్త వ్యాపారాలు కూడా ఉగాది నాడు మొదలు పెడుతుంటారు కొందరు. ఉగాది రోజు పంచాంగ శ్రవణం చేస్తారు. ఈ పంచాంగ శ్రవణం వినడం పట్ల ఈ సంవత్సరంలో జరగబోయే మంచి చెడులతో పాటు పరిణామాలు తెలుసుకుంటారు. కలియుగంలో నక్షత్ర ఫలితాలతో పాటు రాశిఫలాలు.. ఆదాయ వ్యయాలు, రాజపూజ్య అవమానాలు తెలుసుకుంటారు. ఇది జాగ్రత్తగా నడుచుకోవడానికి ఉపయోగపడుతుంది.

## ఉగాది పచ్చడి వైశిష్ట్యం

**● కాలంలో మార్పులను తట్టుకునే ఔషధం**



**శ్రీశైలం,మార్చి18:** తెలుగువారి కొత్త సంవత్సరం ప్రారంభం కానుంది. తెలుగు పంచాంగం ప్రకారం చైత్రమాసం శుద్ద పాడ్యమి రోజున ఉగాది పండుగతో కొత్త సంవత్సరం ఆరంభం కానుంది. ఈ ఏడాది ఉగాది పండుగ మార్చి 19న వచ్చింది. ఉగాది పండుగ రోజు అందరూ కచ్చితంగా ఉగాది పచ్చడి తినాలని పండితులు చెబుతుంటారు. అసలు ఆ రోజు ఉగాది పచ్చడి ఎందుకు తినాలి. ఎన్ని రోజులు వసంత గమన శు భవేళ.. పచ్చగా కళకళలాడే ప్రకృతి పరంగా.. రేవతి నక్షత్ర ప్రవేశంతో.. చైత్ర శుద్ధ పాడ్యమి గురువారం రోజున ఉగాది పండుగ .. శ్రీ పరాభవ నామ సంవత్సర కాలగమనం ఆరంభమవుతుంది. ఉగాది పచ్చడిని ఒక్కో చోట ఒక్కో విధంగా తయారు చేస్తుంటారు. అందులో తీపి, పులుపు, ఉప్పు, కారం, చేదు, వగరు అనే ఆరు రుచులను తప్పకుండా ఉండేలా చూస్తారు. ఈ పచ్చడి కోసం చెరకు, అరటి పళ్ళు, మామిడి కాయలు, వేప పువ్వు చింతపండు, జామకాయలు, బెల్లం, జీలకర్ర, మిరపకాయ వంటివి వాడుతుంటారు. ఇన్ని కలిపి చేసిన ఉగాది పచ్చడిని ఒక మహాఔషధమని అంటారు పెద్దలు. ఈ ఉగాది పచ్చడిని ఈ పండుగ నుంచి శ్రీరామనవమి వరకూ లేదాచైత్ర పౌర్ణమి వరకు ప్రతిరోజూఉంటే శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని. ఆ సంవత్సరమంతా రోగాలేవీ దరిచేరవనే నమ్మకం కూడా ఉంది. ఆయుర్వేద శాస్త్రం ప్రకారం ఉగాది పచ్చడిని నింబకుసుమ భక్షణం...అశోకకళికా ప్రాశనం అంటారు. రుతువులలో వచ్చే మార్పుల వల్ల వచ్చే రోగాల నుంచి రక్షణగా, ఈ పచ్చడిని ఔషధంగా తీసుకోవడం పూర్వం నుంచే అనవాయితీగా వస్తోంది. పచ్చడిలో ఉండే వేప పువ్వు కడుపులో ఉన్న నులిపురుగులను చంపేస్తుంది. వేపగాలి ఆటలమ్మ అమ్మోరు వంటి అంటురోగాలను దగ్గరకి రానివ్వకుండా కాపాడుతుంది మామిడి యాంటీ వైరల్ లక్షణాలు కలిగి ఉంది. మిరియాలు దగ్గు జలుబు, పైత్యాలను అదుపులో ఉంచుతాయి. బెల్లం రక్తాన్ని శుద్ధి చేస్తుంది. చింతపండు మలబద్ధకాన్ని, నీరసాన్ని తగ్గిస్తుంది. ఉప్పు ఎండాకాలంలో వచ్చే హైడ్రేషన్ని తగ్గిస్తుంది. సంవత్సరం అంతా ఎదురయ్యే మంచి చెడులను, కష్ట సుఖాలను సమానంగా తీసుకోవాలనే సందేశాన్ని కూడా ఉగాది పచ్చడి ఇస్తుంది. బెల్లం- తీపి అనేది సంతోషానికి, ఉప్పు- జీవితంలో ఉత్సాహానికి... వేప పువ్వు- చేదు బాధ తాలూకు అనుభవాలకు, చింతపండు- పులుపు నేర్పుగా వ్యవహరించాల్సిన పరిస్థితులకు, పచ్చి మామిడి ముక్కల పులుపు- కొత్త సవాళ్లకు.. కారం సహనం కోల్పోయేట్టు చేసే పరిస్థితులకు సంకేతం అని చెప్తారు.ఉగాది పచ్చడి ఒక మహాఔషధమని పెద్దలు చెబుతుంటారు. ఈ ఉగాది పచ్చడిని శ్రీరామ నవమి వరకూ లేదా చైత్ర పౌర్ణమి వరకు ప్రతిరోజూ తీసుకోవాలి. అలా 9 లేదా15 రోజుల పాటు ఈ ఉగాది పచ్చడి తినడం వల్ల శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందంటారు. ఉగాది పచ్చడిలో ఉండే వేప పువ్వు కడుపులో ఉన్న నులిపురుగులను చంపేస్తుంది. వేపగాలి ఆటలమ్మ, అమ్మోరు మొదలైన వ్యాధులను దగ్గరకు రానీయదు. మామిడి యాంటీ వైరల్ లక్షణాలు కలిగి ఉన్నది. ఇది కఫము, వాతము, పైత్యాలనే మూడు దోషాలను అదుపులో ఉంచుతుంది. మనకు వచ్చే జబ్బుల్లో చాలా వరకూ వీటివల్లే వస్తాయి.. 'శతాయుర్వజ్ర దేవయ సర్వ సంపత్రాయచ.. సర్వతిష్ట వినాశయ నిబంకదళ బక్షణమ్' అనే శ్లోకం పఠించి ఉగాది ప్రసాదాన్ని స్వీకరించాలి. పంచాంగ శ్రవణం వినాలి. మంచి ఆశయాలతో ముందడుగు వేయాలి. ఆ రోజున (మార్చి 19) పంచాంగాన్ని విన్న పక్షంలో ఏ గ్రహం మనకి అనుకూలంగా లేదో, ఎవరు మనకి సహాయకులో తెలిసి, ఏయే కష్ట నష్టాలో తెలుసుకొని వాటికి సంబంధించిన ప్రత్యామ్నాయ మార్గాలను ఎన్నుకోగలుగుతామని పండితులు చెబుతున్నారు.


## ఆత్మపరిశీలనతో అడుగు వేయాలి

**పరాభవంలో అప్రమత్తంగా ఉండాలి**



**విజయవాడ,మార్చి18:** తెలుగువారి నూతన సంవత్సరం పరాభవనామ సంవత్సరం. జ్యోతిష్యశాస్త్రం ప్రకారం పరాభవం అంటే గర్వం.. అహంకారం.. స్వార్థం అని అర్థం. పండితులు తెలిపిన వివరాల ప్రకారం.. పరాభవం అంటే ఏమిటి.. కొత్త సంవత్సరం విశేషాలు.. రహస్యాలు ఏమిటి.. తెలుగు పంచాంగం ప్రకారం.. కొత్త సంవత్సరం.. పరాభవ నామ సంవత్సరం మార్చి 19న ప్రారంభం కానుంది. కొత్త సంవత్సరం గురించి .. ఆధ్యాత్మికంగా పరిశీలించినట్లైతే.. ఇలాంటి వ్యతిరేక లక్షణాలను లక్షణాలను జయించి వినయం వైపు నడిపించే కాలాన్ని సూచిస్తుంది. ప్రతి వ్యక్తి తన లోపాలను గుర్తించి..వాటిని అధిగమించడానికి ప్రయత్నించే సంవత్సరమని పండితులు వివరిస్తున్నారు. పరాభవం అంటే ఏమిటి..పురాణాల ప్రకారం తెలుగు కాలచక్రంలో 60 సంవత్సరాలు ఉంటాయి. ఈ చక్రంలో పరాభవ అనేది 40వ సంవత్సరం. సంస్కృతంలో ..పరాభవ.. అంటే ఓటమి.. అపజయం .. అవమానం అనే అర్థాలు ఉన్నాయి. కాని జ్యోతిష్యనిపుణులు , ఆధ్యాత్మిక పండితుల విశ్లేషణ ప్రకారం .. పరాభవ నామ సంవత్సరానికి లోతైన తాత్పర్యం ఉందని చెబుతున్నారు. కొత్త సంవత్సరం పేరులో ప్రతికూలత ఉన్నా కాని.. మనిషి జీవితంలో మార్పు, ఆత్మపరిశీలన, ఆత్మవికాసాన్ని సూచించేందుకు ఒక సంకేతమని చెబుతున్నారు. అహంకారంపై విజయం : కొత్త సవంత్సరం.. పరాభవ నామ సంవత్సరం పేరు ఆధారంగా స్వార్థం.. అహంకారం.. గర్వం.. మొదలగు చెడు లక్షణాలను వదలి.. మంచిగా.. అందరి మన్నలు పొందేలా ఈ తెలుగు సంవత్సరం ( పరాభవ) సూచిస్తుందని పండితులు చెబుతున్నారు.ప్రతి వ్యక్తి తనలోని లోపాలను గుర్తించి.. వాటిని అధికమించేందుకు ఈ ఏడాది ప్రయత్నించే దశ అని పండితులు చెబుతున్నారు. తెలుగు సంవత్సరం పరాభవ నామ సంవత్సరం.. ప్రతి మనిషి తన గత అనుభవాలు... తప్పులు... విజయాల గురించి ఆలోచించి... వాటి నుంచి పాఠాలు నేర్చుకునే సమయంగా భావిస్తారు. ఇది వ్యక్తిత్వ వికాసానికి దారితీసే ఒక ఆత్మపరిశీలనా దశను సూచిస్తుంది. ప్రతి వ్యక్తికి కూడా కొంతమంది శత్రువులు ఉంటారు. పలు ఆధ్యాత్మిక గ్రంథాల్లో చెప్పిన విధంగా అరిషడ్వర్గాలు.. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు.. మనిషి ఎదుగుదలను అడ్డుకోవడం.. శత్రువులను పెంచే అంతర్గత శత్రువులు ఉంటారు. పరాభవ నామ సంవత్సరంలో ఇలాంటి ఎనిమీస్‌పై విజయం సాధించి.. ధర్మబద్ధంగా జీవితం గడిపేందుకు ఒక సూచన అని పండితులు చెబుతున్నారు. తెలుగు పంచాంగ చక్రం ప్రతి 60 సంవత్సరాలకు ఒకసారి పునరావృతమవుతుంది. తెలుగు కాలచక్రంలోని 60 సంవత్సరాలను పండితులు మూడు భాగాలుగా విభజిస్తారు. ఈ 60 సంవత్సరాలను బ్రహ్మ, విష్ణు, శివ విభాగాలుగా చెప్పబడతాయి. ఈ విభాగాలలో పరాభవ సంవత్సరం విష్ణువుకు కేటాయించిన రెండవ విభాగంలో చివరి సంవత్సరమని పండితులు చెబుతున్నారు. కొత్త సంవత్సరం పేరు వినడానికి ప్రతికూలంగా అనిపించినప్పటికీ.. పరాభవ అనే పదాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తే.. ఓటమి కాదు.. అది మన లోపాలను గుర్తించి.. అలాంటి వాటిని జయించే మార్గాన్ని సూచిస్తుందని అంటున్నారు జ్యోతిష్య పండితులు . ప్రతి మనిషిలో కూడా ఎంతో కొంత అహంకారం ఉంటుంది. దానిని తగ్గించి...ఆత్మపరిశీలన చేసుకొని.... సత్యంగా..ధర్మంగా ఉండి ముందుకు సాగాలని సూచించే ఒక ఆధ్యాత్మిక సందేశాన్ని ఈ సంవత్సరం ప్రతిబింబిస్తుందని పండితులు చెబుతున్నారు.

## ఉగాది రోజు ఆలయదర్శనం శుభం



**వేములవాడ,మార్చి18:** తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని మార్చి 19వ తేదీ గురువారం ప్రపంచవ్యాప్తంగా తెలుగు వారంతా భక్తి శ్రద్ధలతో జరుపుకోనున్నారు. ఈ రోజు ఏం చేస్తే.. ఏడాదంతా అదే జరుగుతుందనే ఒక భావన తెలుగు ప్రజలలో బలంగా ఉంది. గతేడాది కొంత కష్టంగా ఉంది. ఈ ఏడాది అయినా బాగుంటుందా అని చాలా మంది అనుకుంటూ ఉంటారు. అలాంటి వారు ఉగాది పర్వదినం వేళ.. ఇలా చేయడం వల్ల ఏడాదంతా శుభ ఫలితాలు పొందవచ్చని పండితులు చెబుతున్నారు. ఇలా చేయడం వల్ల కష్టాలు తొలగి.. ఆనందంగా ఉండొచ్చని అంటున్నారు. కొత్త ఏడాది ఎలా ఉండబోతోంది.. గ్రహాల ప్రభావం ఏ రాశుల మీద ఎలా ఉందనేది పండితుల ద్వారా తెలుసుకోవచ్చు. ఈ పండగ రోజు.. దేవాలయానికి వెళ్లి దర్శనం చేసుకుంటే కుటుంబానికి శుభం కలుగుతుందని పండితులు చెబుతారు.ఆ రోజు పెద్దల ఆశీర్వాదం తీసుకోవాలి. అలా తీసుకోవడం వల్ల ఆయురారోగ్యాలు, విజయాలు కలుగుతాయి. ఉగాది వేళ.. మీకు తోచిన వాటిని దానం చేస్తే ఎంతో పుణ్యం కలుగుతుంది. అన్నదానం, వస్త్రదానం ఇలా ఏదైనా చేయవచ్చు. ఉగాది రోజు కొత్త పనులు ప్రారంభిస్తే మంచి ఫలితాలు సంప్రాప్తిస్తాయి. చేపట్టిన పనుల్లో అడ్డంకులు ఉండవు. కొత్త ఏడాది మంచి ఆలోచనలతో ప్రారంభించాలి. ఉగాది నుంచి ఈ ఏడాది అంతా బాగా కలిసి రావాలని మనస్సులో సంకల్పం చెప్పుకొని.. కొత్త పనులు ప్రారంభించాలి. ఉగాది రోజు గణపతి ఆలయానికి వెళ్లి గరికను సమర్పిస్తే శుభం కలుగుతుంది. ఎర్రటి పుష్పాలను సమర్పిస్తే.. శుభ ఫలితాలు కలుగుతాయి. వినాయకుడు విఘ్నాలను తొలగిస్తాడు. ఈ రోజు ఓం గం గణపతయే నమ: అంటూ సాధ్యమైనన్ని సార్లు ఈ మంత్రాన్ని స్మరణ చేసుకోవాలి. ఉగాది రోజు ఇలా చేయడం వల్ల ఏడాదంతా ఐశ్వర్యం, ఆనందం, శుభాలు

# బౌరంపేటలో ప్రభుత్వ భూమి కబ్జా.!

- ప్లాట్లు పేరిట మోసం..!
- కాళీ జాగా చూపెట్టి... విక్రయం.
- లబోదిబో అంటున్న బాధితులు.!











**కుత్బుల్లాపూర్ : మార్చి 18 (పీపుల్స్ న్యూస్)**
హైదరాబాద్ పరిసర ప్రాంతమైన కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బౌరంపేటలో ప్రభుత్వ భూములపై కబ్జాలు జరుగుతున్నాయనే ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. సర్వే నంబర్ 472లో ఉన్న కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమి అక్రమంగా ఆక్రమణకు గురైందని స్థానికులు చెబుతున్నారు. ఈ భూమిని కొందరు వ్యక్తులు తమ ఆధీనంలోకి తీసుకుని, ఖాళీ స్థలమని చూపిస్తూ ప్లాట్లుగా విక్రయిస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఒక్కో ప్లాట్‌ను సుమారు 80 గజాలుగా విభజించి లక్షల రూపాయలకు అమ్మినట్లు సమాచారం ఉంది. ప్రభుత్వ భూమిని ప్రైవేట్ స్థలమని నమ్మించి అమాయక ప్రజల నుంచి భారీగా డబ్బులు దండుకున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భూమి కొనుగోలు చేసిన తరువాత అసలు విషయం తెలిసి బాధితులు లబోదిబో అంటున్నారు. తమ కష్టార్జిత సొమ్ము పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఇప్పటికే సంబంధిత అధికారులను ఆశ్రయించినప్పటికీ, ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు తీసుకోలేదని వాపోతున్నారు. ఇదిలా ఉండగా, ప్రభుత్వ భూములపై జరు గుతున్న ఈ తరహా అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. బా ధ్యులపై కఠిన చర్యలు తీసుకుని, మోసపోయిన వారికి న్యాయం చేయాలని కోరుతున్నారు.

**దిల్ కు కేటాయించిన స్థలం పేపర్లకే పరిమితమా.?**
డెక్కన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ ల్యాండ్ హోల్డింగ్ లిమిటెడ్ (దిల్) సంస్థకు ఇటీవల ప్రభుత్వం బరంపేట లోని విలువైన ల్యాండ్లను కేటాయిం చినప్పటికీ వారు దానిని ఆధీనంలోకి తీసుకోలేకపోతున్నారు. ఎందుకంటే రెవెన్యూ అధికా రులు కేవలం క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా దిల్ సంస్థకు ల్యాండ్ కేటాయిస్తున్నట్లు పత్రాలు అందజేస్తే.. కబ్జాకు గురైన ల్యాండ్ ను కాపాడే ప్రయత్నం ఎవరు చేస్తారని దిల్ ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. బాధ్యత కలిగిన రెవెన్యూ అధికారులుగా మొదట ఆ స్థలం చుట్టూ కంచవేసి దిల్ సంస్థకు ల్యాండ్ అప్పగించాల్సిన అవసరం ఉందని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు. ఇలా విలువైన ప్రభుత్వ స్థలాలను గాలికి వదిలేయడం ద్వారా ప్రభుత్వానికి ప్రజలకు భారీ నష్టం జరుగుతుందని ప్రజలు గుర్తు చేస్తున్నారు.

# రైల్వే ప్రయాణికులకు గుడ్ న్యూస్ వందే భారత్ స్లీపర్ రైలు ట్రయల్ రన్ సక్సెస్.












ఇప్పటికే దేశ వ్యాప్తంగా వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు పట్టాలపై విజయవంతంగా, వేగంగా పరుగులు పెడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆధునీకరించబడిన వందే భారత్ స్లీపర్ ట్రైన్స్ కూడా సిద్ధమవుతున్నాయి. త్వరలో అనేక స్లీపర్ ట్రైన్స్ ఒకేసారి పట్టాలపై పరుగులు పెట్టనున్నాయి. దేశంలో సుమారు 200 వందే భారత్ స్లీపర్ రైళ్లను భారతీయ రైల్వే యోచిస్తోంది. ఇందులో ఎక్కువ వందే భారత్ రైళ్లు మధ్యప్రదేశ్‌లోని ప్రధాన మార్గాల్లో నడవనున్నాయి. ప్రస్తుతం 10 వందే భారత్ స్లీపర్ రైళ్ల ఉత్పత్తి పనులు జరుగుతున్నాయి. ఇదిలా ఉండగా.. మధ్యప్రదేశ్‌లో వందే భారత్ స్లీపర్ ట్రైన్ ఫీల్డ్ ట్రయల్ రన్ నిర్వహించారు. దీన్ని యుపి నుంచి ఎంపి వరకు రెండు రోజుల పాటు నడిపారు. దీన్ని మధ్యప్రదేశ్‌లోని కజురహో నుంచి ఉత్తరప్రదేశ్‌లోని మహోబా రైల్వేస్టేషన్ వరకు నడిపారు. ఝాన్సీ రైల్వే బోర్డ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ మనోజ్‌కుమార్ సింగ్ తెలిపిన వివరాల మేరకు.. ఈ వందే భారత్ స్లీపర్ ట్రైన్ శుక్రవారం మహోబాకు చేరుకుంది. మొదటి ఫీల్డ్ ట్రయల్ రన్‌లో భాగంగా రైలు వేగం నుంచి మెకానికల్, టెక్నికల్ అంశాలన్నింటినీ పూర్తిగా పరిశీలించారు. అంతేకాదు ఈ ట్రైన్లో "కవచ్ రక్షణ వ్యవస్థ" కూడా పరీక్షించబడింది. ఈ స్లీపర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో ాా=ణూతో పాటు, రైల్వే, టెక్నికల్ టీమ్, ×జఖీ చెన్నై టీమ్ కూడా రైలులో ఉన్నారుఝాన్సీ రైల్వే బోర్డ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ మనోజ్‌కుమార్ సింగ్ తెలిపిన వివరాల మేరకు.. ఈ వందే భారత్ స్లీపర్ ట్రైన్ శుక్రవారం మహోబాకు చేరుకుంది. మొదటి ఫీల్డ్ ట్రయల్ రన్‌లో భాగంగా రైలు వేగం నుంచి మెకానికల్, టెక్నికల్ అంశాలన్నింటినీ "కవచ్ రక్షణ వ్యవస్థ" కూడా పరీక్షించబడింది. ఈ స్లీపర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో ాా=ణూతో పాటు, రైల్వే, టెక్నికల్ టీమ్, ×జఖీ చెన్నై టీమ్ కూడా రైలులో ఉన్నారుఇప్పటివరకు అందిన సమాచారం మేరకు, వందే భారత్ స్లీపర్ ట్రైన్లో మొత్తం 16 కోచ్‌లు ఉంటాయి. వీటిలో 10 బోగీలు థర్డ్ ఏసీ, సెకండ్ ఏసీ 4 కోచ్‌లు, ఫస్ట్ ఏసీకి ఒక కోచ్ కేటాయించనున్నారు. వీటితో పాటు 2 సీటింగ్ కమ్ లగేజ్ కోచెస్ కూడా ఉంటాయి. ఈ వందే భారత్ స్లీపర్ రైలు తొలి దశలో గంటలకు 130 కిలోమీటర్ల వేగంతో పట్టాలపై పరుగులు పెట్టనుంది. అనంతరం క్రమం ఈ రైలు వేగాన్ని పెంచేలా ప్లాన్ చేస్తున్నట్లు నివేదికల ద్వారా తెలుస్తోంది. ఈ రైలు గరిష్ట వేగం 160 నుంచి 220 కిలోమీటర్ల వరకు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. వందే భారత్ స్లీపర్ రైలు పట్టాలపై పరుగులు పెట్టకముందే బుల్లెట్ రైలు గురించి ఓ అప్డేట్ వచ్చింది. ఈ ప్రాజెక్టు కూడా ఢిల్లీ-ముంబై నుంచే ప్రారంభం కానున్నట్లు సమాచారం. 'మేక్ ఇన్ ఇండియ ా'లో భాగంగా ఇప్పటికే స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణం దాదాపు పూర్తయ్యింది. గుజరాత్ రాష్ట్రంలోని వడోదర సమీపంలో ఢిల్లీ-ముంబై జాతీయ ఎక్స్ ప్రెస్ హైవేపై ఈ వంతెనను నిర్మించారు.

# అతడు కళ్లు తెరిచేసరికి లోకం మారిపోయింది! ఇంతకీ ఏం జరిగింది



ఈ రోజు ఉదయం కళ్లు తెరవగానే.. ఏదో కొత్త ప్రపంచంలోకి వెళ్లిపోయా. నా ఇల్లు మొత్తం మారిపోయింది. నేను వేరే లోకంలో ఉన్నట్లు అనిపించింది. నాలో ఏదో తెలియని ఆనందం. జువీ×ల మెసేజ్ చూసుకోడానికి నా చేతిలో ఫోన్ లేదు. అంటే, నేను ఫోన్లు లేని ప్రపంచంలో ఉన్నట్లు అర్థమైంది. ఇక నేను , అద్దెలు కట్టక్కర్లేదని చాలా సంతోషించా. జీవితం ఇంత అందంగా ఉంటుందా అనిపించింది. నిన్నటివరకు అనుభవించిన కష్టాలు కాసేపు త్రీడీలో కనిపించాయి. కానీ, వాటిని మళ్లీ చూడాలని అనుకోలేదు. త్రీడీ గ్లాస్ పక్కన పెట్టి.. వేడి వేడి టీ తాగా. పేపరు చూస్తే.. కిలో ఉల్లి ధర రూ.2 అని ఉంది. విదేశాల నుంచి వెనక్కి తెచ్చిన నల్లధనంతో ఇండియాలో పేదరికం పోయిందనే వార్త చదివి.. జై నమో అనుకున్నా.ఇంతలో బోరున వర్షం.. ముఖం మీద నీళ్లు కుమ్మరించిన అనుభూతి. కళ్ల ముందు అందమైన అమ్మాయి కోపంగా చూస్తోంది. ఆమెను చూడగానే.. అర్థమైంది. ఆమె నా అర్ధాంగి అని, ఇప్పటివరకు తాను కలల లోకంలో ఉన్నానని. ఇల్లూ మారలేదు, ఇల్లాలు మారలేదు. పిల్లలు కూడా అలాగే ఉన్నారు. అదేంటీ.. రాత్రి కేక్ కూడా కట్ చేశానే, మా పొరిగింటి వాళ్లు భూమి దద్దరిల్లేలా పటాసులు కూడా పేల్చారే. మా ఫ్రెండ్సయితే.. కరువొచ్చినట్లు బీర్లు తాగేస్తుంటే, రేపటి నుంచి స్టాకు ఉండదేమో, ప్రపంచమంతా మారిపోతుందని అనుకున్నా. కానీ, అంతా అలాగే ఉందేంటి అనుకున్నా. ఈ విషయం మా ఆవిడకు చెప్పా. నా వెటకారానికి ఒళ్లు మండిందో ఏమో.. ఆమె చేతిలో ఉన్న చన్నీళ్లు వేడెక్కి పొగలుగక్కాయి.

మొత్తానికి నిద్రలేచా.. తెల్లవారుజామున కలలు నిజమవుతాయనే సంతోషం నా ముఖంలో అలాగే ఉంది. ఇంతలో నా ఫోన్ రింగైంది. నేను హాయ్ చెప్పేలోపే పెద్ద గొంతు బిగ్గరగా వినిపించింది. ' హ్యాపీ న్యూ ఇయర్ ' అని అవతలి వ్యక్తి నుంచి అరుపు. చెవిలో తుప్పు వదిలింది. ఇయర్ ఇప్పుడే కదా ఏమిటా అని రోజు నుంచి నేటి వరకు నా మదిలో ఇదే సందేహం. దేవుడి దయవల్ల నెలలను నెంబర్లలో చెప్పలేదు. 12 వరకు వచ్చి మళ్లీ రిపీట్ అవుతాయి. లేకపోతే.. 'హ్యాపీ న్యూ మంత్' అంటూ ప్రతి నెల 31న జనాలు పీపాల్లా తాగి పడిపోయేవారు అనుకున్నా. లిఫ్టులో దెయ్యం? నిఘా కెమేరాలో యువతి ఆఖరి క్షణాలు, మరణానికి ముందు వింత చేష్టలుకానీ, ఇప్పటికీ కొత్త సంవత్సరం రాగానే ఏదో అద్భుతం జరుగుతుందనే ఆశ అలాగే ఉంది. అంతా ఇంతగా సెలబ్రేట్ చేసుకుంటున్నారంటే.. ఏదో విషయం ఉండే ఉంటాదనిపించింది. కానీ, ప్రతిసారి నాకు తెలిసేది ఒక్కటే.. కొత్త ఏడాది అంటే, మారేది తేదీ మాత్రమే.. జీవితం కాదు అని. ఇలా ఏవేవో.. రకరకాల ఆలోచనలు మైండ్ బ్లాక్ చేస్తుంటే. నా మొబైల్ 'టింగ్' అంది. బ్యాంకు నుంచి మెసేజ్. "నూతన సంవత్సర శుభాకాంక్షలు.. ఈ నెల 7వ తేదీన సైకిల్ లోనుకు ఈఎంఐ కట్టాలి. తగిన నగదును మీ అకౌంట్లో ఉంచండి" అంటూ. ఈ కుర్చీ చంపేస్తుంది.. 200 ఏళ్లలో ఎన్నో మరణాలు, 'డెత్ ఛైర్' వెనుక థ్రిల్లింగ్ హిస్టరీ!ఆ తర్వాత మొబైల్ డాటా ఆన్ చేసి వాట్సాప్ తెరిచా.. సునామీలా శుభాకాంక్షల వెల్లువ. ప్రతి ఒక్కరు, నేను.. నా కుటుంబం బాగుండాలని కోరుతూ శుభాకాంక్షలు చెప్పారు. అప్పుడు అనిపించింది. కొత్త ఏడాది జీవితాలను మార్చకపోవచ్చు. కానీ, నీ మంచిని కొరుకొనేవారు.. ఆ ఏడాది మొత్తం శుభం జరగాలని ఆకాంక్షిస్తూ ఇచ్చే సందేశం ఆత్మవిశ్వాసం పెంచుతుందని, కొత్త ఆశలు చిగురింపజేస్తుందని. సంతోషాన్ని పంచుకోడానికి ఏదైనా ఒక రోజు ఉంటే బాగుంటుందనే ఉద్దేశంతో.. ఈ న్యూ ఇయర్ కనిపెట్టి ఉండవచ్చు అనిపించింది. ఈ విషయం తెలుసుకోడానికి నాకు ఇంత టైమ్ పట్టింది. అందరికీ కాస్త ఆలస్యంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు."

# లిఫ్టులో దెయ్యం నిఘా కెమేరాలో యువతి ఆఖరి క్షణాలు, మరణానికి ముందు వింత చేష్టలు



యువతి హోటల్‌లో రూమ్ తీసుకుని ఉంటోంది. అకస్మాత్తుగా ఆమె కనిపించకుండా పోయింది. వారం రోజులవుతున్నా ఆమె ఆచూకీ తెలియలేదు. ఆమె తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఆ హోటల్‌లో సోదాలు చేసిన పోలీసులకు ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె ఆ హోటల్‌కు వచ్చిన రోజు సీసీటీవీ కెమేరాల్లో రికార్డైన వీడియోలను పరిశీలి చారు. ఆమె కనిపించకుండా పోయిన రోజు చివరిగా లిఫ్టులో కనిపించింది. ఆమె ఎవరినో చూసి లిఫ్టులోకి వచ్చి దాక్కుంది. లిఫ్టులోని అన్ని ఫ్లోర్ బటన్లు నొక్కింది. మధ్య మధ్యలో భయంగా బయటకు చూసింది. తన ఎదుట ఎవరో ఉన్నట్లుగా ప్రవర్తించింది. చివరికి అదే హోటల్ వాటర్ ట్యాంకులో శవమై తేలింది. ఇంతకీ ఆమెను ఎవరు చంపారు? ఆమె దేన్ని చూసి భయపడింది. అసలు ఏం జరిగింది?అది 2013. కెనడా కాలేజ్‌లో చదువుతున్న 21 ఏళ్ల ఎలిసా లామ్ అనే విద్యార్థిని జనవరి 31న లాస్ ఏంజిల్స్‌లోని సెసిల్ హోటల్ (జవఏఅశ్రీ ఎశీవశ్రీ)లో రూమ్ తీసుకుంది. ఆ తర్వాత ఏమైందో ఏమో ఆమె అకస్మాత్తుగా మాయమైంది. హోటల్‌లో లిఫ్టులోని ఓ సీసీటీవీ కెమేరాను పరిశీలించిన పోలీసులకు ఆమె ఆఖరి క్షణాల్లో వింతగా ప్రవర్తించడం చూశారు. ఆమె ఎవరినో చూసి భయపడతున్నట్లుగా కనిపించింది. లిఫ్టులో అన్ని బటన్లు నొక్కడం.. బయటకు తొంగి చూడటం, లిఫ్ట నుంచి బయటకు లోపలికి రావడం వంటి పనులు చేసింది. చిత్రంగా ఆ లిఫ్ట కూడా వెంటనే మూసుకోకుండా తెరుచుకునే ఉన్నాయి. చివరికి ఆమె బయటకు వచ్చి ఎవరితోనో మాట్లాడుతున్న సమయంలో లిఫ్ట తలుపులు మూసుకున్నాయి. ఆ తరువాత ఏం జరిగిం దనేది ఎవరికీ తెలియదు. ఎలిసా లిఫ్టులోకి వెళ్లిన దృశ్యాలను ఈ కింది వీడియోలో చూడండి.ఎలిసా మిస్సయిన కొద్ది రోజుల తర్వాత హోటల్‌లో నీళ్లు కుళ్లు కంపు కొట్టడం మొదలైంది. నీటి ప్రెజర్ కూడా తగ్గింది. కస్టమర్లు కూడా దీనిపై హోటల్ సిబ్బందికి ఫిర్యాదు చేశారు. దీంతో మెయింటెనెన్స్ వర్కర్ శాంటియగో లోపెజ్ హోటల్‌పై ఉన్న నాలుగు వాటర్ ట్యాంకులను పరిశీలించాడు. అందులో ఓ ట్యాంకు మూత తెరిచి ఉండటంతో లోపల ఏముందా అని పరిశీలించాడు. అంతే.. అతడి గుండె ఆగినంత పనైంది. ఆ ట్యాంకులో ఉబ్బిపోయి భయానక స్థితిలో ఉన్న ఎలిసా నిర్జీవంగా తేలుతూ కనిపించింది. ఈ విషయం తెలియగానే హోటల్ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఆమె శవం వాటర్ ట్యాంకులో చూసిన పోలీసులు ఆశ్చర్యపోయారు. వాటిపైకి ఎక్కాలంటే ఒకరి వల్ల కాదని, మరొకరి సాయం ఉండాలని డిటెక్టివ్‌లు తెలిపారు. ఒక వేళ ఆమె ఆత్మహత్యే చేసుకోవాలంటే.. ఆ భవనం మీద నుంచి దూకి కూడా చనిపోవచ్చు. కానీ, నీటి ట్యాంకులోకే ఎందుకెళ్లిందనేది చిక్కు ప్రశ్నగా మారింది. అయితే, లిఫ్ట వీడియోలను దృష్టిలో పెట్టుకుని ఆలోచిస్తే.. ఆమెను వెంటాడుతున్న వ్యక్తికి భయపడి ఆమె నీటి ట్యాంకులోకి వెళ్లి ఉండవచ్చని భావించారు. కానీ, అలాంటి వ్యక్తులెవరూ సీసీటీవీ కెమేరాకు చిక్కలేదు. కానీ, ఆమె దేన్నో చూసి భయపడటం ఒక్కటే స్పష్టంగా తెలుస్తోంది. దీంతో కొందరు ఆమెను ఆత్మ వెంటాడి ఉండవచ్చని అంటున్నారు.ఎలిసాను ఆఖరిసారి చూసిన వ్యక్తి కాటీ ఆర్వాన్, ఆయన ఆ హోటల్ పక్కన ఉన్న బుక్ స్టోర్ యజమాని. ఆమె తన బుక్ స్టోర్‌కు రావడం చూశానని, తన ఇంట్లోవారి కోసం కొన్ని పుస్తకాలు, మ్యూజిక్ సీడీలను కొనుగోలు చేసిందని పోలీసులకు తెలిపాడు. ఈ నేపథ్యంలో ఆమె ఆత్మహత్య చేసుకోడానికి అవకాశాలైతే లేవని నిర్ణయానికి వచ్చారు. కానీ, ఆమె డిప్రషన్ కోసం మందులు వాడుతోందని, వాటి వల్ల మతిస్థిమితం కోల్పోయి ఇలా చేసి ఉంటుందా అనే కోణంలోనూ ఆలోచించారు.ఎలిసా బైపోలార్ డిజార్డర్‌తో బాధపడుతోందని, దాని నుంచి బయటపడేందుకు ఆమె కొన్ని మందులు తీసుకొనేందని పోస్టుమార్టం రిపోర్టులో పేర్కొన్నారు. చనిపోయిన రోజు ఆమె ఎలాంటి మద్యం, డ్రగ్స్ తీసుకోలేదని స్పష్టం చేశారు. దీన్ని మరింత లోతుగా అన్వేషించిన నిపుణులు.. ఆమె తన మానసిక స్థితిని కంట్రోల్‌లో ఉంచే మందును చనిపోయే రోజు తీసుకుని ఉండకపోవచ్చని, దానివల్లే ఆమె ఎవరో తనని వెంటాడుతున్నట్లు భావించి లిఫ్టులో దాక్కోడానికి ప్రయత్నించి ఉంటుందని పేర్కొన్నారు. అదేవిధంగా ఆమె హోటల్ నీటి ట్యాంకుల మీదకు ఎక్కి నీటిలోకి దూకి ఉండవచ్చని, పైకి రాలేక అందులోనే మునిగి చనిపోయి ఉండవచ్చని తెలిపారు. దీంతో లాస్ ఏంజెల్స్ కోర్టు ఇది కనీవినీ ఎరుగని కేసు అని పేర్కొంది.

# మన విద్యా ప్రయాణం దేశానికే ఆదర్శం.

**రాయదుర్గం మార్చి 18** విద్యార్థులకు అందిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నాణ్యత, రుచి, శుచిలో దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో, విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబు ఆధ్వర్యంలో రాష్ట్రంలో విద్యా ప్రయాణం ఓ మార్గదర్శకంగా కొనసాగుతుం డటం అభినందనీయమన్నారు. రాయదుర్గం పట్టణ శివారులోని 21వ వార్డు పైతోటలో భక్త కన్నప్ప మున్సిపల్ ప్రైమరీ పాఠశాల విద్యార్థులతో మధ్యాహ్న భోజన పథకంపై బుధవారం విద్యార్థులతో ఆయన ముఖాముఖి సంభాషించారు. ఈ సందర్భంగా విద్యార్థులు,పాఠశాల ఉపాధ్యాయులతో నేలపై కూర్చొని సహపంక్తి భోజనం చేశారు. భోజనంలో ప్రతిరోజు అమలవు౯న్న మెనూ గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సన్న బియ్యంతో వండిన అన్నంతో పాటు రుచికరమైన పప్పు, సాంబారు, రసము కోడిగుడ్డు ఇస్తున్నట్లు విద్యార్థులు ఆయనకు వివరించారు. పిల్లలతో పాటు తాను కలిసి భోజనం చేశానని, ఎంతో రుచిగా, నాణ్యతగా ఉందని ఎమ్మెల్యే అభినందించారు. పాఠశాలకు వస్తున్న పిల్లల్లో చాలామంది నిరుపేదకుటుంబాలకు చెందిన వారేనని ఆయన తెలియజేశారు. ఇలాంటి కుటుంబాల








నుంచి వస్తున్న పిల్లలకు బలవర్ధకమైన పౌష్టికాహారం అందించడం వల్ల చదువులో వారు శ్రద్ధగా రాణించగలుగుతారని అభిప్రాయపడ్డారు. వీరంతా సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చే దిశగా ప్రభుత్వం ఉత్తమ విద్యా విధానాన్ని కొనసాగిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి, పైతోట రామంజి, సీన, మధు, ఆంజనేయులు,సిద్దన్న తదితరులు పాల్గొన్నారు.

# బొర్రంపాలెం సర్పంచ్‌కు 'కలెక్టర్' షాక్:

**రూ. 25.94 లక్షల నిధుల స్వాహాపై కొరడా!**
**నిధుల దుర్వినియోగంపై జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి సీరియస్**
**15 రోజుల్లోగా సొమ్ము కట్టాల్సిందే.. లేదంటే కఠిన చర్యలు తప్పవు!**
**సామాజిక కార్యకర్త గుండె పాండురంగ పోరాట ఫలితం!**

**ఏలూరు జిల్లా, బొర్రంపాలెం** .ప్రజల సొమ్మును కక్కుర్తి పడి తింటే అధికారులు ఊరుకోరని ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి గారు మరోసారి నిరూపించారు. ఏలూరు జిల్లా టీ నరసాపురం మండలం బొర్రంపాలెం గ్రామ పంచాయతీలో సాగిన నిధుల అక్రమ దందాపై జిల్లా యంత్రాంగం ఉక్కుపాదం మోపింది. రూ. 25,94,268/- (అక్షరాలా పాతిక లక్షల తొంభై నాలుగు వేల పైచిలుకు) రూపాయలను నిబంధనలకు విరుద్ధంగా దుర్వినియోగం చేసిన సర్పంచ్ కె. వెంకటేశ్వరమ్మ నుండి ఆ మొత్తాన్ని తక్షణమే రికవరీ చేయాలని కలెక్టర్ సంచలన ఆదేశాలు



జారీ చేశారు.
?గతంలోనే ఈ సర్పంచ్ అక్రమాలపై విచారణ జరిపి 6 నెలల పాటు 'చెక్ పవర్' రద్దు చేస్తూ అధికారులు శిక్ష విధించారు. అయినప్పటికీ, స్వాహా చేసిన సొమ్మును రికవరీ చేయడంలో జాప్యం జరుగుతుండటంతో, బాధితుడు గుండె పాండురంగ నిరంతరం అధికారులను వెంటాడారు. ది.09-01-2026న పీజీఆర్ ఎస్ ద్వారా ఆయన చేసిన ఫిర్యాదుతో అధికార యంత్రాంగం కదిలింది. ఏపీ పంచాయతీ రాజ్ యాక్ట్-1994 ప్రకారం సర్పంచ్‌ను బాధ్యురాలిగా నిర్ధారిస్తూ కలెక్టర్ కార్యాలయం (పి.ఆర్. ఓ, సి, జి ఎస్ నెం: జు-8701/సూ8/2024) ఉత్తర్వులు వెలువరించింది.మార్చి 14న సర్పంచ్‌కు పంపిన నోటీసులో అధికారులు స్పష్టమైన గడువు విధించారు. 15 రోజుల లోపు దుర్వినియోగం చేసిన రూ. 25.94 లక్షలను తిరిగి గ్రామ పంచాయతీ ఖాతాలో జమ చేయాలని ఆదేశించారు. ఒకవేళ నిర్ణీత సమయం దాటితే, ఆ నిధుల రికవరీ కోసం మరింత కఠినమైన చర్యలు (తదుపరి చట్టపరమైన చర్యలు) తీసుకోవడం జరుగుతుందని ఎండార్స్‌మెంట్ ద్వారా అధికారులు హెచ్చరించారు.సర్పంచ్ పీఠంపై ఉండి గ్రామాభివృద్ధికి పాటుపడాల్సింది పోయి, పంచాయతీ నిధులను సొంతానికి వాడుకోవడంపై స్థానిక ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ తీసుకున్న ఈ నిర్ణయం అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెట్టిస్తోంది. తక్షణమే ఆ సొమ్మును రికవరీ చేసి, గ్రామంలో ఆగిపోయిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

# ఏలూరులో లాంఛనంగా ప్రారంభమైన దివ్యాంగ శక్తి పథకం..

**దివ్యాంగశక్తి పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బడేటి చంటి, ఆర్టీసీ జోన్ 2 ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు..**

**ఏలూరు, మార్చి 18.**
ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో సుస్థిర పాలనకు శ్రీకారం చుట్టడంతో పాటు అన్ని వర్గాల వారికి ప్రయోజనాలు కలిగించే ఎన్నో పథకాలు అమలు చేస్తున్న ప్రజా ప్రభుత్వమని ప్రజల మన్ననలు పొందుతోందని ఏలూరు ఎమ్మెల్యే, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బడేటి చంటి పేర్కొన్నారు. దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం బుధవారం నుంచి అమల్లోకి వచ్చింది. ఏలూరు పాత బస్టాండ్ లో దివ్యాంగశక్తి పథకాన్ని ప్రారంభించిన ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, ఆర్టీసీ విజయవాడ జోన్ 2 ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు దివ్యాంగ ప్రయాణికులకు తొలి ఉచిత బస్ టికెట్లు అందజేసి వారితో కలిసి బస్సులో కొంత దూరం ప్రయాణించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దివ్యాంగులకు అందుతున్న సంక్షేమ పథకాలు, వారి బాగోగులు గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదేళ్ల వైసిపి విధ్వంస పాలన నుంచి కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో వికాసం వైపు ఆంధ్రప్రదేశ్ అడుగులు వేస్తోందని చెప్పారు. ఇచ్చిన హామీ మేరకు ఒక్కొక్క దాన్ని అమలు చేస్తూ అన్ని వర్గాల వారికి బహుళ ప్రయోజనాలు చేకూరేలా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువ మంత్రి నారా లోకేష్ అహర్నిశలు కృషి చేస్తున్నారని చెప్పారు. దీనిలో భాగంగానే ఉగాది కానుకగా దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కూటమి ప్రభుత్వం



కల్పించిందని చెప్పారు. దివ్యాంగుల సంక్షేమానికి 7 సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వటం జరిగిందని, ఇప్పటికే ఆరు సమస్యలను పరిష్కరించి, ఇప్పుడు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం ద్వారా మిగిలిన ఆ ఒక్క సమస్యను కూడా పరిష్కరించినట్లు ఎమ్మెల్యే బడేటి చంటి పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని, వాటిని గాడిలో పెట్టేందుకు ప్రభుత్వాధినేత లు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ప్రజలు అన్ని విషయాలను అర్థం చేసుకుని కూటమి ప్రభుత్వానికి మరింత మద్దతు పలకాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే బడేటి చంటి అభిప్రాయపడ్డారు.ఆర్టీసీ విజయవాడ జోన్ 2 ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించిన కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు కూడా ఆ సౌకర్యాన్ని వర్తింపజేస్తూ నిర్ణయం తీసుకుందని చెప్పారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ పథకం దివ్యాంగుల జీవితాల్లో మార్పు తీసుకువస్తుందని, దివ్యాంగశక్తి పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 11 లక్షల మంది దివ్యాంగులకు ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధి సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ సుపరిపాలన అందిస్తుందని,



వాటిలో భాగంగానే దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు దివ్యాంగ శక్తి కార్యక్రమాన్ని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా ప్రారంభించడం జరుగుతుంది. దీని ద్వారా దివ్యాంగుల సంక్షేమానికి వారిగా ఆత్మస్థైర్యాన్ని మరింత పెంపొందించడానికి కూటమి ప్రభుత్వం ఎంతగానో దోహదపడుతుందన్నారు. 40% అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్న దివ్యాంగులు ఏపీఎస్ఆర్టీసీకి చెందిన పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సుల్లో ఈరోజు నుంచి ఉచితంగా ప్రయాణించవచ్చని అలాగే ఈ పథకం ద్వారా దివ్యాంగులతో పాటు వచ్చే సహాయకులకు టికెట్ ధరలో 50% రాయితీ లభిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఈ యు డి ఏ ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్,ఏఎంసీ ఛైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి, కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, ఎస్ఎంఆర్ పెదబాబు, జనసేన పార్టీ నగర అధ్యక్షులు వీరంకి పండు, నాయకులు రెడ్డి గౌరీ శంకర్, సరిది రాజేష్, బెజవాడ నాగభూషణం కుమార్, బోండా రాము నాయుడు, ఎట్రించి ధర్మేంద్ర మరియు వివిధ హోదాలలో ఉన్న కూటమి పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు , ఏలూరు ఆర్టీసీ డిపో మేనేజర్ వాణి, ఆర్టీసీ ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగ శక్తి పథకానికి నేడే శ్రీకారం చుట్టిన కూటమి ప్రభుత్వం:కైకలూరు ఎం.ఎల్. ఏ . కామినేని శ్రీనివాస్.

**కైకలూరు, మార్చి 17.** కూటమి ప్రభుత్వం దివ్యాంగుల కొరకు ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన దివ్యాంగ శక్తి పథకాన్ని కైకలూరులో ట్రావెలర్స్ బంగ్లా నందు దివ్యాంగుల ఉచిత బస్సు ప్రయాణం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన గవర్నమెంట్ అస్యూరెన్స్ కమిటీ ఛైర్మన్ కైకలూరు శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్ . ఈ సందర్భంగా కామినేని గారు మాట్లాడుతు మరొక్కసారి సమాజంపై నిబద్దత చూపిన కూటమి ప్రభుత్వం. దివ్యాంగులకు ఆర్థిక భారం తగ్గించే విధంగా వారికీ ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం అందిస్తున్నామని తెలిపారు. 40% అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్న దివ్యాంగులు ఏపీ ఎస్ఆర్ టి సి పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని అలాగే ఈ పథకం ద్వారా దివ్యాంగులతో పాటు వచ్చే సహాయకులకు టికెట్ ధరలో 50% రాయితీ లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ డి ఏ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.ఈరోజు కూటమి ప్రభుత్వం దివ్యాంగుల కొరకు



ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన దివ్యాంగ శక్తి పథకాన్ని కైకలూరులో ట్రావెలర్స్ బంగ్లా నందు దివ్యాంగుల ఉచిత బస్సు ప్రయాణం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన గవర్నమెంట్ అస్యూరెన్స్ కమిటీ ఛైర్మన్ కైకలూరు శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్. ఈ సందర్భంగా కామినేని గారు మాట్లాడుతు మరొక్కసారి సమాజంపై నిబద్దత చూపిన కూటమి ప్రభుత్వం.



దివ్యాంగులకు ఆర్థిక భారం తగ్గించే విధంగా వారికీ ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం అందిస్తున్నామని తెలిపారు. 40% అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్న దివ్యాంగులు ఏపీ ఎస్ ఆర్,టి సి పల్లె వెలుగు ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని అలాగే ఈ పథకం ద్వారా దివ్యాంగులతో పాటు వచ్చే సహాయకులకు టికెట్ ధరలో 50% రాయితీ లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ డి ఏ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పలువురికి నివాళులర్పించిన జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు





**ఎన్టీఆర్ జిల్లా మార్చి 18** జగ్గయ్యపేట పట్టణం 30 వార్డుకు చెందిన న్యాయవాది ఆలేటి కిషోర్ భార్య రమాదేవి ఆకస్మిక మరణాన్ని చింతిస్తూ ఈ రోజు వారి నివాసానికి వెళ్లి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు జగ్గయ్యపేట పట్టణం ప్రభుత్వ ఆసుపత్రి నందు వత్సవాయి మండలం మక్కపేట గ్రామానికి చెందిన మామిడాల సైదులు ప్రమాదవశాత్తు మరణించిన విషయాన్ని తెలుసుకొని భౌతిక దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు వారితోపాటు పట్టణ పార్టీ అధ్యక్షులు పఠాన్ ఫిరోజ్ ఖాన్, నియోజకవర్గ రైతు విభాగ అధ్యక్షులు కనగాల రమేష్, మండల రైతు విభాగ అధ్యక్షులు గూడపాటి శేషగిరిరావు, 30 వార్డు అధ్యక్షులు దార్ల ప్రసన్నకుమార్, వీరమాచినేని సతీష్ తదితరులు నివాళులర్పించారు


# రీ సర్వే లోపాలను సర్దుబాటు చేయండి

**రాయదుర్గం మార్చ్ 18**కళ్యాణదుర్గం డివిజన్ భూముల రీ సర్వే లో జరిగిన లోపాలను సరిదిద్ది రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేయుచున్నాను. అలాగే డివిజన్ పరిధిలోని భూముల రీ సర్వే జరిగిన రెవెన్యూ గ్రామములో సాంకేతిక లోపాల కారణంగా సావీ నంబర్లు జాయింట్ ఖాతాలుగా నమోదు అయ్యాయని సమస్యాత్మక రెవెన్యూ గ్రామామలో సావీ నంబర్లను సబ్ డివిజన్ చేసి రైతులకు రాజముద్ర కలిగిన పాసు పుస్తకాలు



అందజేయాలి.ప్రజలకు గ్యాస్ పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకత పాటించాలని రోజు లారీలలో వచ్చిన కొత్త సిలెండర్లు ఎన్ని క్లోసింగ్ బాలన్స్ ఎంత ఉంది? ఎంత మంది వినియోగదారులకు సరఫరా చేసినారు? అనే అంశాలపై ఆరా తీయాలని గ్యాస్ యాజమాన్యాలు ప్రస్తుత పరిస్తితులకు అనుగుణంగా ప్రజలకు ఎటువంటి అసౌకర్యము కలగకుండా పంపణీ చేయాలని కోరినారు. అలాగే వినియోగదారులకు గ్యాస్ సరఫరా గురించి ఏమైనా ఇబ్బందులు ఎదురైతే టోల్ ఫ్రీ నంబర్లను ఏర్పాటు చేయాలని౼ూూ జిల్లా కొన్వీనర్ బి. వెంకటరమణ (బాబు) కళ్యాణదుర్గం =ఙూ గారిని కోరారు.

# జంగారెడ్డిగూడెంలో ఘనంగా అన్న ప్రసాద వితరణ.




**జంగారెడ్డిగూడెం:**ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం స్థానిక హైస్కూల్ వద్ద వేంచేసియున్న శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి సన్నిధిలో బుధవారం భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. శ్రీ వరసిద్ధి వినాయక నిస్వార్థ స్వచ్ఛంద సేవా అన్న ప్రసాద వితరణ కమిటీ ఆధ్వర్యంలో సుమారు 2000 మంది భక్తులకు స్వామివారి ప్రసాదాన్ని పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి దనిశెట్టి ధనరాజు, కళావతి దంపతుల కుమార్తె సుబ్బలక్ష్మి ఆర్థిక సహకారం అందించారు. బుద్దన రఘు, మహేష్ దంపతులు కూరగాయలను సమకూర్చగా, బయనేరు నవగ్రహ దేవతల ఆలయ ఛైర్మన్ దంపతులు మరియు వాసా వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు బియ్యాన్ని విరాళంగా ఇచ్చారు. గ్రాండ్ కృష్ణ హోటల్ యాజమాన్యం, పానీపూరి విక్రేతలు కూడా తమ వంతు సహకారాన్ని అందించారు.కమిటీ సభ్యులు కానూరి గంగాధరరావు, శ్రీధరాల శ్రీనివాస్, చల్ల వరప్రసాద్, కోటగిరి లక్ష్మీ ప్రసన్న, అచ్చారావు, సాలా శ్రీనివాస్, దుగ్గిరాల సుబ్బలక్ష్మి తదితర స్వచ్ఛంద సేవకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## శ్రీరామ్ విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు నవోదయ ప్రవేశ పరీక్షలో ఉత్తమ ఫలితాలు







**పిఠాపురం** నియోజవర్గం గొల్లప్రోలు శ్రీరామ్ విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు నవోదయ ప్రవేశ పరీక్షలో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు అభినందనలు తెలిపిన స్కూల్ యాజమాన్యం. నవోదయ ప్రవేశ పరీక్షలలో ఉత్తినపు సాధించిన విద్యార్థులు బి.సుందరి నాగలక్ష్మి స్టేట్ ర్యాంక్ 566, పి.త్రినాథ స్టేట్ ర్యాంక్ 627, ఎం ఏకాశ్ స్టేట్ ర్యాంక్ 371సాధించారు అని స్కూల్ యాజమాన్యం తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఆటల పట్ల విద్య పట్ల సరైన నడవడిక కలిగి ఉండడం చాలా అవసరమని ఏదైనా సాధించాలంటే ఓర్పు కలిగి ఉండాలని, పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ మరియు సిబ్బంది హృదయపూర్వక అభినందనలు తెలియజేసారు.వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆశిస్తున్నాము అని అన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీరామ్ విద్యానికేతన్,స్కూల్ యాజమాన్యం ఉపాధ్యాయులు విద్యార్థులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# ట్రంపోన్మాదం

మతి భ్రమించిన డేంజరస్ డొనాల్డ్
ట్రంప్ మెదడుకు పట్టిన చెదలు
రక్తదాహం తీరని నేతన్యాహూ
చచ్చేదాకా చంపుతానని ఖమేనీలు !

నాలుక కరుచుకుంటున్న అమెరికా
ఇరకాటంలో పడిన ఇజ్రాయిల్
తెగింపు ధోరణిలో పర్షియన్ ఇరాన్ !

అగ్ని గుండంగా మారింది టెహరాన్
వాషింగ్టన్ గుండె దడ పెరిగింది
మంటల్లో మాడిపోతోంది జెరూసలెం !

నేలకూలుతున్న యూఎస్ సైనిక స్థావరాలు
అగ్నికి ఆహుతి ఇరాన్ చమురు కేంద్రాలు
ఉన్నాడో లేడో తెలియని నేతన్యాహూ ప్రాణాలు

!ప్రపంచాన్ని కుదిపేస్తున్న త్రిదేశాల కయ్యం
ట్రంప్-నేతన్యాహూ-మొజ్తాబా త్రయానికి..
అయ్యింది ముందు నుయ్యి వెనక గొయ్యి..
వంటింటికి తాకాయి యుద్ధ మంటల సెగలు !

ట్రంప్‌కు ఇవ్వాలి రెండు నోబెల్ ప్రైజ్‌లు
నిన్న యుద్ధాగ్ని రాజేసినందుకు..
ఇవ్వాలి ప్రపంచ 'అశాంతి' బహుమతి
రేపు ముగింపుకు ప్రపంచ 'శాంతి' బహుమతి !

ఎన్నటికైనా తథ్యమే కదా గెలుపోటములు
ఇరుపక్షాలకు ఖాయం కదా భారీ నష్టాలు
యుద్ధంతో విశ్వ మానవాళికి చమురు వాతలు
శాంతి స్థాపన వైపు పడాలి పటిష్ఠ అడుగులు !

మధుపాళీ

## బొమ్మ వెంకన్న గారు మహా నాయకుడు కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ గారు మాట్లాడుతూ




మున్నూరు కాపు ముద్దుబిడ్డ, మాజీ శాసనసభ సభ్యులు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మాజీ ప్రధాన కార్యదర్శి స్వర్గీయ బొమ్మ వెంకటేశ్వర్ గారి 7 వ వర్ధంతి సందర్భంగా బుధవారం బొమ్మకల్ లోని మున్నూరు కాపు వసతి గృహంలో స్వర్గీయ బొమ్మ వెంకటేశ్వర్ విగ్రహానికి ఘన నివాళులు అర్పించారు ఈ సందర్భంగా అంజన్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఈ జిల్లాకు ఈ రాష్ట్రానికి ఎనలేని సేవ చేస్తూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు తెలంగాణ రాష్ట్రంలో రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి ప్రజా శ్రేయస్సు కొరకు పాటుపడిన మహా నాయకుడు బొమ్మ వెంకన్నని అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మధు ఇమ్రాన్ ఆసిఫ్ దేవేందర్ శేఖర్ తదితర నాయకులు పాల్గొని ఘన నివాళులు అర్పించారు

# గ్రామాల సమగ్ర అభివృద్ధి మా లక్ష్యం

**- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**- క్యాసారం గ్రామంలో 10 లక్షల రూపాయల విలువైన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన**




**పటాన్ చెరు** నియోజకవర్గం పరిధిలోని గ్రామాల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్ చెరు మండలం క్యాసారం గ్రామంలో 10 లక్షల రూపాయల ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అందించే నిధులతో పాటు పరిశ్రమల భాగస్వామ్యంతో శరవేగంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. రాబోయే వేసవికాలం దృష్టిలో ఉంచుకొని మంచినీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంగీత, పంచాయతీరాజ్ డిఈ సురేష్, సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి, దశరథ్ రెడ్డి, ప్రభాకర్, గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

## ఎన్ఈసీసీ ఎగ్ కార్ట్ (ఈజీజీసీఆర్ టీ) పథకం కింద లబ్ధిదారులకు కార్టుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)





**. ఎన్టీఆర్ జిల్లా మార్చి 18** జగ్గయ్యపేట పట్టణం లోని న పేద మరియు నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించే ఉద్దేశంతో అమలు చేస్తున్న ఎన్ ఈసీసీ ఎగ్ కార్ట్ పథకం కింద లబ్ధిదారులకు కార్టుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించ బడింది. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) హాజరై లబ్ధిదారులకు ఎగ్ కార్టులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాట్లాడుతూస్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు.ఈ పథకం ద్వారా ప్రతి లబ్ధిదారుకు రూ.50,000 విలువైన సహాయం అందించబడుతుందని, ఇందులో రూ.35,000 సబ్సిడీగా, రూ.15,000 లబ్ధిదారుల వంతుగా ఉంటుందని తెలిపారు. అలాగే ఈ పథకం ద్వారా నిరుద్యోగ యువతకు స్థిరమైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కమిషనర్ తులసి కృష్ణారావు మరియు కౌన్సిలర్లు అధికారులు, ఎస్ హెచ్ జీ. సభ్యులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# తెలుగు నూతన సంవత్సర పర్వదినం - శ్రీ పరాభవ ఉగాది

**(19 మార్చి "విశ్వావసు ఉగాది పర్వదినం" సందర్భంగా)**

ఉగాది లేదా యుగాది అనబడే చంద్ర సౌర క్యాలండర్ లేదా పంచాంగం ప్రకారం దక్షిణ భారత తెలుగు రాష్ట్రాలు, కర్నాటక ప్రజలు ఘనంగా నిర్వహించుకునే నూతన సంవత్సర తొలి రోజు వేడుక. 'యుగ' అనగా 'యుగం' అని, 'ఆది' అనగా 'ప్రారంభ' లేదా 'తొలి' రోజు అని అర్థం. పంచాంగం వివరాల ప్రకారం 60 సంవత్సరాల క్యాలెండర్ లేదా సాకా సంవత్ ప్రకారం, గ్రెగోరియన్ క్యాలెండర్ ప్రకారం తేదీ 19 మార్చి 2026 రోజున శ్రీ పరాభవ నామ నూతన సంవత్సరం ప్రారంభం అవుతున్నది. చైత్ర శుక్ల పాడ్యమి శుభ గడియల్లో తెలుగు సంవత్సరాదిగా ఉగాది పర్వదినాన్ని జరుపుకోవడం ప్రతి ఏటా అనవాయితీగా వస్తున్నది.

ఉగాది పర్వదినాన పరమార్థం:

ప్రతి ఏట మార్చి లేదా ఏప్రిల్ నెలల్లో ఈ పండుగ వస్తుంది. 12వ శతాబ్దపు గణితశాస్త్రవేత్త భాస్కరాచార్య ప్రారంభించిన ఉగాది పండుగను కృష్ణావతార సమాప్తి తర్వాత నిర్వహించడం విశేషం. పురాణాల ప్రకారం రాముడు వనవాసం పూర్తి చేసి అయోధ్యకు వచ్చిన శుభ గడియలను ఉగాదిగా భావిస్తారు. విశ్వాన్ని బ్రహ్మ సృష్టించిన తొలి రోజుగా కూడా ఉగాదిని పరిగణిస్తారు.

భారతంలో పలు పేర్లతో యుగాది:

ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల్లో ఉగాది పండుగ జరుపుకుంటూ ఉండగా మహారాష్ట్రలో గుడి పడ్వా, తమిళనాడులో పతండు, అస్సాంలో బిహూ, పంజాబ్‌లో బైసాఖీ, రాజస్థాన్‌లో తపన, మణిపూర్‌లో సాహిబ్ నోంగ్మా పంబ, పశ్చిమ బెంగాల్లో నబ వర్షా, సింధు సమాజంలో చెట్టీ ఛాంద్? పేర్లతో ఉగాదిని జరుపుకోవడం మన భారతీయ సాంప్రదాయం. ఆధ్యాత్మిక, సాంస్కృతిక, వ్యవసాయ సీజన్ ప్రత్యేకతగా ఉగాది పర్వదినం జరుపుకుంటున్నాం. ఆనందం, సంపదలు, సమన్వయ సమాజ వేడుకగా ఉగాదికి గుర్తింపు ఉన్నది.

షడ్రుచుల ఉగాది పచ్చడి పరమార్థం:

ఉగాదితో మొదలై నవరాత్రుల పాటు దుర్గా మాతను పూజించే సంస్కృతి కూడా ఉన్నది. ఈ పర్వదినం రోజున తార మర్ధనంతో స్నానాలు చేసి, తీపి చేదుల కలయికగా షడ్రుచుల ఉగాది పచ్చడి (వేప పువ్వు, మామిడి ముక్కలు, చింతపండు, బెల్లం లేదా చక్కెర, కారం లేదా పచ్చి మిరపకాయ, ఉప్పు)ని తీర్థప్రసాదాల వలె భావిస్తూ తీసుకొని జీవితంలో కష్టసుఖాలను పంచుకునే ధైర్యాన్ని పోగుచేసుకొని, మందిరాల్లో పూజలు చేసి, ఊరు వాడ సంబరాలు చేసుకొని, భక్షాలు లేదా బొబ్బట్లు లాంటి రుచికరమైన పిండి వంటలతో సరదాగా, భక్తి భావనలతో పంచాంగ శ్రవణాలకు హాజరై తమ రాశీ ఫలాలను తెలుసుకోవడం ఆచారంగా వస్తున్నది.

ఆరు రుచుల ఉగాది పచ్చడి జీవిత పరమార్థాన్ని వివరిస్తుంది. కష్టాల్లో కుంగడం, సుఖాల్లో పొంగడం సరియైన జీవన విధానం కాదని ఉగాది పర్వదినం బోధిస్తున్నది. ఆశావహ దృక్పథ సుగుణం, పరస్పర సహకార భావన, ఐక్యత, వివేకవంతమైన జీవనశైలిని అలవాటు చేసుకొని పౌర సమాజం శాంతి సౌభాగ్యాలతో ముందుకు సాగాలని కోరుకుందాం. శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలను తెలియజేద్దాం.

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

# ఆధునిక వ్యవసాయంతో ప్రజారోగ్య, పర్యావరణ సంక్షోభం

1965లో ఆధునిక హరిత విప్లవ పితామహుడు ఎం. ఎస్. స్వామినాథన్ నేతృత్వంలో ప్రవేశ పట్టిన గ్రీన్ రెవొల్యూషన్ ఫలితాలతో ఆహార ఉత్పత్తులు పెరగడం, ఆహార భద్రత సుసాధ్యం కావడం చూసాం. ఆధునిక సాగు పద్దతుల్లో అధిక దిగుబడులుచ్చే జన్యు మార్పులతో కూడిన హైబ్రిడ్ పంటలు పండించడం, రసాయన ఎరువులను విరివిగా వాడడం, క్రిమి కీటకనాశనులను విచక్షణారహితంగా ప్రయోగించడం, అత్యాధునిక వ్యవసాయ పరిశోధనల/సాంకేతిక ఫలాలను అమలు చేయడం, యాంత్రీకరణ వాడుకలోకి రావడం లాంటి మార్పులతో ఆహార కొరతను అధిగమిస్తూ మిగులు దిగుబడుల స్థాయికి చేరడం జరిగింది. వ్యవసాయం దండగ కాదు పండగ అనే స్థాయికి దిగుబడులు రావడంతో రైతుల ఆత్మహత్యలు కూడా గణనీయంగా తగ్గడం గమనించాం.

ఆధునిక వ్యవసాయ దుష్ప్రభావాలు:

ఆధునిక వ్యవసాయరంగంలో పంటల దిగుబడులు, పశుగ్రాస ఉత్పత్తి,మాంస ఉత్పత్తి, పౌల్ట్రీ పరిశ్రమ,పాడి పరిశ్రమ, ప్రాసెసింగ్ లాంటి ప్రధాన విభాగాలు వస్తాయి. నేడు అధిక దిగుబడుల వేటలో రైతులు విచక్షణారహితంగా రసాయన ఎరువులు నేలలో కుమ్మరించడం, పంట చేనుపై అపరిమితంగా క్రిమి సంహారక మందులు పిచికారి చేయడం ఫలితంగా దిగుబడులు కొంత పెరిగినా ప్రజారోగ్యానికి, పర్యావరణానికి తీవ్రమైన విఘాతం కలుగుతున్నది. అత్యాధునిక సాగు పద్దతుల ను పాటించడంతో మట్టి మర్యాద మంటగలవడం, జీవ వైవిధ్యానికి తూట్లు పడడం,అత్యధిక పోషకాలతో యూట్రోఫికేషన్ సమస్యలు చిగురించడం, సారవంతమైన నేల పై పొర కొట్టుకుపోవడం, పర్యావరణ కాలుష్యానికి రెక్కలు రావడం, పంట దిగుబడిలో పోషక విలువలు తగ్గడం, ఆహార ధాన్యాలు కలుషితం కావడం, వాతావరణ ప్రతికూల మార్పులు చోటు చేసుకోవడం, ప్రజారోగ్యం ప్రశ్నార్థకంగా మారడం, ఆంటీ-రెసిస్టెంట్ బ్యాక్టీరియా పెరగడం లాంటి పలు అనర్థాలకు దారి తీస్తున్నాయి. పెస్టిసైడ్స్ వాడకంతో క్రిమికీటకాలుపట్ట నాశనం కావడం, పక్షులు/ఈగలు విష ప్రభావానికి గురి కావడం, ఇతర జంతువుల జీవనం తడబడడం లాంటి ప్రతికూలతలు బయట పడుతున్నాయి.

నేల ఎడారీకరణ సంక్షోభంలోకి జారుతున్నామా !

నత్రజని, ఫాల్పరస్, పొటాషియం, ఇతర ఖనిజ లవణాలతో కూడిన రసాయన ఎరువుల వాడకంతో పంట చేను ఏపుగా ఎదిగి దిగుబడులను రెట్టింపు చేయడం జరుగుతోంది. నీటిని అధికంగా వినియోగించడంతో సారవంతమైన నేల పై పొర కొట్టుకుపోవడం వల్ల మట్టి మర్యాద మంటగలిసి క్రమంగా నేల నిస్సారమై ఎడారీరకణకు దారి తీయడంతో పాటు దిగుబడులు తగ్గడం జరుగుతుందని మరువరాదు. అడవుల నరికివేత, మైనింగ్, అధిక మొత్తంలో సాగు చేయడంతో నేల కోత, మట్టి నాణ్యత క్షీణించడం జరుగుతుంది.అనేక ఏండ్లు పాటు రసాయన ఎరువులను అపరిమితంగా పడడం వల్ల నేల సారం తగ్గడంతో పాటు నీటి నిల్వ సామర్థ్యం కూడా తగ్గుతుంది. రసాయన ఎరువులతో కూడిన సాగు పద్దతుల వల్ల దిగుబడులు తగ్గడం, జీవ వైవిధ్యం దెబ్బతినడం, పంటలకు అధికంగా పురుగులు పట్టడం, కార్బన్ నిల్వలు తగ్గడం లాంటి ప్రభావాలు కనిపిస్తాయి. ప్రతి పంట తర్వాత వ్యావసాయ వ్యర్థాలను మన చెలకల్లోనే కాల్చడం వల్ల గాలి కాలుష్యం,కార్బన్ ఉద్గారాలు, భూతాపం పెరగడమే కాకుండా నేల సారం కూడా పడిపోతున్నది.

హరిత గృహ లేదా గ్రీన్ హౌజ్ ప్రభావం:

ఆధునిక సాగులో అధిక శక్తి వనరులు వినియోగించడం జరుగుతోంది. ఆధునిక వ్యవసాయం ద్వారా 25% వరకు హరిత గృహ వాయువులు పెరగడం, భూతాపానికి ఆజ్యం పోయడం కనిపిస్తున్నది. వరి సాగు పెరగడం, పంట వ్యర్థాలను కాల్చడం వల్ల మీథేన్ లాంటి ప్రమాదకర వాయువు వెలువడడం జరుగుతున్నది. పోడు పద్దతుల్లో వ్యవసాయం పెరగడంతో అడవుల విస్తీర్ణం పెరగడం వల్ల కార్బన్ ఉద్గారాలు పెరుగుతూ పర్యావరణం విచ్ఛిన్నం కావడం, భూమి వెడెక్కడం చూస్తున్నాం. పంటలకు నష్టం కలిగిస్తున్న క్రిమి కీటకాలు, సూక్ష్మ జీవుల వల్ల దిగుబడి చాలా పడిపోతున్నది. దీని వల్ల జీవ విచ్ఛిన్నం కాని పెస్టిసైడ్స్‌ను అధిక మొత్తంలో అనాలోచితంగా వాడడం వల్ల ఆహార పదార్థాలు కలుషితం కావడం, ప్రజారోగ్యం పడిపోవడం జరుగుతున్నది. రసాయన ఎరువులను విరివిగా వాడడంతో నేల ఎడారీకరణ, కాలుష్యం పెరగడం జరుగుతున్నదని గమనిస్తూ రేపటి తరానికి నివాసయోగ్యమైన భూమిని అందించడానికి నేటి నుంచే సాగు విధానాల్లో తగు జాగ్రత్తలు తీసుకుందాం, భూగోళ సహజత్వాన్ని కాపాడుదాం.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

# ప్రభుత్వ పరంగా ఈదుల్ ఫితర్ నమాజ్ కోసం పూర్తిస్థాయిలో ఏర్పాట్లు

**సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్**

**రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన ఎంఐఎం నేత గులాం అహ్మద్ హుస్సేన్**

**సాలెహ్ నగర్ ఈద్గా వద్ద ఏర్పాట్లను పరిశీలించిన సుడా చైర్మన్, సి.పి, మున్సిపల్ కమిషనర్.. ఎంఐఎం, కాంగ్రెస్ నేతలు**




**కరీంనగర్, కొత్తపల్లి మార్చి 18:**-పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఆచరించే ఈద్-ఉల్-ఫితర్ నమాజ్ ఏర్పాట్లను ప్రభుత్వ పరంగా నగరంలోని అన్ని ఈద్గాలలో ప్రభుత్వపరంగా ఏర్పాట్లను పూర్తిస్థాయిలో చేస్తున్నట్లు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తెలిపారు. బుధవారం పోలీసు కమిషనర్ గౌష్ ఆలం, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు అంజన్ కుమార్, ట్రైనీ ఐపీఎస్ సోహం, రూరల్ ఏసీపీ విజయ్ కుమార్, ఎంఐఎం కాంగ్రెస్ కార్పొరేటర్లతో కలిసి ఆయన రేకుర్తి సాలెహ్ నగర్ చేరుకొని ఏర్పాట్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈద్-ఉల్-ఫితర్ రమజాన్ నమాజ్ ఆచరించేందుకు సుమారు 25వేల మంది పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు తరలిరానున్న నేపథ్యంలో ప్రభుత్వపరంగా చేస్తున్న ఏర్పాట్లు, వసతులు అందరికీ సౌకర్యవంతంగా చేశామని చెప్పారు. గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ నగరంలోని అన్ని ఈద్గాల వద్ద ఎంఐఎం పార్టీ విజ్ఞప్తి మేరకు ప్రభుత్వపరంగా ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందువల్ల అధికారులు నమాజ్ ఆచరించేందుకు వచ్చే వృద్ధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లను చేయాలని, షామియానాలతోపాటు త్రాగునీటి సౌకర్యాన్ని కల్పించాలన్నారు. ఒకవేళ వర్షం కురిసే సూచన ఉంటే వాటర్ ప్రూఫ్ టెంట్లను సైతం అందుబాటులోకి తేవాలని అధికారులను కోరారు. ప్రత్యేకంగా ఆర్టిసి వర్క్ షాప్ వరకు సౌండ్ సిస్టం వినిపించేలా ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్ కు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పరంగా సకల ఏర్పాట్లను చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రులు శ్రీధర్ బాబుకు, పొన్నం ప్రభాకర్లకు, సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి కి, గులాం అహ్మద్ కృతజ్ఞతలు తెలిపారు. ట్రాఫిక్ ఏర్పాట్లపై పోలీసు అధికారులతో, సిపి గౌష్ ఆలం సమీక్ష నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంఐఎం నేతలు సయ్యద్ బర్కత్ అలీ, అబ్బాస్ సమీ, ఎంఐఎం పార్టీ కార్పొరేటర్లు మొహసీన్ మొహియుద్దీన్, మాజిద్ హుస్సేన్, సయ్యద్ బియబాని ఇబ్రహీం, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, రేకుర్తి కార్పొరేటర్ మాధవి కృష్ణ గౌడ్, ఎంఐఎం నాయకులు నాయకులు బాబుజానీ, సురేష్, రాజు, షబ్బీర్, యాఖుబ్, మజారొద్దీన్, కాంగ్రెస్ నాయకులు ఇక్రామ్ సికిందర్, ఇమ్రాన్, వసీం, తదితరులు పాల్గొన్నారు.

# ఇరాన్ పై చేస్తున్న యుద్ధాన్ని వ్యతిరేకించాలి

**- కేంద్రంలోని మోడీ ప్రభుత్వం చొరవ తీసుకోవాలి**

**- సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్కా రాములు**




**పటాన్ చెరు :**అమెరికా, ఇజ్రాయిల్ ఇరాన్ పై చేస్తున్న యుద్ధాన్ని వ్యతిరేకించాలని, కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అందుకు ముందుకు రావాలని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్కా రాములు అన్నారు. బుధవారం పటాన్ చెరు పట్టణంలోని శ్రామిక్ భవన్ కార్యాలయంలో సిపిఎం పార్టీ పటాన్ చెరు ఏరియా కమిటీ విస్తృత స్థాయి సమావేశంలో చుక్కా రాములు ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడుతూ.. ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ కలిసి చేస్తున్న యుద్ధాన్ని వెంటనే ఆపివేసేలా మన దేశ ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఇరాన్ లో ఆస్తులు పూర్తిగా ధ్వంసం అయ్యాయని, మూడు దేశాల మధ్యన జరుగుతున్న యుద్ధంతో మన దేశంలోని ప్రజానికం పూర్తిగా ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ఈ యుద్ధంలో దాదాపు 1000 మందికి పైగా పౌరులు చనిపోయినట్లుగా సమాచారం వస్తుందని తెలిపారు. యుద్ధం వలన ఆర్థిక, ప్రాణ నష్టం జరుగుతుందని, యుద్ధం వద్దు, శాంతి కావాలని అన్నారు. ఇప్పటికే ప్రపంచ మార్కెట్లో పెట్రోలు, డీజిల్ గ్యాస్ ధరలు పెరిగాయని, దీనికి కారణం అమెరికాయే కారణమన్నారు. అమెరికాలో ట్రంప్ కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసనలు జరుగుతున్నాయని గుర్తు చేశారు. అమెరికా సామ్రాజ్యవాదం నశించాలని పిలుపునిచ్చారు. యుద్ధం వలన మనదేశంలో వంట గ్యాస్ ధర 60 రూపాయలు, డొమెస్టిక్ సిలిండర్ ధర 115 రూపాయలకు పెరిగి సామాన్య మధ్యతరగతి ప్రజానీకం పైన తీవ్ర భారం పడిందన్నారు. యుద్ధం విషయంలో ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఉన్నారని అన్నారు. రాష్ట్ర బడ్జెట్లో కూడా సామాన్య మధ్య తరగతి ప్రజానీకానికి అనుకూలం గా బడ్జెట్ ఉండాలని, అందుకోసం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై పెద్ద ఎత్తున ఆందోళన చేయాలని అన్నారు. సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి జి.జయరాజ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే.రాజయ్య, ఏ.మాణిక్యం, పటాన్ చెరు ఏరియా కమిటీ కార్యదర్శి బి.నాగేశ్వరరావు, ఏరియా కమిటీ సభ్యులు, ఎండి వాజిద్ అలీ, వి. పాండురంగారెడ్డి, ఎన్.శ్రీనివాసరావు, పి.శాంత కుమార్, బి.పెంటయ్య, విష్ణు, ఎంజీబీఎస్ ప్రసాద్, బి వి ఆర్ కె,రామ్మోహన్ రెడ్డి, ఏ.శ్రీనివాస్, ఇమ్మానియేల్ బాబు, సురేందర్ రెడ్డి, ఎం శ్రీనివాస్, ఎన్.నరసింహారెడ్డి, కమ్మరి రవీందర్, రత్నకుమారి, రమేష్, సాగర్, మహేష్, రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# సన్‌రైజర్స్ కొత్త కెప్టెన్‌గా ఇషాన్ కిషన్



2026 ఐపీఎల్ ప్రారంభానికి ముందు సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ కీలక ప్రకటన చేసింది. గాయం కారణంగా తమ రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ లీగ్‌లో ప్రారంభ మ్యాచ్‌లకు దూరం కానున్నాడు. దీంతో జట్టుకు కొత్త కెప్టెన్‌ను అనౌన్స్ చేసింది. యంగ్ టాలెంటెడ్ బ్యాటర్ ఇషాన్ కిషన్ తమ కొత్త కెప్టెన్‌గా ప్రకటించింది. ఇక మరో డాషింగ్ బ్యాటర్ అభిషేక్ శర్మను వైస్‌కెప్టెన్‌గా ప్రమోట్ చేసింది. కమిన్స్ గైర్హాజరీలో ఈ ఇద్దరూ జట్టును నడిపించనున్నారు. అయితే కమిన్స్ గాయం నుంచి పూర్తిగా కోలుకొని వచ్చిన తర్వాత మళ్లీ అతడికే కెప్టెన్సీ బాధ్యతలు అప్పగిస్తారు. ఈ మేరకు స్పష్టతనిస్తూ సన్‌రైజర్స్ సోషల్ మీడియాలో పోస్టు షేర్ చేసిది. కాగా, ఈ కొత్త ఎడిషన్ సన్‌రైజర్స్ మ్యాచ్‌తోనే ప్రారంభం కానుంది. మార్చి 28న సన్‌రైజర్స్- ఆర్సీబీ బెంగళూరు చిన్నస్వామి వేదికగా తలపడనున్నాయి. అయితే కొన్ని నెలలుగా కమిన్స్ వెన్ను నొప్పితో ఆటకు దూరమయ్యాడు. గతేడాది యాషెస్ సిరీస్ మధ్యలోనే వైదొలిగాడు. ఈ సిరీస్‌లో ఒకే ఒక్క టెస్టు మ్యాచ్ ఆడాడు. ఆ తర్వాత టీ20 వరల్డ్‌కప్ టోర్నమెంట్‌కు సైతం కమిన్స్ దూరంగా ఉన్నాడు. అయితే ఐపీఎల్ ప్రారంభం నాటికి కోలుకుంటాడని ముందుగా భావించారు. కానీ, కమిన్స్ ఫుల్ ఫిట్‌గా వచ్చేందుక ఇంకాస్త సమయం పట్టే అవకాశం ఉంది. దీంతో సన్‌రైజర్స్ ఈ ప్రకటన చేసింది. అయితే కమిన్స్ నాయకత్వంలో సన్‌రైజర్స్ బలమైన జట్టుగా తయారైంది. దూకుడుగా ఆడుతూ ప్రత్యర్థులకు వణుకు పుట్టించింది. జట్టులోని ఆటగాళ్లంతా అగ్రెసివ్ అప్రోచ్‌తో తొలి బంతి నుంచే బౌండరీలు బాదడం అలవాటుగా మార్చుకున్నారు. ఫలితంగా ఐపీఎల్ చరిత్రలో అత్యధిక స్కోర్లు బాదిన జాబితాలో తొలి నాలుగు స్థానాలు సన్‌రైజర్స్ పేరిటే నిలిపారు. 2024లో ఆర్సీబీపై 20ఓవర్లలో సన్‌రైజర్స్ 287-3 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఐపీఎల్‌లో ఓ జట్టు చేసిన అత్యధిక స్కోర్ ఇదే. ఆ తర్వాత 286-6 (2025లో), 278-3 (2025లో), 277-3 (2024లో) వరుస స్థానాలు సన్‌రైజర్స్‌వే కావడం విశేషం. ఇక కమిన్స్ రాక ఆలస్యం కానుండడంతో ఓపెనర్లు ఇషాన్- అభిషేక్‌కు ప్రమోషన్ దక్కినట్లైంది. అయితే ప్రస్తుతం ఇషాన్ వయసు 27ఏళ్లు. దీంతో ఈ నిర్ణయం తాత్కాలికంగానే కాకుండా దీర్ఘకాల ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకొని చేసి ఉండవచ్చు. ప్రస్తుతం కమిన్స్ వయసు 32ఏళ్లు. అంటే ఇంకో రెండు లేదా మూడేళ్లు అతడు జట్టులో ఆడే అవకాశం ఉంది. అందుకే కమిన్స్ వారసుడిగా ఇషాన్‌కు ఎంపిక చేసినట్లు అనిపిస్తుంది. దీంతో మున్ముందు ఇషాన్‌కే పూర్తిగా జట్టు బాధ్యతలు ఇవ్వడం ఖాయంగా కనిపిస్తుంది. వాస్తవానికి జట్టును నడిపించడం ఇషాన్‌కు కొత్తేం కాదు. అతడు గతేడాది దేశవాళీ టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీలో ఝార్ఖండ్ జట్టుకు నాయకత్వం వహించాడు. ఆ టోర్నీలో తన బ్యాటింగ్‌తోపాటుగా కెప్టెన్సీ స్కిల్స్‌తో ఆకట్టుకున్నాడు. ఏకంగా జట్టును ఛాంపియన్‌గా నిలిపాడు. ఇప్పుడు అదే అనుభవంతో ఐపీఎల్‌లోనూ సన్‌రైజర్స్‌ను ముందుకు నడిపించేందుకు సిద్ధమవుతున్నాడు.

సన్‌రైజర్స్ జట్టు 2026 : అభిషేక్ శర్మ, అనికేత్ వర్మ, బ్రైడన్ కార్సే, ఎషాన్ మలింగ, హర్ష్ దూబే, హర్షల్ పటేల్, హెన్రిచ్ క్లాసెన్, ఇషాన్ కిషన్, జయదేవ్ ఉనద్కట్, కమిందు మెండిస్, నితీష్ కుమార్ రెడ్డి, పాట్ కమిన్స్, స్మరణ్ రవిచంద్రన్, ట్రావిస్ హెడ్, సల్షన్ అన్రో, లియామ్ లివింగ్‌స్టోన్ , జాక్ ఎడ్వర్డ్స్, అమిత్ కుమార్, క్రెయిన్స్ ఫులేట్రా, షకిబ్ హుస్సేన్, ఓంకార్ తర్మలే, ప్రఫుల్ హింగే, శివమ్ మావి



# హోం గ్రౌండ్‌లో ఆడనున్న ఆర్సీబీ

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఫ్యాన్స్‌కు శుభవార్త. ఈ ఏడాది మార్చి 28న ప్రారంభం కానున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) లో ఆర్సీబీ తమ మ్యాచ్‌లను చిన్నస్వామి స్టేడియంలో ఆడేందుకు కర్ణాటక ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ప్రభుత్వం మార్చి 16న అధికారిక ప్రకటన చేసింది. మ్యాచ్‌ల నిర్వహణపై నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదికపై సోమవారం విధానసౌధలో హోం మంత్రి పరమేశ్వర అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ మీటింగ్‌లో చిన్నస్వామి స్టేడియంలో మ్యాచ్‌లు నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో చిన్నస్వామిలో తమ సొంత అభిమానుల మధ్య ఆడేందుకు ఆర్సీబీకి లైన్ క్లియర్ అయ్యింది. ఈ సీజన్‌లో చిన్నస్వామి స్టేడియంలో ఆర్సీబీ 5 మ్యాచ్‌లు ఆడనుంది. ఇక ఈ ఏడాది తొలి మ్యాచ్‌లో ఆర్సీబీ- సన్‌రైజర్స్ పోటీపడనున్నాయి. ఈ మ్యాచ్‌కు చిన్నస్వామి స్టేడియం వేదిక కానుంది. కాగా, గతేడాది జూన్ 04న ఆర్సీబీ విజయోత్సవ సంబరాల్లో ఇదే స్టేడియం వద్ద తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోగా, పదుల సంఖ్యలో గాయపడ్డారు. దీంతో అప్పట్నుంచి భారీ ఈవెంట్లు నిర్వహించేందుకు చిన్నస్వామి స్టేడియం సురక్షితం కాదని అందులో మ్యాచ్‌లు బ్యాన్ చేశారు. తాజాగా నిపుణుల నివేదికతో మళ్లీ అనుమతి వచ్చింది. ఈ ఫ్రాంచైజీ రాయ్‌పూర్‌లోని షహీద్ వీర్ నారాయణ్ సింగ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంను కూడా తమ రెండవ హోమ్‌గా పరిగణిస్తుంది. ఇక్కడ ఆర్సీబీ రెండు లీగ్ మ్యాచ్‌లు ఆడనుంది. వీటితో పాటు, ఒక ఐపీఎల్ ప్లేఆఫ్ మ్యాచ్ అలాగే ఫైనల్స్ కూడా బెంగళూరులో జరగనున్నాయి.

# లైఫ్ పార్ట్‌నర్ కోరుకునేది భర్త ఎదుగుదలే



టీమ్‌ఇండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఇటీవలే దేశానికి పొట్టి ప్రపంచకప్‌ను అందించాడు. మార్చి 28 నుంచి జరగబోయే ఐపీఎల్ కోసం సన్నద్ధమవుతున్నాడు. ఈ క్రమంలో పీటీఐ వీడియోస్ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్నాడు. అందులో తన క్రికెట్ కెరీర్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. అలాగే తన భార్య దేవిషా తన క్రికెట్ కెరీర్ గమనాన్ని మార్చేసిందని చెప్పుకొచ్చాడు. జాతీయ జట్టుకు ఎంపికయ్యేలా తనను తీవ్రంగా శ్రమించేలా పురిగొల్పింది కూడా దేవిషాయేనని వెల్లడించాడు. తాను ప్రస్తుతం ఇంతటి స్థాయిలో ఉండడానికి కూడా ఆమే కారణమని ప్రశంసించాడు. తన భార్య దేవిషాను ఎంత పొగిడినా తక్కువేనని అభిప్రాయపడ్డాడు. సూర్యకుమార్ యాదవ్ తన భార్య దేవిషాతో జరిగిన ఆసక్తికర చర్చ గురించి వివరించాడు. “2016లో దేవిషాతో నాకు పెళ్లైంది. అప్పుడు నేనే ఐపీఎల్‌లో కేకేఆర్ తరఫున ఆడుతున్నాను. గేమ్‌ను ఆస్వాదిస్తున్నాను. అంతా సజావుగా సాగుతోంది. అయితే నేను 2018లో ముంబయి ఇండియన్స్ ఫ్రాంచైజీకి మారేంత వరకు దేవిషా నా కెరీర్‌ను, దినచర్యను గమనిస్తూ వచ్చింది. అప్పుడు నాకు ఒక ప్రశ్న వేసింది. ‘ఐపీఎల్‌లో నీతోపాటు ఆడే నీ వయసు వాళ్లలో చాలామంది ఇప్పుడు భారత్ తరఫున ఆడుతున్నారు. నీ మనసులో ఏముంది’ అని దేవిషా ప్రశ్నించింది. అప్పుడు నేను ‘నాకు కూడా టీమ్‌ఇండియా తరఫున ఆడాలని ఉంది’ అని చెప్పాను. ‘ఎలా ఆడుతావు’ అని దేవిషా నన్ను అడిగింది” అని భారత జట్టు టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ వెల్లడించాడు. నా భార్య దేవిషాతో ఒక చక్కని సంభాషణ జరిగింది. వాదనేం కాదు. కేవలం చర్చ మాత్రమే. అప్పుడు నేను భారత్ తరఫున ఆడాలనుకుంటే ఏం చేయాలని ఆలోచించాను. అది ఎలా అని ఆలోచించుకున్నాను. డైట్, ఫ్రెండ్స్‌తో వీకెండ్స్, శని-ఆదివారాలు విశ్రాంతి, సోమవారం నుంచి శుక్రవారం వరకు పని వంటి చాలా విషయాలలో రాజీ పడ్డాను. 2018లో నేను ఐపీఎల్‌లో ముంబయి ఇండియన్స్ తరఫున (512 పరుగులు) చేశాను. అలాగే దేశీయ క్రికెట్‌లో కూడా రాణించాను. ఆ తర్వాతి 2019, 2020లో కూడా ముంబయి తరఫున ఓపెనింగ్ చేశాను.

## ముంబై ఇండియన్స్ ఆటతీరును

# మార్చుకో బోతోంది

ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో ఛాంపియన్లకే ఛాంపియన్ ముంబై ఇండియన్స్... చెన్నై సూపర్ కింగ్స్ తర్వాత ముంబై ఇండియన్స్ ఛాంపియన్ గా అవతరించింది. ఎన్నో విజయాలు సాధించింది... అడపాదడపా ఓటములతో అనుభవాలను నేర్చుకున్న ముంబై ఇండియన్స్ గత రెండు సీజన్లలో పేలవ ప్రదర్శనతో వెనుకబడింది. లోటుపాట్లను సరిదిద్దుకున్న ముంబై ఇండియన్స్... ఐపీఎల్ 2026 సీజన్ లో సత్తా చాటాలని ఎదురు చూస్తోంది. ప్రత్యర్థి జట్లపై విరుచుకుపడి భారీ స్కోర్లను సాధించాలనే లక్ష్యంతో జట్టును పటిష్టం చేసింది. అన్ని విభాగాల్లోనూ ప్రతిభావంతులతో టీమ్ ను తీర్చిదిద్దింది. ముంబై ఇండియన్స్ కెప్టన్ గా సుధీర్ఘ కాలం ప్రాతినిధ్యం వహించిన రోహిత్ శర్మ... హార్ధిక్ పాండ్యాకు బాధ్యతలు అప్పగించారు. విజయాలకు మారుపేరుగా ఉన్న ముంబై ఇండియన్స్... ఇపుడు పరాజయాల పరంపరను కొనసాగిస్తోంది. 2026 సీజన్ ను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ముంబై ఇండియన్స్... భారీ స్కోర్లను సాధించే దిశగా వ్యూహరచన చేస్తోంది. వేదిక ఏదైనా... ప్రత్యర్థి జట్టుతో పోటీపడి ఘన విజయాలను సొంతం చేసుకోడానికి సిద్ధమైంది. క్రీజులో నిలబడితే చాలు... హార్డ్ హిట్లతో స్కోరు బోర్డు అమాంతంగా పరుగులు పెట్టే విధంగా ముంబై ఇండియన్స్ ఆట సాగబోతోంది. టీ20 వరల్డ్ కప్ విన్నింగ్ కెప్టన్, డాషింగ్ బ్యాట్స్ మెన్ సూర్యకుమార్ యాదవ్ ముంబై ఇండియన్స్ తరఫున ఆడుతున్నాడు. టీమిండియాకు కెప్టెన్ గా ఉన్న సూర్యకుమార్ యాదవ్, ముంబై ఇండియన్స్ లో సాధారణ ఆటగాడిగా కొనసాగుతారా హార్ధిక్ పాండ్యా నుంచి బాధ్యతలను సూర్యకుమార్ కు బదలాయిస్తారా అనే ప్రశ్నలు చర్చనీయాంశంగా మారాయి. ముంబై ఇండియన్స్ తరఫు రోహిత్ శర్మతోపాటు ఓపెనింగ్ బ్యాట్స్ మెన్ గా జతకట్టేది ఎవరు క్రికెట్ అభిమానుల్లో ప్రశ్నలు తలెత్తున్నాయి. దక్షిణాఫ్రికా క్రికెటర్, కెప్టన్ గా ప్రాతినిధ్యం వహించిన క్వింటన్ డీకాక్, విల్ జాక్స్ ఇద్దరిలో ఒకరు ఓపెనింగ్ బ్యాట్స్ మెన్ గా దిగే అవకాశాలున్నాయి. తాజా సీజన్ లో ముంబై ఇండియన్స్ బ్యాటింగ్ బలం కీ రోల్ పోషించబోతోంది. ఓపెనర్లు పరుగుల వరద పారించే విధానాన్ని టాప్ ఆర్డర్ బ్యాట్స్ మెన్ అనుసరించే విధంగా ఆటగాళ్లను బరిలోకి దింపుతున్నారు.



# వన్డే ర్యాంకింగ్స్‌లో భారత క్రికెటర్ల సత్తా

ఐసీసీ తాజాగా ప్రకటించిన వన్డే ర్యాంకింగ్స్‌లో భారత క్రికెటర్లు తమ సత్తా చాటారు. ముఖ్యంగా బ్యాటింగ్ విభాగంలో టీమిండియా ప్లేయర్లు టాప్-5లో ఏకంగా మూడు స్థానాలను కైవసం చేసుకోవడం విశేషం. ఐసీసీ విడుదల చేసిన తాజా వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో న్యూజిలాండ్ స్టార్ బ్యాటర్ డారిల్ మిచెల్ అగ్రస్థానాన్ని కైవసం చేసుకోగా.. భారత రన్ మెషీన్ విరాట్ కోహ్లీ రెండో స్థానంలో నిలిచి తన ఫామ్‌ను చాటుకున్నారు. ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన ఇబ్రాహీం జద్రాన్ మూడో స్థానంలో ఉండగా.. భారత కెప్టెన్ రోహిత్ శర్మ నాలుగో స్థానంలో, యువ సంచలనం శుభ్‌మన్ గిల్ ఐదో స్థానంలో నిలిచారు. ప్రపంచంలోని టాప్-5 బ్యాటర్లలో ముగ్గురు భారతీయులే ఉండటం టీమిండియా బ్యాటింగ్ పటిష్టతకు నిదర్శనం. బౌలింగ్ విభాగంలో ఆఫ్ఘనిస్తాన్ స్పిన్ మాంత్రికుడు రషీద్ ఖాన్ నంబర్ 1 స్థానాన్ని దక్కించుకున్నారు. ఇంగ్లాండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్, దక్షిణాఫ్రికా స్పిన్నర్ కేశవ్ మహారాజ్ తర్వాతి స్థానాల్లో నిలిచారు. ఆశ్చర్యకరంగా నమీబియాకు చెందిన బెర్నార్డ్ స్కోల్ట్జ్ నాలుగో స్థానంలో నిలిచి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఇక ఆల్‌రౌండర్ల జాబితాలో కూడా ఆఫ్ఘనిస్తాన్ ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తోంది. అజ్మతుల్లా ఒమర్జాయ్ మొదటి స్థానంలో ఉండగా,..సికందర్ రజా (జింబాబ్వే), మహ్మద్ నబీ (ఆఫ్ఘనిస్తాన్) టాప్-3లో నిలిచారు. మహిళల వన్డే క్రికెట్‌లోనూ భారత్ తన జెండాను ఎగురవేసింది. స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో కొనసాగుతూ దేశానికి గర్వకారణంగా నిలిచింది.

# వైభవ్ గేమ్‌ప్లాన్ రివీల్ చేసిన శాంసన్



2026 ఐపీఎల్ ప్రారంభానికి రోజులు దగ్గరపడుతున్నాయి. ఇదే నెల 28న కొత్త సీజన్ గ్రాండ్‌గా షురూ కానుంది. ఈ క్రమంలో మరోసారి అందరి చూపు యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపైనే నెలకొంది. గతేడాది ఐపీఎల్‌లో అరంగేట్రం చేసి విధ్వంసం సృష్టించిన ఈ చిచ్చరపిడుగుపై ఈసారి భారీగా అంచనాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో వైభవ్ గురించి శాంసన్ ఓ ఆసక్తికర విషయం బయట పెట్టాడు. మార్చి 15న బీసీసీఐ ఢిల్లీ వేదికగా నమన్ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించింది. ఈ ఈవెంట్‌లో ఇటీవల వరల్డ్‌కప్ సాధించిన మహిళల, పురుషుల జట్లను సన్మానించారు. వైభవ్ సూర్యవంశీ కూడా ఈ కార్యక్రమానికి వచ్చాడు. అతడు తన సీనియర్లు హార్దిక్ పాండ్య, అభిషేక్ శర్మ, సంజు శాంసన్‌తో కలిసి కృశ్చన్ సెషన్‌లో పాల్గొన్నాడు. అందులో వైభవ్‌కు హోస్ట్ ఆసక్తికర ప్రశ్నలు అడిగాడు. ఐపీఎల్‌లో తాను ఎదుర్కొన్న తొలి బంతి ఎక్కడికి వెళ్లింది అని అడగ్గా, ‘లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌పై డెబ్యూ మ్యాచ్ ఆడాను. ఆ మ్యాచ్‌లో నేను ఎదుర్కొన్న తొలి బంతినే కవర్స్ మీదుగా సిక్స్ కొట్టాను’ అని వైభవ్ రిప్లై ఇచ్చాడు. ‘అయితే మీ కోచ్ ఇక్కడే ఉన్నాడు (రాహుల్ ద్రవిడ్‌ను ఉద్దేశిస్తూ). ఆయన టెస్టుల్లో ఓపిగ్గా ఆడుతూ రెండు రోజులు కూడా బ్యాటింగ్ చేయగలడు. అలాంటిది నువ్వు తొలి బంతినే సిక్స్ కొడతానని చెప్పినప్పుడు ఆయన రియాక్షన్ ఏంటి’ అని అడిగాడు. దీనికి వైభవ్ సమాధానం చెబుతుండగా, అక్కడే ఉన్న శాంసన్ మధ్యలో కల్పించుకొని వివరంగా చెప్పాడు. “లఖ్‌నవూతో మ్యాచ్ ముందు రోజు ద్రవిడ్ సర్ నన్ను, వైభవ్‌ను రూమ్‌కు పిలిచాడు. ‘వైభవ్ చాలా చిన్నపిల్లవాడు. ఎలా ఆడాలి ఎలా ముందుకెళ్లాలో మనం అతడికి చెప్పాలి’ అని సర్ అన్నాడు. వెంటనే ‘వైభవ్ నీ గేమ్ ప్లాన్ ఏంటి’ అని రాహుల్ సర్ అతడిని అడిగాడు. దీనికి అతడు ‘ప్లాన్ అంటూ ఏమీ లేదు సర్, అవకాశం వస్తే తొలి బంతినే గాల్లోకి లేపేయడమే’ అని చెప్పాడు. అతడు వీడియో గేమ్ ఆడుతున్నాడా ఏంటి అని నేను అప్పుడే అనుకున్నా” అని శాంసన్ నవ్వుతూ వైభవ్ అరంగేట్రం కంటే ముందు జరిగిన సంభాషణను షేర్ చేసుకున్నారు.

ఆ సంభాషణలో చెప్పినట్లే వైభవ్ ఆ మ్యాచ్‌లో తాను ఎదుర్కొన్న తొలి బంతినే సిక్స్‌గా మలిచాడు. కాగా, గతేడాది లఖ్‌నవూతో జరిగిన మ్యాచ్‌తో వైభవ్ ఐపీఎల్‌లో అరంగేట్రం చేశాడు. ఈ మ్యాచ్‌లో ఓపెనర్‌గా బ్యాటింగ్‌కు దిగిన వైభవ్ తాను ఎదుర్కొన్న తొలి బంతినే సిక్స్‌గా మలిచి ఔరా అనిపించాడు. శార్దూల్ ఠాకూర్ వేసిన ఆ ఓవర్ నాలుగో బంతిని వైభవ్ కవర్స్ దిశగా స్టాండ్స్‌కు పంపించాడు. అలా ఐపీఎల్ కెరీర్‌ను సిక్స్‌తో ఆరంభించిన అతికొద్దిమంది క్రికెటర్లలో ఒకడిగా నిలిచాడు.

గురువారం,
మార్చి 19, 2026
హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక


# ‘ఉస్తాద్‘కి హైలైట్ గా నిలిచే విలనిజం!

‘ఉస్తాద్ భగత్ సింగ్‘ .. మరికొన్ని గంటల్లో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతోంది. హరీశ్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ సినిమాపై ఒక రేంజ్ లో అంచనాలు ఉన్నాయి. అడ్వాన్స్ బుకింగ్స్ దగ్గర నుంచి ప్రతి విషయంలోను ఈ సినిమా కొత్త రికార్డులను సృష్టించడం ఖాయమనే అభిప్రాయంతో అభిమానులు ఉన్నారు. శ్రీలీల – రాశీ ఖన్నా కథానాయికలుగా నటించిన ఈ సినిమాలో, ప్రతినాయకుడిగా పార్తీబన్ కనిపించనున్నాడు. కోలీవుడ్ సీనియర్ స్టార్ హీరోలు, కొంతకాలంగా తెలుగులో విలన్ రోల్స్ చేస్తూ వెళుతున్నారు. పవర్ఫుల్ విలన్ గా తెలుగు తెరపై కనిపించడానికి వాళ్లు ఎంతమాత్రం వెనకాడటం లేదు. ఆ జాబితాలో అర్జున్ .. అరవింద్ స్వామి .. విజయ్ సేతుపతి వంటి స్టార్స్ కనిపిస్తున్నారు. తాజాగా ఆ వరుసలోకి పార్తీబన్ చేరిపోయాడు. తమిళంలో సీనియర్ హీరోగా .. దర్శక నిర్మాతగా పార్తీబన్ కి మంచి ఇమేజ్ ఉన్న సంగతి తెలిసిందే. ఈ జనరేషన్ తెలుగు ఆడియన్స్ కి పార్తీబన్ అంతగా తెలియదు. ఎందుకంటే నేరుగా ఆయన తెలుగులో చేసిన సినిమాలు చాలా తక్కువ. తమిళ సినిమాల అనువాదాలు ద్వారానే ఆయన ఇక్కడి ఆడియన్స్ కి తెలుసు. అలాంటి పార్తీబన్ ఈ సినిమాలో పవర్ఫుల్ విలన్ పాత్రలో కనిపించనున్నాడు. ఆయన పాత్రను హరీశ్ శంకర్ చాలా డిఫరెంట్ గా డిజైన్ చేశాడట. ఈ పాత్ర ఈ సినిమా హైలైట్స్ లో ఒకటిగా నిలుస్తుందని అంటున్నారు. విలక్షణమైన విలనిజంతో పార్తీబన్ ఏ రేంజ్ లో మెప్పిస్తాడో చూడాలి మరి.






# హీరోల ఆలోచనా విధానంపై తాప్సీ విమర్శలు

బాలీవుడ్ ‘ఫైర్ బ్రాండ్‘ తాప్సీ పన్ను తాజాగా ఒక ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు సినీ పరిశ్రమలో మరోసారి ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా అగ్ర హీరోల అభద్రతా భావం గురించి ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి.తాప్సీ తన తాజా ఇంటర్వ్యూలో హీరోల ఆలోచనా విధానాన్ని ఎండగట్టింది. కథానాయికలకు ప్రాధాన్యత ఉన్న సినిమాల్లో నటించడానికి చాలా మంది స్టార్ హీరోలు సిద్ధంగా లేరని ఆమె విమర్శించింది. ఈ సందర్భంగా తనకు ఎదురైన ఒక చేదు అనుభవాన్ని తాప్సీ పంచుకుంది.“ఒక సినిమాలో నేను డబుల్ రోల్ చేస్తున్నప్పుడు, సదరు హీరో ఆ ప్రాజెక్ట్‌ను రిజెక్ట్ చేశాడు. దానికి ఆయన చెప్పిన కారణం ఏంటంటే.. సినిమాలో హీరోయిన్ పాత్రకు ఎక్కువ నిడివి, ప్రాధాన్యత ఉంటే చివరకు ప్రేక్షకుల సానుభూతి, ప్రశంసలు ఆమెకే దక్కుతాయని ఆయన భయపడ్డాడు. అంతకుముందే ఆ హీరోతో తాను కలిసి పనిచేసినప్పటికీ... కేవలం తన పాత్రకు ప్రాధాన్యత ఎక్కువగా ఉందనే అభద్రతా భావంతో ఆయన వెనక్కి తగ్గడం నన్ను ఆశ్చర్యపరిచింది“ అని తాప్సీ వెల్లడించింది.కేవలం సీనియర్ హీరోలే కాదు, ఇండస్ట్రీలోకి కొత్తగా వస్తున్న యువ హీరోలు కూడా హీరో పాత్ర నిడివి తక్కువగా ఉంటే అటువంటి సినిమాలకు దూరంగా ఉంటున్నారని ఆమె విమర్శించింది. హీరోయిన్ డామినేట్ చేస్తుందనే భయంతో మంచి కథలను వదులుకోవడం వల్ల చిత్ర పరిశ్రమలో సమానత్వం అనేది ప్రశ్నార్థకంగా మారుతోందని ఆమె అభిప్రాయపడింది. ప్రస్తుతం తాప్సీ వ్యాఖ్యలపై నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

# రాజకీయాల్లోకి రావడంపై క్లారిటీ ఇచ్చిన నారా రోహిత్

టాలీవుడ్ నటుడు నారా రోహిత్ తన రాజకీయ రంగప్రవేశంపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు అటు సినీ, ఇటు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీశాయి. తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తన భవిష్యత్ ప్రణాళికలపై స్పష్టతనిచ్చారు.ముఖ్యమంత్రి చంద్రబాబు సోదరుడి కుమారుడిగా, లోకేశ్ కు సోదరుడిగా రాజకీయ నేపథ్యం ఉన్నప్పటికీ... రోహిత్ ఇప్పటి వరకు సినిమాలకే పరిమితమయ్యారు. తాజాగా ఆయన మాట్లాడుతూ, “కచ్చితంగా రాజకీయాల్లోకి వస్తాను. కానీ దానికి ఇంకా సమయం ఉంది. సరైన సమయంలో నా రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభిస్తాను“ అని తెలిపారు. ప్రస్తుతం తన పూర్తి దృష్టి సినిమాలపైనే ఉందని, వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను అలరించడమే తన మొదటి ప్రాధాన్యత అని వెల్లడించారు.



# ఆల్-టైమ్ రికార్డులపై కన్నేసిన ‘ధురంధర్ 2’

రణ్‌వీర్ సింగ్ హీరోగా, ఆదిత్య ధర్ దర్శకత్వంలో రాబోతున్న ‘ధురంధర్ 2’ చిత్రం విడుదలకు ముందే బాక్సాఫీస్ వద్ద సరికొత్త సంచలనాలు సృష్టిస్తోంది. ఈ సినిమాపై ప్రేక్షకుల్లో కనిపిస్తున్న అసాధారణమైన క్రేజ్, అడ్వాన్స్ బుకింగ్స్ రూపంలో రికార్డులు సృష్టిస్తోంది. ఈ ప్రభంజనం ఎంతలా ఉందంటే, ముంబైలోని ఐకానిక్ థియేటర్ మరాఠా మందిర్‌లో దశాబ్దాలుగా ప్రదర్శితమవుతున్న షారుఖ్ ఖాన్ ‘దిల్‌వాలే దుల్హనియా లేజాయేంగే‘ (డీడీఎల్‌జే) షో సమయాన్ని కూడా మార్చాల్సి వచ్చింది.‘ధురంధర్ 2’ నిడివి దాదాపు 3 గంటల 55 నిమిషాలు ఉండటంతో థియేటర్లు షోలను సర్దుబాటు చేయడంలో తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ఇందులో భాగంగా ఇవాళ్టి నుంచి మరాఠా మందిర్‌లో డీడీఎల్‌జే ప్రదర్శనను ఉదయం 10 గంటలకు మార్చారు. గత మూడు దశాబ్దాలుగా ప్రతిరోజూ ఉదయం 11:30 గంటలకు ప్రదర్శించబడుతూ వస్తోంది. దశాబ్దాల చరిత్రలో డీడీఎల్‌జే షో సమయం ఇలా మారడం ఇదే తొలిసారి. ఈ థియేటర్‌లో ‘ధురంధర్ 2’ ను మధ్యాహ్నం 1:15, సాయంత్రం 5:30, రాత్రి 9:45 గంటలకు ప్రదర్శించనున్నారు. దేశవ్యాప్తంగా పలు థియేటర్లు అర్ధరాత్రి, తెల్లవారుజామున కూడా ప్రత్యేక షోలను ప్లాన్ చేస్తున్నాయి. గతంలో ‘పుష్ప 2‘, ‘యానిమల్‘ వంటి భారీ చిత్రాలకు ఇలాంటి మార్పులు జరిగినప్పటికీ, ఒక హిందీ సినిమాకు అడ్వాన్స్ బుకింగ్స్ దశలోనే ఈ స్థాయిలో ఏర్పాట్లు జరగడం ఇదే మొదటిసారి.ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఆల్-టైమ్ రికార్డులపై కన్నేసింది. అడ్వాన్స్ బుకింగ్స్ సరళిని గమనిస్తే, తొలిరోజు వసూళ్లలో షారుఖ్ ఖాన్ ‘జవాన్‘ రికార్డును ‘ధూరందర్ 2‘ అధిగమించేలా కనిపిస్తోంది. ‘జవాన్‘ తొలిరోజు హిందీలో రూ. 65.50 కోట్లు, దేశవ్యాప్తంగా రూ. 75 కోట్లు వసూలు చేసింది. ఇప్పటికే ‘ధురంధర్ 2’ అడ్వాన్స్ బుకింగ్స్ ద్వారా రూ. 30.31 కోట్లు రాబట్టింది. ‘జవాన్‘ రికార్డును అందుకోవాలంటే మరో రూ. 35 కోట్ల వరకు అవసరం.అయితే, హిందీ చిత్ర పరిశ్రమలో ఆల్-టైమ్ హైయెస్ట్ ఓపెనర్ రికార్డు ప్రస్తుతం అల్లు అర్జున్ ‘పుష్ప 2‘ పేరిట ఉంది. ఈ చిత్రం తొలిరోజు హిందీలో రూ. 72 కోట్లు, పాన్-ఇండియా స్థాయిలో రూ. 164.25 కోట్లు వసూలు చేసింది. ఇప్పుడు ‘ధురంధర్ 2’ ఈ భారీ రికార్డును సవాలు చేస్తుందో లేదోనని సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. మొత్తానికి విడుదలకు ముందే ‘ధురంధర్ 2’ బాక్సాఫీస్ వద్ద పెను తుపానుకు సంకేతాలు పంపుతోంది.







# ‘పెద్ది‘ సెట్స్‌లో క్రికెటర్ తిలక్ వర్మ..

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, సంచలన దర్శకుడు బుచ్చిబాబు సానా దర్శకత్వంలో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం ‘పెద్ది‘. గ్రామీణ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా సెట్స్‌లో తాజాగా టీమిండియా యువ క్రికెటర్ తిలక్ వర్మ సందడి చేశాడు. ఈ అనూహ్య పరిణామం చిత్ర యూనిట్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ విషయాన్ని దర్శకుడు బుచ్చిబాబు సానా స్వయంగా తన సోషల్ మీడియా ఖాతా ద్వారా వెల్లడించారు. రామ్ చరణ్, తిలక్ వర్మ కలుసుకున్న వీడియోను పంచుకుంటూ... “టీ20 ప్రపంచకప్ ఛాంపియన్ తిలక్ వర్మ ‘పెద్ది‘ సెట్స్‌ను సందర్శించారు. సినిమాలోని కొన్ని క్రీడా నేపథ్య సన్నివేశాలను చూసి ఆయన చాలా ఇంప్రెస్ అయ్యారు“ అని పేర్కొన్నారు. ఈ పోస్ట్‌తో పాటు సినిమాను ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మరోసారి ధ్రువీకరించారు. సెట్స్‌లో జరిగిన ఈ భేటీలో తిలక్ వర్మ సినిమాలోని కొన్ని కీలక స్పోర్ట్స్ సీక్వెన్స్ ఫుటేజ్‌ను వీక్షించినట్లు సమాచారం. కేవలం యాక్షన్ మాత్రమే కాకుండా ఆ సన్నివేశాల్లోని భావోద్వేగాలను చూసి ఆయన చాలా బాగున్నాయని ప్రశంసించినట్లు చిత్రవర్గాలు తెలిపాయి. తిలక్ వర్మ లాంటి ఒక ప్రొఫెషనల్ క్రీడాకారుడి నుంచి వచ్చిన ఈ ప్రశంస, తాము తీస్తున్న సన్నివేశాలు ఎంతో వాస్తవికంగా, ఉద్వేగభరితంగా ఉన్నాయనే నమ్మకాన్ని చిత్ర బృందంలో మరింత పెంచిందని తెలుస్తోంది.

ఈ సందర్భంగా రామ్ చరణ్, తిలక్ వర్మను ప్రత్యేకంగా అభినందించి, తన ఆటోగ్రాఫ్‌తో కూడిన ‘పెద్ది‘ సినిమా బ్యాట్‌ను




బహుమతిగా అందించారు. అనంతరం తిలక్ వర్మ చిత్ర యూనిట్‌ను ఉద్దేశించి తెలుగులో మాట్లాడటం అందరినీ ఆకట్టుకుంది. ప్రస్తుతం ఈ సినిమా చివరి షెడ్యూల్ చిత్రీకరణతో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు, బోమన్ ఇరానీ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆర్. రత్నవేలు సినిమాటోగ్రఫీ, నవీన్ నూలి ఎడిటింగ్, అవినాశ్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్ వంటి స్పెట్జెన్ సాంకేతిక నిపుణుల పనితనం సినిమా స్థాయిని పెంచుతోంది.

# ‘ఉస్తాద్‘ ఉప్పెనలా పాత రికార్డులు తుడిచేస్తాడంటున్న ఫ్యాన్స్!

పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ అంతా ఇప్పుడు ‘ఉస్తాద్ భగత్ సింగ్‘ సినిమా కోసం వేయికళ్లతో వెయిట్ చేస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ వారు భారీ బడ్జెట్ తో నిర్మించిన ఈ సినిమా, టైటిల్ దగ్గర నుంచే అంచనాలను పెంచడం మొదలుపెట్టింది. ఇక పోస్టర్స్ దగ్గర నుంచే అందరిలోను ఆసక్తిని పెంచుతూ వెళ్లింది. పవన్ కల్యాణ్ కి ఉన్న మాస్ ఇమేజ్ కీ .. ఆయన బాడీ లాంగ్వేజ్ కి సరిగ్గా సరిపోయే కంటెంట్ అనేది అభిమానులకు అర్థమైపోయింది. ఈ సినిమాకి దర్శకుడు హరీశ్ శంకర్ కావడం ఇక్కడ మరో విశేషం. హరీశ్ శంకర్ కి మాస్ ఆడియన్స్ పల్స్ తెలుసు. పవన్ సినిమా నుంచి ఫ్యాన్స్ ఏం కోరుకుంటున్నారనేది ఆయనకి తెలుసునని అనడానికి ‘గబ్బర్ సింగ్‘ సినిమాను ఒక ఉదాహరణగా తీసుకోవచ్చు. దేవిశ్రీ బాణీలు .. తమన్ నేపథ్య సంగీతం ఈ సినిమాకి ప్రధానమైన ఆకర్షణగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ సినిమా అడ్వాన్స్ బుకింగ్స్ జోరు చూస్తేనే, ఏ స్థాయిలో ఆడియన్స్ ఉత్సాహాన్ని చూపిస్తున్నారనేది అర్థమైపోతుంది.

పవన్ కల్యాణ్ జోడీగా శ్రీలీల తొలిసారిగా చేసిన సినిమా ఇది. నటన పరంగా .. డాన్స్ పరంగా శ్రీలీలకి వంక బెట్టడానికి లేదు. అయితే ఆమెకి సరైన హిట్ లేక చాలా కాలమే అవుతోంది.

ఈ నేపథ్యంలో ఈ సినిమాపై ఆమె గట్టిగానే ఆశలు పెట్టుకుంది. ఇక రాశీ ఖన్నా కెరియర్ గ్రాఫ్ చాలా స్లో అయిన తరువాత ఆమెకి దక్కిన గొప్ప అవకాశం ఇది. హరీశ్ శంకర్ కి కూడా ఈ సినిమా హిట్ చాలా కీలకం కానుంది. ‘ఉస్తాద్‘ ఉ ప్పెనలా పాత రికార్డులు తుడిచేయడం ఖాయమనే అభిమానుల అంచనాలను ఈ సినిమా నిజం చేస్తుందేమో చూడాలి.



Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com